# దారి దీపం

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175 మాసపత్రిక

సంపుటి 3 - సంచిక 9 | జూన్ 2025 | వెల : రూ.15

ప్రగతిశీల ప్రత్యామ్నాయానికి పూనుకోవాలి

మోడీ 11 ఏళ్ల పాలన : సరిచేయలేని స్థాయికి చేరుతోన్న సామాజిక తిరోగమనం

మోడీ @ 11- రివర్స్ పొగడ్తలు!

యోగాను ఆదరించండి మోడీ రాజకీయాన్ని నిరసించండ

యోగా దినోత్సవం-హిందూత్వ ఎజెండా

పెరుగుతున్న సైనిక వ్యయం

జీడీపీ సంబరాలు - భారతీయుల వాస్తవ స్థితిగతులు

అంకెలు ఆమోదించని అచ్ఛేదిన్

ఎన్నికల్లో రిగ్గింగ్ చేయడమెలా ?

కులగణన ఎలా జరగాలి

పౌరసత్వం నిరూపించుకోవాలని కోరటం బీహారీల ఆత్మగౌరవాన్ని ప్రశ్నించడమే

గాంధీ నమ్మకాన్ని నిలబెట్టుకున్నామా

భారతీయ వైజ్ఞానిక పరిశోధనాశాలల పితామహుడు

టిడిపి కూటమి ఏడాది పాలన.. వ్యవసాయ రంగానికిచ్చిన హామీలు - అమలు

విద్యుత్ ఒప్పందాలు -వినియోగదారులపై భారాలు

విద్యా వ్యవస్థ - మానవీయ విలువలు

బహుముఖ ప్రజ్ఞావంతురాలు డాక్టర్ చిరంజీవినీకుమారి

బనకచర్లపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలి

బీఆర్ అంబేద్కర్ మార్గం : దేశంలో సామ్యవాద ఆర్థిక అభివృద్ధి

ఫాసిజంతో పోరాడిన చిత్రకళ

జూన్ - 2025 పేజీలు : 44

# దారి దీపం

మాసపత్రిక

సంపుటి : 3 - సంచిక : 9

డి.వి.వి.యస్.వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

ఈ సంచికలో..

1). ప్రగతిశీల ప్రత్యామ్నాయానికి పూనుకోవాలి .. సంపాదకీయం 3
2) మోడీ పాలన : సరిచేయలేని స్థాయికి సామాజిక తిరోగమనం -ఆనంద్ తేల్తుంబ్డే 4
3) మోడీ @11- రివర్స్ పొగడ్తలు! - తెలకపల్లి రవి 7
4) యోగాను ఆదరించండి మోదీ రాజకీయాన్ని నిరసించండి - డివివియస్ వర్మ 9
5) యోగా దినోత్సవం-హిందుత్వ ఎజెండా - డా బి.గంగారావు 11
6) పెరుగుతున్న సైనిక వ్యయం - ప్రభాత్ పట్నాయక్ 13
7) జీడీపీ సంబరాలు - భారతీయుల వాస్తవ స్థితిగతులు - 'పీపుల్స్ డెమోక్రసీ' 16
8) అంకెలు ఆమోదించని అచ్ఛేదిన్ - పి.చిదంబరం 17
9) ఎన్నికల్లో రిగ్గింగ్ చేయడమెలా ? - రాహుల్‌గాంధీ 18
10) కులగణన ఎలా జరగాలి - టి.చిరంజీవులు 21
11) బీహారీల ఆత్మగౌరవాన్ని ప్రశ్నించడమే..! 23
12) గాంధీ నమ్మకాన్ని నిలబెట్టుకున్నామా - జీన్ షార్ప్ 24
13) వైజ్ఞానిక పరిశోధనాశాలల పితామహుడు - డాక్టర్ దేవరాజు మహారాజు 26
14) కూటమి వ్యవసాయ రంగానికిచ్చిన హామీలు - అమలు - కె.ప్రభాకరరెడ్డి 28
15) విద్యుత్ ఒప్పందాలు-వినియోగదారులపై భారాలు - సారంపల్లి మల్లారెడ్డి 30
16) విద్యా వ్యవస్థ - మానవీయ విలువలు - దాడిశెట్టి శ్యామ్‌కుమార్ 32
17) బహుముఖ ప్రజ్ఞావంతురాలు డాక్టర్ చిరంజీవినీకుమారి 33
18) బనకచర్లపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలి 34
19) బీఆర్ అంబేద్కర్ మార్గం : దేశంలో సామ్యవాద ఆర్థిక అభివృద్ధి -డా కత్తి పద్మారావు 37
20) అమృతోత్సవం!- తమ్మినేని అక్కిరాజు 39
21) ఫాసిజంతో పోరాడిన చిత్రకళ - ఫియోనా మెక్‌డొనాల్డ్ 40
22) బుద్ధుడితో నా ప్రయాణం కళారూపం 42
23) కార్టూన్స్ 43
24) కొత్త పుస్తకాలు 44




కార్టూన్ : సతీష్ ఆచార్య ఫేస్‌బుక్ సౌజన్యంతో..

## దారి దీపం

మాసపత్రిక

మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను..
డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు
నంబరుకు విధిగా
వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి.
ఫోన్ నెంబరు 93971 14495

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : DVVSVARMA.COM

## సంపాదకీయం

# ప్రగతిశీల ప్రత్యామ్నాయానికి పూనుకోవాలి



రాష్ట్రంలో రాజకీయం వికృతరూపంలో సాగుతున్నది. తెదేపా కూటమి, వైసీపీ పార్టీలు నిత్య సంఘర్షణలో వున్నాయి. ఈ సంఘర్షణ విధానపరమైంది కాదు. వ్యక్తిగత విమర్శలు, పరస్పర దూషణలు, ఆరోపణలు, ప్రత్యారోపణల రూపంలో నడుస్తున్నది. కక్ష సాధింపు రాజకీయం గతంలోనూ, నేడూ కొనసాగుతున్నది. ఇందులో రాష్ట్ర ప్రయోజనాలు లేవు. పార్టీల తాత్కాలిక ప్రయోజనాల సంఘర్షణ గానే వుంది. ఇక్కడ సిగపట్లు పడుతున్న ఈ పక్షాలు జాతీయ రాజకీయాలలో మోదీ పంచన కలిసే వుంటున్నాయి. రెండు మూడు శాతం ఓట్లు కూడా లేని బీజేపీ రాష్ట్రంలోని 25 పార్లమెంటు స్థానాలను తన బుట్టలో వేసుకుంది. ఈ స్థానాలతోనే కేంద్రంలో మోదీ ప్రభుత్వం మనగలుగుతుంది. కేంద్రంలో చక్రం తిప్పాల్సిన తెదేపా మోదీ చేతిలో కీలుబొమ్మగా మారింది. మోదీకి, బీజేపీకి రాష్ట్రంలో ద్వారాలు పూర్తిగా తెరుచుకున్నాయి. ఒక పక్క సనాతన ధర్మం పేరుతో, మరోపక్క యోగా ముసుగుతో బీజేపీ ఇక్కడ తిష్ట వేసే పనిలో వుంది. ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు విద్వేష రాజకీయానికి మతపరమైన సాంస్కృతిక ఉన్మాద రాజకీయానికి స్థావరం కానుంది. దేశంలో పాలనాలపరంగా మోదీ సాధించిన సాఫల్యాలుకంటే వైఫల్యాలే ఎక్కువ. అచ్ఛేదిన్, మేకిన్ ఇండియా, సబ్ కా వికాస్ నినాదాలన్నీ దీనిని రుజువు చేస్తున్నాయి. దేశంలో నిరుద్యోగం అత్యధిక స్థాయికి చేరింది. ఏటా రెండు కోట్ల ఉద్యోగాల వాగ్దానం గాలిమూట అయ్యింది.

జీఎస్టీ బాదుడుతో అధిక ధరల భారంతో సామాన్యుల జీవితాలు దుర్భరం అయ్యాయి. ఏటా 20 లక్షల కోట్లు పైగా వున్న జీఎస్టీ ఆదాయంలో 60 శాతం పేదలు, సామాన్యుల నుంచే పిండుతున్నారు. ఆకలి సూచీలో 106వ స్థానం, మానవాభివృద్ధిలో 130వ స్థానం వగైరాలన్నీ మోదీ వైఫల్యాలకు అద్దం పడుతున్నాయి. దేశంలో రాజకీయ లబ్ధి కోసం విద్వేష రాజకీయం చేస్తున్నారు. పర్యవసానంగా మైనారిటీలు, దళితులు, మహిళల మీద అత్యాచారాలు, హత్యాకాండ సాగిపోతున్నది. మరోపక్క రాజ్యాంగాన్ని, రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసే పని నిరంతరాయంగా సాగిస్తున్నారు. పౌరుల హక్కులను, పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్నారు. సెక్యులర్ వ్యవస్థ పునాదులను పెకలిస్తున్నారు. కార్పొరేట్లకు రాయితీలు గుప్పిస్తున్నారు. విపరీతమైన అప్పుల భారం పెంచుతూ కార్పొరేట్ల కు దాదాపు 20 లక్షల కోట్ల ప్రజాధనాన్ని రాయితీలు, మాఫీల పేరుతో ధారాధత్తం చేసారు. అత్యధిక ఆర్థిక అంతరాలున్న దేశంగా మార్చారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ అదేబాటను నడుస్తున్నది. ప్రజా సమస్యల తక్షణ పరిష్కారాలను పక్కన పెట్టి ఏడాదిగా అమరావతి చుట్టూ తిరగడం, గిన్నిస్‌బుక్ రికార్డుగా యోగాను నెత్తిన వేసుకోవడంతోనే సరిపెట్టుకున్నారు. 2029కి సాధించే లక్ష్యాలను ప్రకటించకుండా 2047 స్వర్ణాంధ్రను చూపిస్తున్నారు.

రాష్ట్రంలో ఇండియా కూటమికి నాయకత్వం అందించాల్సిన కాంగ్రెస్ పార్టీ, కుటుంబ తగాదాల రాజకీయానికి పరిమితమైంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మోదీ రాజకీయానికి ప్రతిపక్షం అంటూ లేకుండా పోయింది. అంతమాత్రం చేత నిరాశ పడాల్సిన అగత్యం లేదు. మోదీ రాజకీయాల్ని డబుల్ ఇంజన్ సర్కార్ పాలనని వ్యతిరేకించే ప్రజలు వున్నారు. వారిని సంఘటిత పర్చి ప్రగతిశీల ప్రత్యామ్నాయానికి దారులు వేసేవారు కావాలి. రాష్ట్రంలో వామపక్షాల మీద, దళిత, బహుజన సంఘాల మీద, రాజ్యాంగ పరిరక్షణ వేదికల మీద ఈ బృహత్తర కర్తవ్యం వుంది. ఈ శక్తులు సంఘటితంగా లేవు. చీలికలు పీలికలుగా వున్నాయి. వీటితో విశాల వేదికను రూపొందించే కృషి ప్రారంభం కావాలి. దీనికి ఒక ఉమ్మడి కార్యక్రమం ఉండాలి. అది ప్రజల జీవితాలను మార్చే లక్ష్యం గలదిగా వుండాలి. అలాంటి ప్రత్యామ్నాయ అభివృద్ధి ప్రణాళిక ప్రజలను ఆకర్షిస్తుంది. ఈ విశాల వేదిక వామపక్ష పార్టీలు, దళిత, బహుజన, మైనారిటీలు, పౌర సమాజ సంస్థల ఉమ్మడి వేదిక కావాలి. ఇందులో ఏ ఒక్క స్రవంతికి ప్రత్యామ్నాయం కాగల స్థితి లేదు. రాష్ట్రం అంతటా పోటీ చేసే స్థితి లేదు. అందువల్ల ఉమ్మడి వేదిక అందరి వేదిక కావాలి. అందరి భాగస్వామ్యం ఉండాలి. అందరి నాయకత్వ పాత్ర వుండాలి. అలాంటి విశాల వేదిక ఏర్పాటుకు వామపక్షాలు చొరవ తీసుకోవాలి. మోదీ రాజకీయాన్ని ప్రతిఘటించే లక్ష్యంతో ప్రగతిశీల ప్రత్యామ్నాయానికి పూనుకోవాలి.

**- డి.వి.వి.యస్.వర్మ**
**సంపాదకులు, 85006 78977**


# మోడీ 11 ఏళ్ల పాలన : సరిచేయలేని స్థాయికి చేరుతోన్న సామాజిక తిరోగమనం

- ఆనంద్ తేల్తుంబ్డే

**ప్రధానిగా తన పాలన 11 ఏళ్లపాటు నిర్విఘ్నంగా కొనసాగినందుకు నరేంద్రమోడీ పరవశంతో చేసుకుంటున్న సంబరాలు కిందటి నెల అర్ధాంతరంగా ఆగిపోయాయి. అందరూ అనుకున్నట్టే, "భారతదేశాన్ని సాహసవంతమైన దేశంగా" తీర్చిదిద్దినందుకు సంబరాలు జరుపుకోవాల్సిన సందర్భమని ఆయన భక్త బృందం బీరాలకు పోయింది. అది కూడా, మోడీ మీద విమర్శలు వెల్లువెత్తుతోన్న నేపథ్యంలో - ప్రధానంగా అమెరికా అధ్యక్షుడు పదేపదే భారతదేశాన్ని కించపరుస్తూ మాట్లాడుతున్న వేళ, మోడీ మౌనం పాటిస్తున్న సందర్భం ట్రంప్ నిరంతరంగా భారతదేశాన్ని పాకిస్తాన్‌తో సరిపోలుస్తుండడమే కాదు. యుద్ధం ఆపిన ఘనత తనదేనని డంబాలు పలుకుతున్న సమయం, చట్ట వ్యతిరేకంగా అమెరికా లోకి ప్రవేశించిన భారతీయులను సంకెళ్లు వేసి ప్రదర్శించిన వేళ (అది కూడా కాళ్లు, చేతులకు సంకెళ్లు వేసి)- ఇవన్నీ మోడీ పాలనా కాలపు స్వరూప స్వభావాలపై దాడే. ఈ దాడి 11 ఏళ్లు అధికారంలో కొనసాగిన శక్తిని నిర్ధారిస్తాయి. ఒక ఖండం అంతటి దేశం, అనామకంగా, కేవలం ఒక భౌగోళిక రాజకీయ ఆవాసంగా దిగజారింది.**

మోడీ పాలనా కాలంలోని ఆర్థిక వైఫల్యాలు, రాయబార తప్పటడుగుల గురించి అనేక సందర్భాలలో రాశారు. కానీ అసలైన వంచన వల్ల జరిగిన హాని వేరొకచోట ఉంది. అది భారతదేశ సామాజిక సాంస్కృతిక నిర్మాణాన్ని హరింపచేయడం. దేశ బహుళత్వాన్ని దెబ్బ తీయడంలో ఈ నష్టం కనిపిస్తుంది. సామాజికంగా లోలోపలి పొరలలో దాగి ఉన్న లోపాలను కఠిన తరం చేసింది. 2014కు ముందు ఉన్న సామాజిక సూచికలను నేటి సామాజిక సూచికలతో పోల్చి చూస్తే, మతతత్వ మెజారిటేరి యనిజం, తిరోగమన ధోరణి, మేధావుల పట్ల వ్యతిరేకత, వివక్షతని వ్యవస్థీకరించడం కనిపిస్తాయి.

సామాజిక సాంస్కృతిక జలతారు పరదాలు-మూడు శతాబ్దాల పాటు సాగిన ఆధునిక సామ్రాజ్యవాద పాలనలో ఎంతో కష్టపడి నేసిన కలనేత, సమానత్వం ప్రేరణతో జరిగిన పోరాటాలు,



రాజ్యాంగంలో ప్రతిష్టించుకున్న గణతంత్ర విలువలు ఛిద్రమయి పోయాయి. ఇక మిగిలిందల్లా మధ్యయుగాల నాటి అర్థం పర్థం లేని ముసుగులేసిన దేశం. ఇతర రంగాల్లో జరిగిన హాని, ఇవాళ కాకపోతే రేపైనా పూడ్చుకోవచ్చు, పూడ్చుకుంటాము కూడా. కానీ సామాజిక సాంస్కృతిక రంగంలో జరిగిన విచ్ఛిన్నం-అందులో త్వరితగతిన మారుతున్న నేటి సమాజంలో, ప్రపంచమంతా పరస్పరంగా అనుసంధానించబడి ఉన్న నేటి తరుణంలో - పూడ్చడం సవాలుతో కూడుకున్నది.

### నష్టాన్ని అంచనా వేయడం ఎలా?

మత సామరస్యంలో వచ్చిన మార్పు నగ్నంగా మన ముందుంది. గృహ మంత్రిత్వ శాఖ ఇచ్చిన గణాంకాల ప్రకారం, యూపీఏ పాలనా కాలం(2011-2014) భారతదేశంలో ఏడాదికి 600 మత ఘర్షణలు జరిగాయి. కానీ, 2017-2022 మధ్యకాలంలో మోడీ పాలనలో ఏడాదికి 1000 మత ఘర్షణలు జరిగాయని జాతీయ నేర నమోదు సంస్థ తెలియ చేస్తున్నది. అంతకంటే ఘోరం ఆవులకు సంబంధించిన మూక దాడులు. ఇవి ఇది వరకు అరుదుగా, అక్కడక్కడా జరిగేవి. 2014-2024 మధ్య కాలంలో 300పైగా నమోదయ్యాయి. విద్వేష ప్రసంగాలు అయిదు రెట్లు పెరిగాయి. లోపాయికారిగా రాజకీయ ప్రోత్సాహం, పోలీసుల బలహీనతలతో విద్వేష ప్రసంగాలు పెరుగుతున్నాయి. 2018లో పోలీస్ అధికారిపై బులంద్షర్‌లో మూక దాడి చేయడం కానీ, 2020లో పాల్ఘర్‌లో మూకలు చంపడం కానీ ఉదాహరణగా చూపవచ్చు. అనేక ప్రాంతాల్లో చట్టపాలన స్థానాన్ని విజిలెంట్ మూకలు ఆక్రమించాయి.

మతతత్వ దాడులు పెరుగుతుండడంతో అసమ్మతి, ప్రజా తంత్ర భావవ్యక్తీకరణల స్థలం కుంచించుకుపోయింది. 2024లో 180 దేశాల ప్రపంచ సమాచార స్వేచ్ఛ జాబితాలో, భారతదేశ స్థానం 140 నుంచి 161కి దిగజారిందని రిపోర్టర్స్ విత్ఔట్ బార్డర్స్ అనే సంస్థ నివేదించింది. ఒకప్పుడు దేశద్రోహ నేరాలు ఎప్పుడో గానీ మోపబడేవి కావు. కానీ ఇప్పుడు అవి 160% పెరిగాయి. ఏడాదికి 70 కేసులు నమోదు అవుతున్నాయి. విశ్వ విద్యాలయాలు సైద్ధాంతిక యుద్ధ రంగ స్థలాలుగా మారాయి. పాఠ్యాంశాల నుంచి మొగలుల, ప్రజల చరిత్రలు తొలగించారు. అసమ్మతిని తెలిపే విద్య సంస్థలు- జవహర్‌లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయం (జేఎన్‌యూ) లేదా జామియా మిలియా ఇస్లామీయ సంస్థలు తీవ్రవాద వ్యతిరేక చట్టాల కింద నమోదయ్యాయి. ఒకప్పుడు, అసమ్మత పరిశోధన లు, ఎప్పుడో ఒకసారి నిషేధానికి గురవుతుండగా, (ఉదాహరణ కు స్థూల జాతీయోత్పత్తి గణాంకాల పునఃపరిశీలన ఎదురు దెబ్బలు ఎదుర్కొంటుండగా) ఇప్పుడు వ్యవస్థీకృత ప్రణాళికా బద్ధంగా(ఇనిస్టిట్యూషనలైజ్డ్ ప్లానింగ్), ఉదారవాద విద్యా సంస్థలను(లిబరల్ యూనివర్సిటీస్) ఏ మాత్రం సంకోచపడ కుండా రూపుమాపేశారు. మైనారిటీల స్థితి, ప్రధానంగా ముస్లింల స్థితి, ఎంతగా వారు సంస్థాగత బహిష్కరణకు గురయ్యారో తెలియచేస్తుంది. 2009లో 30 మంది పార్లమెంటు సభ్యులు ముస్లింలకు ప్రాతినిధ్యం వహిస్తే, 2024లో వారి సంఖ్య 24కు పడిపోయింది. స్వతంత్ర భారతదేశంలో మొట్ట మొదటిసారిగా మోడీ క్యాబినెట్‌లో ముస్లింలకు ప్రాతినిధ్యమే లేదు. ముస్లిం మంత్రులు లేరు.

**మత మార్పిడులపై నిషేధం ఇది వరకు కేవలం బీజేపీ పాలిత రాష్ట్రాలకే పరిమితమయ్యేది. ఇప్పుడు 12 రాష్ట్రాలలో ఈ చట్టం అమలవుతున్నది. మతం మార్చుకోవడం నేరంగా పరిగణిస్తున్నారు. పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) జాతీయ పౌరుల నమోదు, భారతీయులుగా గుర్తింపు అంటే హిందువుల చుట్టూ తిప్పే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కర్ణాటకలో "హిజాబ్ నిషేధం", జ్ఞానవాపి మసీదు వివాదం, ముస్లింల పౌరహక్కులపై దాడిని మరింత తీవ్రతరం చేస్తున్నాయి.**

గత దశాబ్దాలలో కులం, లింగం ఆధారంగా వివక్షతకు గురికాకుండా ఉండడంలో, సమన్యాయం అమలు జరగడంలో పురోగతి కనిపించింది. ఇప్పుడు అది దిగజారుతున్నది. ఎన్‌సీ ఆర్‌బీ నివేదిక ప్రకారం దళితులపై అఘాయిత్యాలు 2013లో 39,000 నమోదు కాగా 2022లో 50,900 నమోదయ్యాయి. యూపీఏ ప్రభుత్వం సుప్రీంకోర్టు రిజర్వేషన్లు 50% మించకూడదన్న తీర్పును ఉల్లంఘించకూడదని అనుసరిస్తే, మోడీ ప్రభుత్వం ఉన్నత తరగతులలో ఆర్థికంగా వెనుకబడిన వారికి 10% రిజర్వేషన్‌లు ప్రకటించి, కులాల ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలయ్యే ప్రక్రియని నీరుగార్చి, కులాల ఆధారంగా చేసే రిజర్వేషన్లు రద్దు చేసేందుకు దారిచూపింది.

**వ్యవస్థ హత్య చేసిన రోహిత్ వేముల సంఘటన, ఉనాలో దళితుడిని కొయ్యకు కట్టి కొట్టడం(2016), కుల దురహంకారం తలెత్తున్న సంకేతాలు ఇస్తున్నాయి. సామాజిక న్యాయం స్థానంలో "సమాజ్ కి సంరక్ష"(సామాజిక సామరస్యం) వచ్చేసింది.**

గిరిజనుల హక్కులు వెనక్కిపోయాయి. 2009-2014లో 1.5 లక్షల హెక్టార్లు అటవీ భూములను ఆక్రమిస్తే, 2014 తరువాత 3.5 లక్షల హెక్టార్లు ఆక్రమణకు గురయ్యాయి. పీఏఎస్‌సీఓ, వేదాంత లాంటి కార్పొరేట్ ప్రాజెక్టులకు, స్థానిక కార్యకలాపాల కంటే ప్రాధాన్యత దక్కుతున్నది. అదుపులేని అభివృద్ధిని చూపి, నక్సలిజానికి వ్యతిరేకంగా చర్యలని చెప్పుకుంటూ 2014 తరువాత లక్షలాది ఆదివాసీలను తమ స్థావరాల నుంచి వెళ్లగొట్టేశారు. 2022లోని అడవుల రక్షణ చట్టం నిబంధనలు, అటవీ హక్కుల చట్టంలోని అటవీభూములను ఆక్రమించేందుకు గిరిజనుల ఆమోదం కావాలనే నిబంధనను తొలగించారు. ఫలితంగా కొందరు కార్యకర్తలన్నట్టు గిరిజనులు "రెండోసారి భూములను" కోల్పోయారు. అడవులలో ఉన్న సహజ వనరులు, ముఖ్యంగా గనులు సొంతం చేసుకోడానికి, నక్సలైట్లను అంతం చేయడం అనే పేరు మీద ఆదివాసులను అంతం చేయడం మొదలయింది. ఇదే ఈ నేటి పాలకుల నిజస్వరూపం.

మోడీ పాలనకు ముందు, సంక్షేమ పథకాలు అందించడానికి మెజారిటీ మైనారిటీల బేధం ఉండేది కాదు. కానీ ఇప్పుడు వాటిని కూడా మెజారిటేరియనిజం కోసం వాడుకుంటున్నారు. అంతకు ముందు కాలంలో ఎంఎన్‌ఆర్ఇజిఏకి గాని ప్రజా పంపిణీ విధానంలో గాని, ముస్లింలనే వివక్షత ఉండేది కాదు. కానీ ఇప్పుడలాకాదు, అనేక బీజేపీ నాయకత్వంలోని రాష్ట్రాలలో పీఎం కిసాన్ ప్రయోజనాలు ముస్లిం రైతులకు అందడం లేదు. మొదట్లో బాగా నడిచినా, తరువాత తరువాత ఉజ్వల పథకం మసక బారింది. ప్రయోజనం పొందిన వారిలో 25% మంది మళ్లీ కట్టెపుల్లలు వాడడం మొదలుపెట్టారు. సంక్షేమ పథకాల పంపిణీ బాహాటంగానే మతప్రతిపాదికన అందజేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లో 80 వర్సెస్ 20 అంటూ ముస్లింలను కించపరుస్తున్నారు.

సాంస్కృతికంగా దేశాన్ని పెద్ద ఎత్తున సజాతీయీకరణ చేశారు. హిందీని బీజేపీ జాతీయభాష చేసే ప్రయత్నం వల్ల ఈశాన్య రాష్ట్రాల నుంచి తమిళ నాడు నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంది. రాష్ట్ర ప్రభుత్వాల మద్దత్తు ఇచ్చే హిందీ పండగలు, స్థానిక జానపద సంస్కృతి, ప్రాంతీయ సంప్రదాయాలను ఆవరిస్తున్నాయి. అదేసమయంలో ఎంఎఫ్ హుస్సేన్ వంటి గొప్ప కళాకారులు చనిపోయిన తరువాత నిందలు ఎదుర్కొంటున్నారు. కేవలం సైద్ధాంతిక విబేధాల కారణంగా 'పా' వంటి ఉత్తమ చిత్రాలను నిర్మించిన రంజిత్ వంటి చిత్ర నిర్మాతలను బహిష్కరిస్తున్నారు. బహుళత్వాన్ని కాపాడుకునే బదులుగా "ఒక దేశం, ఒక సంస్కృతి" అనే చిహ్నాన్ని, తమ విధానంగా నేటి పాలకులు ప్రజలపై రుద్దుతున్నారు.

ఈ సాంస్కృతిక సంకుచితత్వానికి తోడుగా సూడో సైన్స్, విజ్ఞాన ప్రాధాన వాదానికి వ్యతిరేకత పెరుగుతున్నాయి. విజ్ఞాన శాస్త్రం అభివృద్ధికి నిధుల కేటాయింపు 2013లో, స్థూల జాతీయోత్పత్తిలో 0.8% ఉండగా 2023 వరకు 0.6% నికి పడిపోయింది. కానీ వేదకాలంలో ప్లాస్టిక్ సర్జరీలు జరిగాయంటూ ప్రభుత్వం డంబాలకు పోతున్నది. అవి అధికారికంగా ఆమోదం పొందుతున్నాయి కూడా. కొత్త విద్యా విధానం-2020 సంస్కృతానికి ప్రాధాన్యతనిస్తున్నది. విమర్శనాత్మక ఆలోచనలకు బదులుగా "భారతీయ విజ్ఞాన శాస్త్రం", "భారతీయ జ్ఞాన సముపార్జనా విధానాలు" అంటూ ఎటువంటి రుజువులు, ఆధారాలు లేని విధానాలను ప్రజలలోకి తీసుకెళుతున్నారు. అన్నిటికంటే కలతపరిచేది, మోడీ యుగం, దయాగుణం గల మానవత్వాన్ని నేరపూరితం చేయడం. ఈ ప్రభుత్వం 20,000 లకు పైగా ఎన్‌జీఓల లైసెన్సులు, ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ చట్టం(ఫెరా ) కింద రద్దు చేసింది. ఇందులో ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, కేర్ ఉన్నాయి. మానవత్వపు కార్యకలాపాలపై- ప్రధానంగా గిరిజన ప్రాంతాలలో ఇప్పుడు 'జాతి వ్యతిరేకమని' ముద్ర వేస్తున్నారు.

**ఇది వరకు బహిరంగంగా ఇచ్చే ఉపన్యాసాలలో విద్వేషాన్ని రెచ్చగొట్టడం నిషేధం. ఒకప్పటి విద్వేష ప్రసంగాలు-2009 ఎన్నికల ప్రచారంలో వరుణ్‌గాంధీ చేసిన రెచ్చగొట్టే ప్రసంగం ఇప్పుడు సర్వ సాధారణమైంది. యతి నరసింగానంద్, బీజేపీ నాయకులు అనురాగ్ ఠాకూర్ బహిరంగంగానే ముస్లింలకు వ్యతిరేకంగా హింసను ప్రేరేపిస్తూ ప్రసంగాలు చేశారు. కానీ ఏ విధమైన చట్టపరమైన చర్యలు ఎదుర్కోలేదు. పైగా ఈ విద్వేష ప్రసంగాలు చేసిన వారికి పురస్కారాలు దక్కాయి. 'సబ్కా సాత్ సబ్కా వికాస్' కాస్తా "గోలి మారో సాలోంకో"(వెధవలని కాల్చి పారేయండి) అనే కారుకూతల స్థితికి దిగజారింది.**

ఇటువంటి విద్వేష ప్రసంగాల ఫలితంగా పట్టణాలలో వెలివాడలు వెలిశాయి. ముస్లింలకు ఉండడానికి ఇళ్లు కూడా దొరకకుండా పోయాయి. ఒకప్పుడు ఈ పరిస్థితి కేవలం ముంబై లాంటి ప్రాంతాలకే పరిమితంగా ఉండేది. ఇప్పుడు భారతదేశమంతా వ్యాపించింది. చాలా హౌసింగ్ సొసైటీలలో ముస్లింలకు ఇల్లు కేటాయించడం లేదు. అద్దెకి కూడా ఇవ్వడం లేదు. ఇప్పుడు బుల్డోజర్ రాజకీయ చిహ్నం అయింది. ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలలో ఈ సంస్కృతి లోతుగా పాతుకు పోయింది. మత ఘర్షణల తరువాత ఏ రకమైన నియమ నిబంధనలు పాటించకుండానే ముస్లింల ఇళ్ళు కూల్చడం పరిపాటిగా మారింది. ముస్లింలే కోవిడ్-19 వ్యాపించడానికి కారణమని చేసిన నిందారోపణ వారిని మరింతగా సామాజిక అస్పృశ్యులను చేసింది.

ఈ ధోరణులన్నీ చూసినప్పుడు, సామాజిక సంబంధాలు నాశనం అవడమే కాదు. పూర్తిగా కొత్త రూపన్ని సంతరించుకున్నాయని అనిపిస్తుంది. 2014కు ముందు రాజ్యాంగ విలువలు సవాలుచేయబడ్డాయి. కానీ చెక్కు చెదరలేదు-ఉదాహరణకు లౌకిక తత్త్వం, సామాజిక న్యాయం, బహుళత్వం. అయితే, గత 11 ఏళ్లలో మొత్తంగా మెజారిటీయనిజం వైపు మళ్లిపోయింది. సామాజిక సూచికలన్నీ మరింత బహిష్కరణవాదం, మరింత అసహనం, మరింత అసమానత్వం వైపుకు చూపిస్తున్నాయి.

మోడీ ప్రభుత్వ పాలనా వ్యవస్థ, సామాజిక పొందికకు చేసిన గాయాలకు పైన చెప్పినవి కేవలం కొన్ని సూచికలు మాత్రమే. ఆర్థిక, లేదా రాయబార వ్యవహారాలలో దొర్లిన మహాపరాధాలు కూడా విధానాలు మార్చుకుని సరిచేసుకోవచ్చు. కొత్తగా అంతర్జాతీయ సంబంధాలు పునరుద్ధరించుకోవచ్చు. కానీ సామాజిక సాంస్కృతిక నష్టం పూడ్చలేనిది.

ప్రజల నైతికతలో, జాతీయత గుర్తింపులో, వ్యవస్థీకృత వివక్షత లో, ఉద్దేశపూర్వకంగా చేసిన మార్పులు భారతదేశాన్ని మరో భయంకర దశలోకి నెట్టింది. భారతదేశాన్ని లౌకికత్వ ఆలోచనల దేశంగా, అందరిని ఇముడ్చుకునే సార్వభౌమ దేశంగా ఇంకెంత మాత్రం చూడరు. భారతదేశం వెనకపట్టు పట్టడమేకాదు, క్రియాశీలంగా ముట్టడికి గురయ్యింది. దీనిని పునరుద్ధరించ డానికి కేవలం రాజకీయసంకల్పం ఉంటే సరిపోదు. మునుపెన్నడూ ఎరగనటువంటి సాంస్కృతిక నైతిక పునరుజ్జీవనం కావాలి. అప్పటివరకు మోడీ చేసిన సాంస్కృతిక గాయాల మచ్చలు ఈ సార్వభౌమ దేశాన్ని వెన్నాడుతూనే ఉంటాయి.

(అనువాదం: కె.ఉషారాణి)

# మోడీ @ 11- రివర్స్ పొగడ్తలు!




- తెలకపల్లి రవి

నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీ -ఎన్డీయే ప్రభుత్వం మూడో దఫా పాలన తొలి ఏడాది పూర్తి చేసుకుంది. జవహర్ లాల్ నెహ్రూ తర్వాత ఒకే ప్రధాని వరుసగా మూడుసార్లు ఎన్నిక కావడం అసాధారణమని ముందు నుంచి మోత మోగిస్తూనే వున్నారు. ఇందిరాగాంధీ తర్వాత 'ఉక్కు ప్రధాని' మోడీయేనని చెబుతూనే మరోవైపున ఆమెతోపాటు నెహ్రూను కూడా పక్కనపెట్టి ఈయననే ఊరేగించే భారీ పథకం నడుస్తూనే వుంది. నెహ్రూ హయాంలో తప్పొప్పులు ఏమున్నా నవభారత నిర్మాణానికి స్వావలంబనకు అలీన విధానానికి పునాదులు పడ్డాయనేది నిర్వివాదాంశం. ఇందిరాగాంధీ ఏకపక్ష ధోరణి ఎమర్జెన్సీతో పరాకాష్టకు చేరడం వాస్తవమే అయిన ప్పటికీ దేశాన్ని స్వావలంబనతో నిలబెట్టడంలో ఆమె పాత్ర కాదనలేనిది. ఆ కాలంలో భారతదేశ అంతర్జాతీయ ప్రతిష్ట కూడా సమున్నతంగా ఉండేది. అందుకే మొన్న పాకిస్తాన్‌పై 'ఆపరేషన్ సిందూర్' హఠాత్తుగా అమెరికా అధ్యక్షుడి అస్పష్ట పాత్రతో కాల్పుల విరమణ జరిగిందన్న సమాచారం భారతీయులు జీర్ణం చేసుకోలేకపోయారు. దీనిపై పూర్తి వాస్తవాలు చెప్పేందుకు, ప్రత్యేక పార్లమెంట్ నిర్వహించడానికి మోదీ సర్కార్ వెనకాడుతున్నది. అయినా ఆయన విశ్వగురు అని, ప్రపంచాన్ని లోబర్చుకున్నారని ప్రచార ఆర్భాటం మాత్రం ప్రహసనప్రాయంగా సాగుతున్నది. ఎన్డీయే భాగస్వాములుగా, కీలక మద్దతు దార్లుగా ఉన్నందువల్ల ఏపీ ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు వంటివారు ఈ ప్రచారానికే వంత పాడుతున్నారు. పాలస్తీనా గాజా ప్రాంతంపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమంతో పాటు ఇరాన్‌పై ఘోరమైన దాడికి పాల్పడుతున్నా ప్రశ్నించగల సత్తా మనకు లేకుండా పోయింది. మోదీకి ప్రపంచ పలుకుబడి గురించి పరవశించి చెప్పుకోవడమే గానీ ఆ దాడి నడిపిస్తున్న యూదు జాత్యాహంకార నేత నెతన్యాహూ ఫోన్ చేస్తే మోడీ గట్టిగా శాంతి కాంక్షను చెప్పలేకపోయారు. అయినా సరే మోడీ విశ్వగురువేనని నమ్మబలుకుతున్నారు.

### విచిత్ర భాష్యాలు

నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించిన భారతదేశం మోదీ నాయకత్వంలో ప్రపంచ శక్తిగా ఎదుగుతున్నది కనుక అమెరికా హడలిపోతున్నదని విచిత్ర భాష్యాలు వినిపిస్తున్నారు. ఇరుగు పొరుగు దేశాలతోనూ, దక్షిణాసియా దేశాలతోనూ సంభాషణలు జరపకుండా, సుదూర దేశాలకు ఆలస్యంగా




అఖిలపక్ష బృందాలను పంపించి దౌత్య విజయాలు సాధించామని వేడుకలు చేసుకుంటున్నారు. సరిహద్దు సమస్యలు ఉన్నప్పటికీ భారతదేశంతో నిర్మాణాత్మకమైన సాధారణ సంబంధాలు పెంచుకోవడానికి సంసిద్ధం అంటున్నది చైనా మాత్రమే. దాన్నే ప్రధాన శత్రువుగా చూపించేందుకు సంఘ పరివార్ ప్రయత్నాలు చేస్తోంది. అమెరికా ఎగదోతలు విఫలమై ఇప్పుడు రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆ దేశానికి వెళ్తున్న పరిస్థితి. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే ఇదంతా భారత దేశంలో కండ్లముందు జరుగుతున్న తలకిందుల వ్యవహారంలో భాగమేనని ఇట్టే అర్థమవుతుంది. భారతదేశ జీడీపీ ఎప్పుడో 2025-26 తర్వాత జపాన్‌కన్నా అతి కొద్దిగా పెరుగుదల చూపించే అవకాశం ఉంది అని ఐఎంఎఫ్ చెప్పింది కనుక ముందే కూసిన కోయిలల్లా ఇప్పటి నుంచే సంబరాలు హాస్యాస్పదంగా కనిపిస్తున్నాయి. భారతదేశంలో బడా మీడియా మోదీయాగా లేక గోడి మీడియాగా మారిపోయి భజన కీర్తనలు ఆలపించడం అలవాటైందే. కానీ ఈ మూడో దఫా ముచ్చటలో దాని తీరు మరీ తమాషాగా ఉన్నది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్ల హడావుడి కుప్పకూలి మోదీ మైనార్టీలో పడిపోయారనే వాస్తవాన్ని ఇప్పటికీ ఈ మీడియా జీర్ణించుకోలేకపోతున్నది. అందుకే అక్కడి నుంచే నరుక్కుని రావాలన్నట్టుగా ఇప్పుడు ప్రచారాలు ఎత్తుకున్నది.

### లోటు భర్తీనా? తీవ్రమా?

ఉదాహరణకు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక మొన్న మొదటి

పేజీలో మోదీ 3.0 ప్రభుత్వం పరిస్థితులకు తగినట్టు మారి ముందుకుపోతోందని బాక్స్ కథనం ప్రచురించింది. బీజేపీ దేశంలో పున:శక్తివంతం కావటం, మరింతగా నిలదొక్కుకోవడం జరుగుతుందంటూ ఆ కథనం పేర్కొంది. 2024 ఎన్నికల్లో మోదీ మొదటిసారిగా మిశ్రమ ప్రభుత్వ నేతగా ముందుకు వచ్చారట. వాస్తవానికి బీజేపీకి మాత్రమే మెజార్టీ ఉన్నప్పటికీ గత రెండుసార్లు ఆయన ఇతర పార్టీల భాగస్వామ్యం తోనే అధికారంలోకి వచ్చారు. మెజారిటీ రాకపోవడం వల్ల మరింత ఏకాభిప్రాయ పూర్వకమైన సంప్రదింపుల ప్రక్రియతో పాలించవలసిన ఆవశ్యకత ఏర్పడిందని ఈ కథనం చెబుతున్నది. ఎన్డీయేలో విభిన్న భాగస్వామ్య పక్షాల ప్రయోజనాలకు చోటు కల్పించేందుకు ఒక కొత్త రాజకీయ ప్రక్రియను రూపొందించుకోవాల్సి వచ్చిందట. అయితే స్వల్ప కాలంలోనే రాష్ట్రాల శాసనసభల ఎన్నికల్లో విజయాలు సాధించడం ద్వారా బీజేపీ తన ఆధిపత్యాన్ని తిరిగి నెలకొలుపు కోగలిగిందని ఈ పత్రికతో సహా దాదాపు అన్ని జాతీయ పత్రికల్లోనూ ఒకే తరహా వాదన ముందుకు తీసుకురావడం వ్యూహాత్మక ప్రచార ఆయుధంగా స్పష్టమవుతుంది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ కోల్పోయాక శాసనసభల ఫలితాలతో మళ్లీ పుంజుకోగలిగిందని, పోయింది రాబట్టుకోగలిగిందని ఇవి చెబుతున్నాయి. కానీ తీసుకున్న కొలబద్దలు వేరుగా వున్నాయి. హర్యానాలో లోక్‌సభకు సగం అంటే ఐదు స్థానాలు మాత్రమే తెచ్చుకోగా శాసనసభలో 90కి 48 తెచ్చుకోవటం గొప్పగా చూపిస్తున్నారు. అయితే ఇక్కడ ఓట్ల శాతం గత శాసనసభ ఎన్నికలతో పోలుస్తున్నారు. ఇదే తరహాలో మహారాష్ట్ర, ఢిల్లీ, ఒడిషా శాసనసభల విజయాలను చూపిస్తున్నారు. ఈ రాష్ట్రాల్లో చాలాచోట్ల కాంగ్రెస్ ఇతర లౌకిక పార్టీలు సర్దుబాట్లు చేసుకోకపోవడంతో ఓట్ల చీలిక వల్ల బీజేపీ గెలవగలిగింది. అలా చూస్తే ఓట్ల శాతంలో పెద్ద తేడా ఉండదు కనుక గత శాసనసభతో పోల్చి లెక్కలు చూపిస్తున్నారు. ఆఖరికి బీజేపీ ఓడిపోయిన జమ్మూ కాశ్మీర్‌లోను ఓట్ల శాతం పెరుగుదలను పెంచి చూపిస్తున్నది మీడియా. జార్ఖండ్‌లో ఓడిపోవడమే గాక 2024తో పోలిస్తే 14శాతం ఓట్లు తగ్గాయి. కానీ గత శాసనసభతో పోల్చి 0.19శాతం మాత్రమే తగ్గినట్టు చెబుతున్నది. మొత్తంమీద చూస్తే జార్ఖండ్ మినహా మిగిలిన అన్నిచోట్ల బీజేపీ కోలుకుందని చెప్పడం ఈ విశ్లేషణల వ్యూహం. పైగా దీన్ని మరో విధంగా తక్కువ ఓట్లతోనే ఎక్కువ సీట్లు తెచ్చుకోగల బీజేపీ ప్రజ్ఞగా చిత్రిస్తున్నది.


### ఏకాదశ సూత్రాల తమాషా

చాలా ఇంగ్లీష్ పత్రికల్లో స్పాన్సర్డ్‌గా కనిపించే 'స్వరాజ్య' సంపాదకుడు ఆర్.జగన్నాథన్ మోదీ పదకొండేండ్లలో 11 మార్పులు అని ఓ జాబితా ఇస్తూ తికమక పర్చే వ్యాఖ్యలు చేశారు. నెహ్రూ హయాంలో కూడా కాంగ్రెస్ రాష్ట్రాల స్థాయిలో హిందూ పార్టీగా ఉండేదని, ముస్లింలను ఆదుకుంటూ మద్దతు పొందేదని మోదీ అదేవిధంగా అనుసరిస్తున్నాడని ఈయన చెబుతున్నారు. మోదీ ఘనత దేశంలో మతపరమైన అస్తిత్వాన్ని నెలకొల్పడమేనని, మైనార్టీలు ప్రతిపక్షం వైపు మొగ్గకుండా చూశారని చెప్తున్నారు. అంతేకాదు, వక్ఫ్ బిల్లు ద్వారా బీజేపీ తాను హిందుత్వ విధానాలకే కట్టుబడి ఉన్నట్టుగా, మైనార్టీలు ఈ మార్గానికి రాక తప్పదని సంకేతాలు ఇవ్వడం మరో ప్రత్యేకత. జగన్నాథన్ చెబుతున్న మూడో లక్షణం మరింతగా చెప్పుకోవలసింది. దేశంలోనే మొదటిసారిగా బీజేపీ ఒక రాజకీయ పార్టీని కార్పొరేట్ పద్ధతిలో నడపవచ్చునని అగ్ర నాయకుడు సీఈవో లాగా ఉంటే కార్యకర్తలు ఉద్యోగులుగా, సామాన్య ప్రజలు సభ్యులుగా కనిపిస్తున్నారని ఏదేదో వర్ణించారు. పైనుంచి కిందకు ప్రమోషన్లతో వినియోగ సరుకుల (ఎఫ్ఎంసీజీ) తరహాలో రాజకీయం నడపవచ్చునని అర్థమైంద ట. మోదీ దెబ్బకు భయపడటం వలనే అన్ని పార్టీలు ఉచితాల కోసం సిద్ధమైపోయాయట. రాజకీయ ప్రతికూలత ఉన్నప్పటికీ ఆర్థిక సంస్కరణలను, కార్పొరేట్ తరహా నిర్ణయాలను ఆయన ఎలాగో కొనసాగించగలిగారట. కానీ ధనిక రైతుల ఆందోళన వల్ల వ్యవసాయ రంగంలో చేయలేకపోయారట. పైన మోదీ అతి బలమైన నాయకుడిగా ఉన్నప్పటికీ రాష్ట్రాలలో యోగి, పడ్నవీస్, హిమంతా బిశ్వాస్ వంటి బలమైన నాయకులు ఓట్లు పొందే పరిస్థితి కనిపిస్తుందట. తమిళనాడులో అన్నామలై కూడా ఈ కోవలోకొస్తాడట. ఈయన చెప్పే ఏడో అంశం జాతీయవాదాన్ని రాజకీయాల్లో మోదీ బలమైన అంశంగా ప్రవేశ పెట్టగలిగారట. ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంఓ) చాలా శక్తివంతంగా తయారైందట. ఈ కారణంగా మొన్నటి ఎన్నికల్లో బీజేపీ మంచి ఫలితాలు సాధించలేకపోయినా ఆర్ఎస్ఎస్‌ను ఉపయోగించుకొని మళ్లీ పుంజుకుంటున్నదట. మోదీ, అమిత్ షాల రూపంలో ఒకరికి ఇద్దరు నాయకులు ఉండటం చాలా ఉపయోగకరంగా తేలిపోయిందట. ఈ ద్వయాన్ని ఆయన నెహ్రూ-పటేల్, వాజ్‌పేయి-అద్వానీ, మన్మోహన్-సోనియాగాంధీలతో పోలుస్తున్నాడు. ఉచితాలు పెరిగిపోవటంతో ప్రభుత్వాలు వ్యాపార వర్గాలకు అనుకూలమైన సంస్కరణలను చేయడం, చట్టాలు తేవడం కష్టంగా మారిందట. మోదీ సర్కారుకు అనుకూలంగా పది అంశాలు చెప్పిన జగన్నాథన్ చావు కబురు చల్లగా చెప్పినట్టు అసలు విషయం ఆఖరులో సెలవిస్తున్నాడు. ఉద్యోగాల కల్పన అనే అతి ప్రధానమైన జాతీయ సవాలు మోదీ పాలనలో అలాగే ఉండిపోయిందని ఒప్పుకోవడం కొసమెరుపు. ఒకే పార్టీ ప్రాబల్యం ఉండటం వల్ల రాజకీయ ఏకాభిప్రాయం అన్నది అసాధ్యంగా మారిందట.

### మూల్యం తప్పదు

మోదీ పాలన అసలు **(మిగతా 15వ పేజీలో)**

# యోగాను ఆదరించండి
# మోదీ రాజకీయాన్ని నిరసించండి



- డివివియస్ వర్మ

**జూ**న్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవ సందడి రాష్ట్రంలో ఊరూ వాడా మారుమోగుతున్నది. ఈ ఉత్సవానికి మోదీ ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకున్నారు. మోదీ ప్రాపకం కోసం ఉవ్విళ్లూరుతున్న చంద్రబాబు ప్రభుత్వం దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. నెల రోజులుగా రాష్ట్రంలో ప్రభుత్వ పాలన అంతా యోగా చుట్టూ తిరుగుతున్నది. మంత్రులు, శాసనసభ్యులు, రెవెన్యూ, పంచాయతీరాజ్ యంత్రాంగం అంతా యోగా కోసం 2 కోట్ల మందిని సమీకరించే పనిలో తల మునకలై వున్నారు.

ఈ యోగా వెనుక అనేక కోణాలు కనిపిస్తున్నాయి. యోగాలో వ్యాయామం వుంది. ధ్యానం వుంది. ఆధ్యాత్మిక ముక్తిమార్గం వుంది. అంతకుమించి వ్యాపారమూ వుంది. కార్పొరేట్ల ప్రయోజనాలు వున్నాయి. అంతిమంగా మోదీ స్వార్థ పూరిత రాజకీయం వుంది. మోదీని మెప్పించి తమ పబ్బం గడుపుకోవాలనే రాష్ట్ర రాజకీయం వుంది. ఈ కోణాలను మరుగు పరిచే ప్రయత్నాలు ఎన్ని చేసినా అవి తమదైన రూపంలో ప్రత్యక్షమవుతూనే వున్నాయి. ఇలా బహురూపిగా మారిన యోగా రకరకాల కారణాల రీత్యా వివిధ తరగతుల ప్రజల్ని ఆకర్షిస్తున్నది. మన సామాజిక ఆర్థికాభివృద్ధి క్రమంలో శారీరక శ్రమ చేయని వారు పెరుగుతున్నారు. గ్రామీణ పేదలు, వస్తూత్పత్తి చేసే పారిశ్రామిక కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు మాత్రమే శారీరక శ్రమజీవులు ఉన్నారు. వారికి యోగా అవసరం అంతగా లేదు. వివిధ రంగాల మధ్య తరగతి వేతన జీవులు శారీరక శ్రమకు దూరం అయ్యారు. అలాంటి వారికి యోగా ఒక శ్రమ సాధనంగా ఆకర్షిస్తుంది.

మన సమాజంలో నానాటికి వృద్ధుల సంఖ్య పెరుగుతున్నది. వారు వృద్ధాశ్రమాలలో వున్నా, మరోచోట వున్నా వారికి వ్యక్తిగతంగా శ్రమ చేయడానికి యోగా అనువైన సాధనం అయ్యింది. ఇప్పుడు మన బడి పిల్లలు వ్యాయామానికి అవసరమైన ఆటపాటలు డ్రిల్లు క్లాసులు లేకపోవడంతో పాఠశాలలు యోగాను ఆశ్రయిస్తున్నాయి. అదొక గౌరవప్రదమైన శిక్షణగా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. అదనపు ఫీజులు చెల్లించి యోగాభ్యాసం చేయిస్తున్నారు. కార్పొరేట్ సంస్థలు తమ ఉద్యోగాలకు యోగాను అవలంబించమని ప్రచారం చేస్తున్నాయి. ఆ ఉద్యోగులు అది తప్పనిసరి అవసరంగా భావిస్తున్నారు. కార్పొరేట్ యాజమాన్యం తమ ఉద్యోగులకు పని ఒత్తిడి పెంచింది. ఎప్పుడు ఉద్యోగం ఊడుతుందో తెలియని ఆందోళనకు గురిచేసింది. పనిగంటల



తగ్గింపు, రిక్రియేషన్ కార్యకలాపాల ద్వారా పని ఒత్తిడి తగ్గించడానికి బదులు వీరికి తాత్కాలిక ఉపశమనంగా యోగాను, ధ్యానాన్ని పరిష్కారంగా వారి ముందు పెట్టి, కార్పొరేట్ ప్రయోజనాలను కాపాడే సాధనంగా యోగాను వినియోగించుకున్నారు. ఇలా శారీరక శ్రమ లేని తరగతులు, మానసిక ఒత్తిడికి గురవుతున్న తరగతులకు యోగా తప్పనిసరి అవసరంగా కనిపిస్తున్నది. దీనికి కారణమైన సామాజిక, ఆర్థిక కారణాల నుంచి దృష్టి మళ్లించే సాధకంగా యోగా వినియోగపడుతున్నది. ఈ కారణాల రీత్యా మధ్య తరగతి వేతనజీవులు వృద్ధులు పాఠశాల పిల్లలు యోగాను ఎంచుకుంటున్నారు. అలా వారు యోగను ఆచరిస్తున్నారు. తక్షణ ఉపశమనాన్ని పొందుతున్నారు. అందుకే యోగాను వీరు ఆదరిస్తున్నారు.

యోగా, ధ్యానం పూర్తిగా వ్యక్తిగతమైనవి. అయితే ప్రారంభంలో నేర్చుకునేటప్పుడు మాత్రమే దానికి కొంత మేరకు గురువు అవసరం వుంటుంది. దానికి స్థానికంగా చాలా మంది గురువులు ఉన్నారు. వారు తగు ఫీజుతో శిక్షణ ఇస్తున్నారు. దేనికైనా వ్యాపారం చేయగల నేర్పరితనం మన పెట్టుబడిదారీ వ్యవస్థకు వుంది. యోగాను వారు వ్యాపారం చేశారు. ప్రైవేటు వైద్యం దోపిడీలాగా ఈ ప్రైవేటు యోగా వ్యాపారం కూడా విపరీతమైన దోపిడీకి నిలయం అయ్యింది.

ప్రపంచవ్యాప్తంగా యోగా చుట్టూ 86,000 కోట్ల రూపాయల వ్యాపారం సాగుతున్నది. దీనికి ఆయుర్వేదాన్ని, గోమూత్రాన్ని జత చేసి మరీ విక్రయిస్తున్నారు. ఇప్పుడు యోగా నేర్చుకోవడానికి ఖరీదైన ఆన్‌లైన్ కోర్సులు వచ్చాయి. యోగా చెయ్యడానికి మాట్స్ వ్యాపారం వచ్చింది. యోగా దుస్తుల వ్యాపారం జోరుగా సాగుతున్నది. దేశంలో ఈ వ్యాపారంలో రాందేవ్ బాబాలు, శ్రీ

శ్రీ రవిశంకర్ అగ్రభాగాన వున్నారు. వారు సాధారణ బాబాలు కాదు. మోదీ ప్రభుత్వ ప్రాపకం వున్న బాబాలు. వీరి ప్రమేయం తో నడుస్తున్న సంస్థలు వెయ్యి కోట్లకు పైబడి ఆస్తులను పోగేసుకున్నాయి. యోగాను కార్పొరేట్ వ్యాపారంగా నడుపుతున్నారు. దీనిని మోదీ రాజకీయంతో జత చేసి మూడు పువ్వులు ఆరు కాయలుగా విస్తరింపచేసుకుంటున్నారు. మోదీ ఏ నినాదం ఇచ్చినా, ఏ కార్యక్రమం తలపెట్టినా అందులో రాజకీయం వుంటుంది. స్వ ప్రయోజనం వుంటుంది. యోగాకు ప్రజాదరణ కల్పించి దానిని తన ఎన్నికల ఖాతాలో వేసుకోవాలని ఆయన భావిస్తున్నారు.

దేశాన్ని "విశ్వగురు" చేస్తానని మోదీ ప్రకటించారు. దానికి "వికసిత్ భారత్‌ను" నినాదం చేశారు. అంటే 2047 నాటికి ప్రపంచానికి దారి చూపించే దేశంగా అభివృద్ధి సాధించాలి. ఇప్పుడు ప్రపంచంలో స్థూల జాతీయోత్పత్తిలో 4వ స్థానం పొందడం ఘన విజయంగా డప్పు కొడుతున్నారు. 140 కోట్ల జనాభా గల దేశం 3, 4 కోట్ల జనాభాగల దేశాల జీడీపీని దాటిపోవడంలోని డొల్లతనాన్ని అసలు లెక్కలు తేల్చి చెబుతున్నాయి. తలసరి జీడీపీలో భారతదేశం 4వ స్థానంలో లేదు. 140వ స్థానంలో వుంది. మానవాభివృద్ధిలో 131వ స్థానంలో వుంది. ఆకలి సూచీలో 106వ స్థానంలో వుంది. రాబోయే 2, 3 దశాబ్దాలలో భారత్ ఈ రంగాలలో విశ్వగురు అయ్యే అవకాశాలు లేవని ఆర్థిక వేత్తలకు తెలుసు. ఈ విషయం మోదీకి తెలుసు. విశ్వగురు స్థానాన్ని సంపాదించడానికి మరో మార్గాన్ని ఎంచుకున్నారు. ఐక్యరాజ్యసమితిలో "జూన్ 21 యోగా దినోత్సవం"గా ప్రకటింపజేశారు. 196 దేశాలు దానిని ఆమోదించాయి. ఇప్పుడు యోగాలో మనమే "విశ్వగురు" అని మోదీ దేశ ప్రజలను మభ్యపెట్టదలుచుకున్నారు. ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో పేదలున్న దేశం మనది. అత్యధిక అంతరాలు వున్న దేశం మనది. దీనిని యోగాతో కప్పిపుచ్చే ప్రయత్నం మోదీ చేస్తున్నారు.

దేశంలో మోదీ సాగిస్తున్న రాజకీయం మనకు తెలిసిందే. దేశాన్ని మతపరంగా విభజించి, మత విద్వేషపరంగా మెజారిటీ ప్రజల ఓట్లు దండుకునే రాజకీయం చేస్తున్నారు. ఇప్పుడు యోగాని ఒక మతపరమైన సాంస్కృతిక సాధనంగా వినియోగించే ప్రయత్నం చేస్తున్నారు. యోగా పుట్టుపూర్వోత్తరాల గురించి మోదీ మాట్లాడరు. అది హిందూ సాంస్కృతిక సంప్రదాయంగా ప్రచారం చేయడానికి సంఘ్ పరివారం యోగా చరిత్ర వక్రీకరణలకు పూనుకున్నారు.

యోగా మీద 100 కీలక గ్రంథాలను ఐదేళ్లపాటు పరిశోధన చేసి మార్క్‌సింగిల్‌టన్, జామెస్ మల్లీసన్‌లు 'ది రూట్స్ ఆఫ్ యోగా' అన్న పుస్తకాన్ని ప్రకటించారు. యోగా ఆదిలో మొదలైంది. మతపరమైన సంప్రదాయం నుంచి కాదని ఆ పుస్తకంలో వారు నిగ్గు తేల్చారు. 13వ శతాబ్దికి చెందిన "దత్తాత్రేయ యోగశాస్త్రం"లో యోగా మతానికి, కులానికి అతీతమైందని పేర్కొంటూ సాధువులు, బౌద్ధులు, బ్రాహ్మలు, జైనులు, భౌతికవాదులకు కూడా ఆచరించదగినదిగా చెప్పారు.

బౌద్ధం నుంచి వైదిక మతం యోగాను కాపీ కొట్టిందని దేవరాజు మహారాజు ఒక వ్యాసంలో స్పష్టం చేశారు. పతంజలి యోగ శాస్త్రంలోని అభూతకల్పనలను పక్కనబెట్టి మోదీ పరివారం దానిని హిందూ సాంస్కృతిక వారసత్వంగా యోగాను ప్రకటిస్తున్నారు. హిందూ సాంస్కృతిక ఆధిపత్యానికి చిహ్నంగా యోగాపై ప్రచారం సాగిస్తున్నారు. దీని ద్వారా ఇతర మతాల కంటే హిందూ మత ఆధిక్యతను చాటడానికి వాడుకుంటున్నారు. మతపరమైన విభజనకు యోగాను పరోక్షంగా వినియోగిస్తున్నారు. యోగా వ్యక్తిగతంగా ఆచరించాల్సినది కాగా దానిని సామూహికం చేసి సాంస్కృతికపరమైన గుంపు భావన పెంపొందిస్తున్నారు. ఈ గుంపు తత్వంతో యోగాకు ఏకైక నాయకునిగా మోదీ భజనకు ద్వారాలు తెరుస్తున్నారు.

మోదీ ఇప్పుడు రాజకీయంగా దక్షిణాది జైత్రయాత్రకు ఆంధ్ర ప్రదేశ్‌ను ఎంచుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ముస్లింల సంఖ్య తగినంత లేకపోవడం సాధారణ మత విద్వేష రాజకీయం ఇక్కడ అంతగా పనిచేయదు. ఆ పని చేసి పెట్టడానికి "సనాతన ధర్మ" వేషం ధరించిన "చాక్ లెట్ బాయ్" పవన్ కల్యాణ్ వున్నారు. చంద్రబాబును వశపరుచుకోవడానికి మతవిద్వేష రాజకీయానికి బదులు మరోదారి అవసరం. యోగ ద్వారా హిందూ సాంస్కృతిక గుంపు భావోద్వేగాన్ని కల్పించడం ద్వారా రాష్ట్రంలో మెజారిటీ ప్రజలను ఆకట్టుకునే కొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. దీనికి చంద్రబాబును పావుగా వాడుకుంటున్నారు.

రాజకీయంగా రాష్ట్రంలో విస్తరించడానికి యోగాడేలో మోదీనే స్వయంగా పాల్గొంటున్నారు. రాష్ట్రంలో మోదీని మెప్పించడానికి తెలుగుదేశం, జనసేన పార్టీలు పోటీ పడుతున్నాయి. మొదటి ఛాన్స్ సనాతన ధర్మం పేరుతో మోదీనికి సన్నిహితం కావడంలో పవన్ కల్యాణ్ ముందున్నారు. వెనుకబడిన చంద్రబాబు మెగా యోగా కార్యక్రమాలతో మోదీ దగ్గర తనస్థానాన్ని మెరుగు పరుచుకోవడానికి శక్తి వంచన లేని ప్రయత్నాలు చేస్తున్నారు. జూన్ 21న రెండు కోట్ల మందితో రాష్ట్రవ్యాప్తంగాను, మోదీ చెంతన రెండు లక్షల మందితో యోగా కార్యక్రమాన్ని చేపట్టారు. నెల రోజులుగా స్వర్ణాంధ్రప్రదేశ్ నినాదం పక్కకు పోయింది యోగాంధ్ర నినాదం  ముందుకొచ్చింది. మోదీ రాజకీయ విస్తరణకు చంద్రబాబు కొత్త ద్వారాలు తెరిచారు. ఇది రాష్ట్ర భవిష్యత్‌కు మతపరమైన రాజకీయ ముప్పుకానుంది. రాష్ట్ర ప్రజలు తమ తమ శారీరక, మానసిక అవసరాల కోసం యోగాను ఆదరించండి. కాని యోగా ముసుగులో మోదీ రాజకీయ పన్నాగాలను నిరసించండి. ❑

# యోగా దినోత్సవం-హిందూత్వ ఎజెండా

- డా బి.గంగారావు

11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈసారి విశాఖపట్నంలో యోగాంధ్ర పేర జూన్ 21న జరిపేందుకు సర్వం సిద్ధం చేశారు. విశాఖపట్నంకే పరిమితంకాక టిడిపి కూటమి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా జరుపుతున్నది. సుమారు 2 కోట్ల మంది యోగా దినోత్సవంలో పాల్గొనటానికి పేర్లు నమోదు చేసుకున్నారని ముఖ్యమంత్రి ఇప్పటికే ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీతోపాటు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గాక పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, 22 దేశాల ప్రతినిధులు పాల్గొనబోతున్నారు.

విశాఖలో ఆర్.కే. బీచ్ తీరంలో 15 కిలోమీటర్ల పొడవున తలపెట్టిన యోగాలో మూడు లక్షల మంది పాల్గొని యోగాసనాలు వేస్తారని ప్రకటించారు. జూన్ 20వ తేదీ ప్రత్యేకంగా 25 వేల మంది గిరిజన విద్యార్థులతో సూర్యనమస్కార కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. యోగా దినోత్సవంలో పాల్గొనే వారికి మ్యాట్, టీ షర్ట్, అల్పాహారం ప్రభుత్వం ఇస్తుంది. గత నెల రోజుల నుంచి జిల్లావ్యాప్తంగా వార్డు సచివాలయ, స్వయం సహాయక సిబ్బంది ఇంటింటికి తిరిగి యోగా నమోదు ప్రక్రియ చేస్తున్నారు. నగరంలో అన్ని ప్రాంతాలు, గ్రామాలు, పరిశ్రమలు, ప్రభుత్వ ఉద్యోగులతో ఇలా పెద్ద ఎత్తున యోగా శిక్షణ కొన్ని రోజుల నుంచి సాగుతున్నది. రెండు వేల మంది యోగా శిక్షకులతో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇందులో పాల్గొనేందుకు నమోదు చేసుకున్న వారిని బీచ్‌కి తరలించడానికి 2010 బస్సులు, వేలాది ఆటోలు, మినీ ప్రైవేట్ వాహనాలను సిద్ధం చేశారు. ఇక ప్రకటనలు, ఎలక్ట్రానిక్ బోర్డులు, కటౌట్లు, ప్రచార మాధ్యమాల్లో ఈ కార్యక్రమాన్ని హోరెత్తిస్తున్నారు. ఆర్.కె బీచ్‌లో ప్రత్యేకంగా అయోధ్య తరహా తాత్కాలిక రామాలయాన్ని నిర్మించి అక్కడ కూడా యోగా ప్రచారం చేస్తున్నారు.

యోగా అనేది ఒక శారీరక వ్యాయామం. దీనికి ఏ మత విశ్వాసాలతో సంబంధం ఉండకూడదు. ప్రాచీన కాలం నుండి మన దేశంలో సాధన చేస్తున్నారు. మన దేశంతోపాటు ప్రపంచంలో కుల, మత, లింగ, జాతి, తెగ, ప్రాంతం, రంగు ఇలా ఏ ఒక్క దానికి పరిమితం కాకుండా అనేక దేశాల్లో ప్రజలు యోగాను ఆరోగ్యం, మనశ్శాంతి, మానసిక ఉల్లాసానికి ఒక సాధనగా ఆచరించే వారున్నారు.



కేంద్ర బీజేపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం ఉద్దేశం ఇది కాదు. తన మనువాద హిందూత్వ ఎజెండాలో భాగంగా దీనిని ముందుకు తీసుకొచ్చి అమలు చేస్తున్నది. 2014లో కేంద్రంలో అధికారంలోకి రావడంతోటే మోదీ ప్రోద్బలంతో 2014 డిసెంబర్ 11న జరిగిన ఐక్యరాజ్య సమితి జనరల్ కౌన్సిల్‌లో జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటింపజేశారు. ఈ తేదీ నిర్ణయం యాదృచ్ఛికంగా జరిగింది కాదు. ఆ రోజు రాష్ట్రీయ స్వయం సేవక్ సంస్థ(ఆర్.ఎస్.ఎస్) వ్యవస్థాపకుడు కె.బి.హెగ్డేవార్ మరణించిన రోజు. అందుకే ఆ రోజును అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ఎంచుకున్నారు. హిందూత్వ శక్తులు ప్రతి ప్రభుత్వ కార్యక్రమాలను మతతత్వ భావాలను ప్రజల్లో వెదజల్లటానికి ఉపయోగపడే పురాణ, ఇతిహాస గాథల్లో ఉండే ఘటనలను, తేదీలను, హిందూత్వ సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లిన వారి పేర్లతో ముడి పెట్టి అమలు చేస్తున్నారు.

ఇప్పటి వరకు నిర్వహించిన యోగా దినోత్సవాలు కేవలం ఎక్కడో ఒకచోట నిర్ణయించిన నగరానికే ప్రజలను సమీకరించి యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. 30 వేలకు మించి సమీకరణలు ఎక్కడా జరగలేదు. ఈసారి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని గతంలో వాటికి భిన్నంగా దేశవ్యాప్తంగా లక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్నది. గత మార్చి నుండి మూడు నెలల పాటు హిందూ సమాజంలో ఉన్న వివిధ తరగతులను సమీకరించేలా లక్ష్యాన్ని పెట్టుకొని అనేక కార్యక్రమాలు చేస్తున్నది. యోగా సంఘం, యోగా బంధన్, యోగా సమావేశ, యోగా కనెక్ట్, హరిత యోగా, యోగా మహాకుంభ్, సంయోగ ఇలా అనేక పేర్లతో హిందూ సమాజాన్ని సమీకరిస్తున్నారు.

షుగర్, బిపి, ఆస్తమా వంటి జబ్బులున్న వారితోపాటు మహిళలు, సీనియర్ సిటిజన్‌లను లక్ష్యంగా పెట్టుకొని ప్రత్యేక యోగా శిక్షణలు ఇస్తున్నారు.

అందరికీ ప్రాంతాల వారీగా, కాలనీ, గ్రామాల వారీగా యోగా సంఘాలను పెడుతున్నారు. కేంద్ర ప్రభుత్వమే యోగా శిక్షకులను ఉచితంగా పంపుతున్నది. అందుకు ప్రత్యేక ఆన్‌లైన్ ఎన్‌రోల్‌మెంట్, యాప్‌లు వంటివి సృష్టించింది. యోగాలో శిక్షణ పొందే వారి పేర్లతోపాటు యోగా కార్యక్రమాల్లో పాల్గొనే వారందరి పేర్లు ఆన్‌లైన్‌లో బార్ కోడ్‌లో నమోదు చేస్తున్నారు. శిక్షణలో పాల్గొనే వారికి కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ సర్టిఫికెట్ ఇస్తుంది. విద్యార్థులు, యువకులను కేంద్రంగా చేసుకొని ప్రత్యేకంగా యోగాపై క్విజ్, వ్యాస రచన, డ్యాన్స్, హాస్య, నాటిక, ఈ-పోస్టర్, ఫోటో, సోషల్ మీడియా వంటి పోటీలు నిర్వహిస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులను కూడా యోగాలో నిర్బంధంగా పాల్గొనేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే వారిని ఆదేశించారు. దేశంలోని అన్ని పరిశోధన సంస్థలను యోగా కార్యక్రమంలో పాల్గొవడం తప్పనిసరి చేశారు.

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన యోగా ప్రోటోకాల్ పత్రం ప్రకారం యోగా కార్యక్రమం గంటపాటు నిర్వహించాలి. ఇందులో 45 నిమిషాలు 10 రకాల భంగిమలతో కూడిన వ్యాయాయం, మరో 15 నిమిషాలు ఆధ్యాత్మిక ప్రసంగం ఉంటుంది. తొలుత ప్రార్థనతో యోగా ప్రారంభించాలి. ఈ ప్రార్థన బిజెపి శక్తులు ప్రచారం చేస్తున్న ఒకే దేశం, ఒకే భాష, ఒకే దైవం, ఒకే ఎన్నిక అనే భావాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రార్థన భావం చూడండి. “ఓం/అందరూ ఏక రీతిలో నడవండి/ అందరూ ఏక కంఠంతో పలకండి/మనసును ప్రశాంతంగా ఉంచండి/ప్రతి పవిత్ర ప్రయత్నంలో/దైవత్వం ఉట్టిపడుతుంది.” అలాగే చివరిగా ఉపనిషత్తులోని “ఓం శాంతి: శాంతి: శాంతి:” అనే శ్లోకంతో యోగా వ్యాయామం ముగుస్తుంది.


రాజ్యం అనేది అన్ని మతాలకు సమదూరంలో ఉండాలని భారత రాజ్యాంగం ఆదేశిస్తున్నది. అంతేగాక అన్ని మతాలను సమానంగా గౌరవించాలని తెలుపుతుంది. అధికారంలో ఉన్న ఏ ప్రభుత్వం ఏ మతానికి అనుకూలంగా ప్రచారం చేయకూడదు. ఎందుకంటే భారతదేశం భిన్న మతస్తులు ఉన్న దేశం. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా స్వాతంత్రోద్యమంలోనే అన్ని మతాల వారిని కలుపుకునే నేపథ్యంలో లౌకికతత్వం అనే భావన దేశంలో రూపుదిద్దుకుంది. హిందూ మతోన్మాద శక్తులు లౌకిక తత్వాన్ని, భావాన్ని ప్రజల్లో లేకుండా చేసి భారతదేశాన్ని హిందూ దేశంగా మార్చాలనే కుట్ర స్వాతంత్రోద్యమ కాలం నుంచి సాగిస్తున్నది. అందులో భాగంగా యోగాను ఒక ఆయుధంగా ఎంచుకొని అధికారాన్ని అడ్డం పెట్టుకొని దశాబ్ద కాలంగా ప్రజల్లోకి తీసుకెళుతున్నది.

యోగాను ఎంచుకోవడంలో కారణం ఏమిటంటే భారత దేశ ప్రజల దృష్టిలో యోగా హిందూ పౌరాణిక దేవుళ్లు, ఋషులు, గ్రంథాలతో ముడిపడి ఉంది. ప్రజల్లో ఉన్న ఈ భావనను బీజేపీ, ఆర్.ఎస్.ఎస్ శక్తులు హిందూ పురాణాలను సులభంగా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి యోగాను ఒక ఆయుధంగా ఎంచుకున్నాయి. వేదాల పట్ల, ప్రాచీన గ్రంథాల పట్ల గుడ్డి నమ్మకాన్ని ప్రజల్లో పెంచి వీటినే నిజమైన చరిత్రగా నమ్మించడానికి, చలామణిలోకి తీసుకురావటానికి ప్రయత్నం చేస్తున్నాయి. బూజుపట్టిన హిందూ మత క్రతువులు, ఆచారాలు, సంప్రదాయాలు, మత విశ్వాసాలు, నమ్మకాలు, పవిత్రతలు, విలువల ప్రచారవ్యాప్తి చేయగలుగుతున్నారు. యోగాను వాణిజ్యీకరణ కూడా చేసి పతంజలి వంటి సంస్థలు పెద్దఎత్తున వ్యాపారం సాగిస్తున్నాయి. రాందేవ్ వంటి వారిని దేశవ్యాప్తంగా తిప్పి ప్రదర్శనలు ఇప్పిస్తున్నారు.

యోగా కార్యక్రమంలో అన్ని రకాల మతస్తులు పాల్గోవటానికి ఎలాంటి ఆటంకం లేదనే భావన పైకి కనిపిస్తుంది. కానీ యోగా అభ్యసన హిందూ మత ప్రార్థనతోటే ప్రారంభం అవుతుంది. ఇందులో వేసే వివిధ రకాల భంగిమలు, ఉపయోగించే పదాలు అన్నీ హిందూ దేవుళ్లను ప్రతిబింబిస్తాయి. కనుక ఇతర మతస్తు లెవ్వరు స్వచ్ఛందంగానే దీనిలో పాల్గొనరు. దీనినే హిందూత్వ శక్తులు కోరుకుంటున్నాయి. దీని ద్వారా ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీల ఎడల సులభంగా ద్వేషాన్ని ఎక్కించగలుగుతున్నారు. ముఖ్యంగా విద్యా సంస్థలను కేంద్రంగా చేసుకొని చిన్న వయస్సు లోనే పిల్లలకు పరమత ద్వేషాన్ని, హిందూత్వ భావనలను ఎక్కించడానికి యోగాను ఉపయోగించుకుంటున్నారు. గత కొన్నేళ్లుగా ఆదివాసీ ప్రాంతాల్లో లక్షల కొలది విద్యార్థులకు సూర్య నమస్కారాలు నేర్పించి ఈ భావనలు కల్పిస్తున్నారు. ఒక్క అల్లూరి గిరిజన జిల్లాలో 25 వేల మంది విద్యార్థులకు సూర్య నమస్కారాలు నేర్పించి జూన్ 20న విశాఖలో ప్రదర్శన ఇవ్వనున్నారు. ఈ ప్రక్రియను దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నారు.

హిందూత్వ మతోన్మాద శక్తులు యోగా ద్వారా మరో ముఖ్యమైన రాజకీయ లక్ష్యాన్ని ఏపీలో పెట్టుకున్నట్లు తెలుస్తున్నది. తెలుగుదేశం, జనసేనలను ఉపయోగించుకొని తన భావజాలాన్ని ప్రజల్లోకి వ్యాప్తిచేయడం, ప్రజలపై రాజకీయంగా పట్టు సాధించడం అనే వ్యూహంతో నేడు యోగాను మారుమూల గ్రామాలకు విస్తరిస్తున్నారు. ఎందుకంటే దక్షిణాది రాష్ట్రాలన్నిటికన్నా బిజెపి చాలా బలహీనంగా ఉన్నది ఆంధ్రప్రదేశ్‌లోనే. అధికార కూటమిలో ఉన్నా ప్రజలపై రాజకీయ ఆధిపత్య శక్తిగా లేదు. అయితే కూటమిలోని తెలుగు దేశం, జనసేన పార్టీలు లౌకిక స్వభావానికి దూరంగా జరుగుతు న్నాయి. ఈ పార్టీల అధినాయకులు **(మిగతా 15వ పేజీలో)**

# పెరుగుతున్న సైనిక వ్యయం



- ప్రభాత్ పట్నాయక్

ప్రపంచం మొత్తంగానే ఇప్పుడు సైనిక వ్యయం జోరుగా పెరుగుతోంది. ఇందులో యూరప్‌లో పెరుగుదల అన్నింటికన్నా ఎక్కువగా ఉంది. ఏయే ఖర్చులను సైనిక వ్యయంగా పరిగణిస్తారు అన్న దానికి రకరకాల ప్రాతిపదికలు ఉన్నాయి. అందుచేత మనం ఇక్కడ స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అంచనాలను మన విశ్లేషణకు ప్రాతిపదికగా తీసుకుంటున్నాం. ఆ సంస్థ నివేదికల ప్రకారం, గత పది సంవత్సరాలుగా వరుసగా వాస్తవ సైనిక వ్యయం ఏటికేడాదీ పెరుగుతూనే వస్తోంది. 2024లో ఆ ముందేడాది కన్నా ఏకంగా 9.4 శాతం వ్యయం పెరిగింది. ప్రచ్ఛన్న యుద్ధ కాలం ముగిసిన తర్వాత ఏ ఏడాదిలోనూ ఇంత ఎక్కువగా పెరిగినది లేదు. ఇదే అత్యధికం. 2024లో ప్రపంచవ్యాప్తంగా జరిగిన సైనిక వ్యయం 2,718 లక్షల కోట్ల డాలర్లు (అంటే సుమారు రూ. 2,33,74,800 కోట్లు).

### ఇంత భారీగా ఖర్చు పెరగడానికి కారణాలు ఏమిటి?

**మొదటిది** : అమెరికాలో హౌసింగ్ బుడగ పేలిపోయిన అనంతరం నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడింది. దానితోబాటు అమెరికా నేతృత్వంలోని సామ్రాజ్యవాద శిబిరం ఆధిపత్యాన్ని సవాలు చేసే శక్తులు పెరుగుతున్నాయి.

**రెండవది** : ఈ సామ్రాజ్యవాద శిబిరపు ఆధిపత్యాన్ని నిలుపుకోవడం కోసం అవసరమైన సైనిక వ్యయంలో ప్రధాన భాగాన్ని ఇన్నాళ్ళూ అమెరికా భరించింది. ఇక ఇప్పుడు ఆ మేరకు భరించడానికి అది సిద్ధంగా లేదు. తన యూరోపియన్ భాగస్వాములు (బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ వగైరా దేశాలు) ఈ భారాన్ని ఎక్కువగా పంచుకోవాలని అమెరికా కోరుకుంటోంది. సామ్రాజ్యవాద శిబిరం దూకుడుగా సైనిక వ్యయాన్ని పెంచుకుంటూ పోవడం వలన ఆ సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని తట్టుకోడానికి, నిలవరించడానికి తక్కిన దేశాలు కూడా తమ తమ సైనిక వ్యయాలను పెంచుకోడం అనివార్యం అవుతోంది.

**ఇక్కడ మరికొంత వివరణ అవసరం..** 2008 సంక్షోభం తలెత్తక ముందు తమ తమ విదేశీ వ్యాపార చెల్లింపుల్లో పెద్దగా లోటు ఏర్పడని దేశాలు సంక్షోభం బద్దలయ్యాక దిక్కుతోచని స్థితిలో పడ్డాయి. ఆ తర్వాత కోవిడ్ మహమ్మారి వ్యాపించడంతో ఆ దేశాల పరిస్థితి మరీ కనాకష్టంగా మారింది. వారి ఎగుమతుల మార్కెట్లు కుదించుకుపోయాయి. ప్రవాసులుగా ఉన్నవారు తమ తమ దేశాలకు ఆదాయాలను పంపడం తగ్గిపోయింది. తమను ఎప్పుడు స్వదేశాలకు తిప్పి పంపేస్తారో అన్న భయం వారిని ఆవహించడం దీనికి కారణం. వారి ద్వారా ఆయా దేశాలకు వచ్చే విదేశీ మారక ద్రవ్యం తగ్గిపోయింది. ఇలా అన్ని దారులూ మూసుకుపోవడంతో అనేక దేశాలు రుణ సంక్షోభాల్లో చిక్కుకుపోయాయి. అమెరికా నాయకత్వంలో తమపై రుద్దిన నయా ఉదారవాద అంతర్జాతీయ వ్యవస్థ పట్ల రాను రాను ఆ దేశాల భ్రమలు తొలగిపోతున్నాయి. ఇదే సమయంలో చైనా చెప్పుకోదగ్గ రీతిలో అధిక వృద్ధి రేట్లను నమోదు చేస్తోంది. చైనాలో చౌకగా కార్మికశక్తి లభిస్తుందన్న కారణంగా మొదట్లో ఆ దేశానికి తమ పరిశ్రమలను తరలించినది సామ్రాజ్యవాద దేశాలే. ఆ అవకాశాన్ని చైనా బాగా అందిపుచ్చుకుంది. తన విదేశీ వ్యాపారంలో మిగులును బాగా పెంచుకోగలిగింది. ఇబ్బందుల్లో చిక్కుకున్న కొన్ని దేశాలకు కొంతమేరకు తోడ్పాటును అందించగలుగుతోంది. ఇది సామ్రాజ్యవాద పెత్తనానికి పెద్ద సవాలుగా మారింది. అందుకే చైనాకు వ్యతిరేకంగా సైనికపరంగా జోక్యం చేసుకోడానికి సామ్రాజ్యవాదం తన మిలిటరీ సామర్థ్యాన్ని పెంచుకోడానికి పూనుకుంది.

సంక్షోభం తలెత్తాక, అమెరికా తన సైనిక వ్యయంలో కొంత భాగాన్ని తక్కిన సామ్రాజ్యవాద మిత్రులపై మోపేందుకు ప్రయత్నిస్తోంది. తన ఆర్థిక వ్యవస్థపై పడుతున్న సంక్షోభ భారాలను ఏవిధంగా సుంకాల యుద్ధం ద్వారా ఇతర దేశాలపైకి నెట్టివేయడానికి పూనుకుంటోందో అదే విధంగా సైనిక వ్యయం విషయంలో చేస్తోంది. దీంతో సామ్రాజ్యవాద శిబిరం మొత్తంగానే సైనిక వ్యయం పెరుగుతోంది. గతంలో అమెరికా గొడుగు నీడన తమ సైనిక అవసరాలను తీర్చుకున్న యూరోపియన్ దేశాలు ఇప్పుడు స్వంతంగా భారీ సైనిక వ్యయాన్ని చేపట్టవలసివచ్చింది.

రష్యా నుండి దురాక్రమణ జరిగే ప్రమాదం పొంచి వుందన్న సాకును చూపించి ఈ యూరోపియన్ దేశాలు తమ సైనిక వ్యయం పెంపును సమర్థించుకోజూస్తున్నాయి. కాని ఈ సాకు చెల్లుబాటు కావడం లేదు. వాస్తవానికి రష్యాపైనే యూరపియన్ దేశాలు దురాక్రమణకు తలపడ్డాయి. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం అయిన సమయంలో మిఖాయిల్ గోర్బచేవ్‌కు క్లింటన్ ప్రభుత్వం హామీ స్పష్టంగా ఇచ్చింది. అమెరికా నేతృత్వంలోని

నాటో కూటమి సేనలు రష్యా వైపుగా విస్తరించబోవు అన్నదే ఆ హామీ. కాని దానికి విరుద్ధంగా నాటో సేనల మోహరింపు రష్యా సరిహద్దుల వరకూ జరిగింది. ఉక్రెయిన్‌లో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన విక్టర్ యానుకోవిచ్ ప్రభుత్వాన్ని కుట్ర పూరితంగా కూలదోసింది సామ్రాజ్యవాద దేశాలే. రెండో ప్రపంచ యుద్ధకాలంలో నాజీలతో చేతులు కలిపిన ద్రోహి స్టెపాన్ బందేరాకు అనుచరులుగా వ్యవహరించిన వారిని ఉక్రెయిన్‌లో ప్రభుత్వంలో కూర్చోబెట్టిందీ సామ్రాజ్యవాద దేశాలే. ఆ తర్వాత ఉక్రెయిన్‌లో మైనారిటీలుగా ఉన్న రష్యన్ జాతి ప్రజలమీద ఆ ప్రభుత్వం దాడులకు తెగబడింది. నాటోలో సభ్యదేశంగా చేరడానికి దరఖాస్తు చేసింది. ఆ విధంగా రష్యా దేశమే దురాక్రమణ ప్రమాదాన్ని ఎదుర్కోవలసి వచ్చింది తప్ప తాను దురాక్రమణకు పూనుకున్నది లేదు.

2024లో రష్యా మొత్తం సైనిక వ్యయం 149 బిలియన్ల డాలర్లు. అదే నాటోలో సభ్యదేశాలుగా ఉన్న యూరోపియన్ దేశాల సైనిక వ్యయం 454 బిలియన్ల డాలర్లు. అంటే రష్యా సైనిక వ్యయంకన్నా మూడు రెట్లు ఎక్కువ. నిజానికి రష్యా ప్రస్తుతం యుద్ధంలో నిమగ్నమైవుంది. యూరోపియన్ దేశాల పరిస్థితి అలా లేదు. కాని రష్యా నుండి ప్రమాదం పొంచి వుందంటూ చెప్పి రష్యా కన్నా మూడు రెట్లు ఎక్కువ సైనిక వ్యయాన్ని చేయడం పచ్చి మోసం. వాస్తవానికి తమ సామ్రాజ్యవాద పెత్తనాన్ని ఎలాఐనా నిలబెట్టుకోవాలన్న కాంక్ష తోటే ఆ దేశాలు తమ సైనిక వ్యయాన్ని పెంచాయి.

ప్రత్యేకించి గతేడాది జర్మనీ తన సైనిక వ్యయాన్ని ఏకంగా 28 శాతం మేరకు పెంచింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత జర్మనీ సైనిక బలాన్ని పెంచుకోడానికి వీలు లేకుండా పలు ఆంక్షలను విధించారు. ఆ పరిస్థితి ఇప్పుడ పూర్తిగా మారిపోయింది. 2024 నాటికి యూరప్ లోనే అత్యధిక సైనక వ్యయం చేసిన దేశంగా జర్మనీ నిలిచింది. అంతే కాక ప్రపంచం మొత్తం మీద అధిక సైనిక వ్యయాన్ని చేసిన దేశాల్లో నాల్గవదిగా జర్మనీ ఉంది. ఇది చాలా పెద్ద మార్పు. జర్మనీకి ఉన్న నాజీ గతం, యుద్ధాలకు కాలు దువ్వే లక్షణం మళ్ళీ తిరగబెట్టి ప్రపంచానికి రాచపుండుగా మారే ప్రమాదం కనిపిస్తోంది. దాని పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉండబోతున్నాయి.

సామ్రాజ్యవాదం ఈ విధంగా తన సైనిక వ్యయాన్ని గతం కన్నా పెంచడం, భవిష్యత్తులో మరింతగా పెంచనున్నట్టు ప్రకటించడం చూస్తే అసలు ఈ అదనపు వ్యయాన్ని భరించడానికి నిధులు ఏ విధంగా సమీకరిస్తుంది అన్న ప్రశ్న తలెత్తుతుంది. తమ బడ్జెట్లలో ద్రవ్య లోటును కొంత వరకూ పెంచడం అనివార్యంగా జరుగుతుంది. దానితోబాటు ప్రజల సంక్షేమం కోసం చేసే ఖర్చులకు కోత పడడం తప్పదు. వారి దృష్టిలో ఆ కార్పొరేట్లే ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించగల శక్తులు కనుక ఆ కార్పొరేట్ల జోలికి ప్రభుత్వాలు పోవు.

తాజాగా ట్రంప్ ప్రతిపాదించిన బిల్లు ఇందుకు ఉదాహరణ. దానిని అతగాడు “పెద్ద, అందమైన బిల్లు” అని పొగిడాడు. అది అమెరికన్ కాంగ్రెస్ ఆమోదం పొందింది. ఇక సెనేట్ ఆమోదం పొందమే తరువాయి. ఆ బిల్లు ప్రకారం రాబోయే పదేళ్ళలో కార్పొరేట్లకు 3.76 లక్షల కోట్ల డాలర్ల పన్ను రాయితీలు ఇవ్వనున్నారు. అదే కాలంలో సంక్షేమ పద్దుల్లో 1.3 లక్షల కోట్ల డాలర్ల మేరకు కోతలు పెట్టనున్నారు. వీటితోబాటు ప్రభుత్వ వ్యయం మొత్తం మీద మరో 2.5 లక్షల కోట్ల డాలర్ల మేరకు పెరగనుంది. పన్ను రాయితీల ప్రయోజనాలు సంపన్నులకు దక్కుతాయని, సంక్షేమంలో కోతల వల్ల పేదలే ఎక్కువగా దెబ్బ తింటారని వేరే చెప్పనక్కరలేదు. ఆర్థిక అసమానతలు కూడా తీవ్రంగా పెరుగుతాయి. ముఖ్యంగా వైద్య రంగంలో ప్రభుత్వ వ్యయం తగ్గి, హెల్త్ ఇన్సూరెన్స్ చార్జీలు పెరగనున్నందు వల్ల పేదలు మరింత దెబ్బ తింటారు.

ఈ బిల్లు అమెరికన్ కాంగ్రెస్‌లో ఒకే ఒక్క ఓటు మెజారిటీతో నెగ్గింది. సెనేట్‌లో ఏం జరగబోతోందో స్పష్టంగా తెలియదు. ఐతే ఇటువంటి సందర్భాలలో అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఎలా పావుల్ని కదిపి పరిస్థితిని తనకు అనుకూలంగా మార్చుకోగలుగుతుందో ఊహించవచ్చు. బ్రిటన్‌లో లిజ్ ట్రస్ ప్రభుత్వం ఉన్నప్పుడు పెట్టుబడిదారులకు పన్ను రాయితీలు ఇవ్వడం కోసం బడ్జెట్‌లో లోటును పెంచడానికి ప్రతిపాదించింది. లబ్ధి పొందబోయేది పెట్టుబడిదారులే అయినప్పటికీ, బడ్జెట్ లోటును ఆ విధంగా పెంచడానికి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి సుతరామూ ఒప్పుకోలేదు. దాంతో బ్రిటిష్ పౌండు విలువ విదేశీ మారక మార్కెట్లో పడిపోయింది. ద్రవ్య పెట్టుబడి బ్రిటన్ నుంచి తరలిపోయింది. లిజ్ ట్రస్ వెంటనే రాజీనామా చేయవలసి వచ్చింది. బ్రిటన్ చరిత్రలోనే అత్యల్ప కాలం ప్రధానిగా ఉన్న వ్యక్తిగా ఆమె నిలిచింది. ఇప్పుడు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి గనుక ట్రంప్ బిల్లును ఆమోదించకపోతే, అందులో ప్రతిపాదించిన ద్రవ్య లోటును ఇంకా తగ్గించవలసి వస్తుంది. అప్పుడు సంక్షేమ పద్దుల్లో కోతలు ఇంకా పెరుగుతాయి.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత కాలంలో సంపన్న పెట్టుబడి దారీ దేశాల్లో సంక్షేమ పద్దుల ఖర్చు పెంచవలసి వచ్చింది. సోషలిస్టు ప్రపంచం నుండి ఎదురైన సవాలును తట్టుకోడానికి ఈ సంపన్న పెట్టుబడిదారీ దేశాలు తమ పాత వలసలపై అధికారాన్ని వదులుకోవలసి వచ్చింది. దానితోబాటు తమ స్వంత దేశాల్లో దాదాపు పూర్తి స్థాయిలో ఉపాధి కల్పించవలసి వచ్చింది. కార్మికవర్గం పెట్టుబడిదారీ వర్గం నుండి సాధించుకున్న ఈ రాయితీలను ఆ విధంగా చూపకుండా, పెట్టుబడిదారీ వ్యవస్థ స్వభావమే ఏకంగా మారిపోయిందని,

ఇప్పుడది సంక్షేమ రాజ్యం అయిపోయిందని, అందుచేత మళ్ళీ సోషలిజం వైపు పోవలసిన అవసరం లేదని ఉదారవాద ఆర్థికవేత్తలు ప్రచారం ఎత్తుకున్నారు. 1960, 1970 దశకాల్లో ద్రవ్యోల్బణం విజృంభించింది. ఆ తర్వాత చాలా దేశాల్లో నయా ఉదారవాద వ్యవస్థ తలెత్తింది. ఈ సంపన్న దేశాల్లో నిరుద్యోగం మళ్ళీ పెరగసాగింది. ఇప్పుడు నయా ఉదారవాద వ్యవస్థ సంక్షోభంలో పడింది. సామ్రాజ్యవాద పెత్తనమే సవాలును ఎదుర్కొంటోంది. ఈ సవాలును తట్టుకోడానికి సామ్రాజ్యవాదం సైనిక వ్యయాన్ని భారీగా పెంచడానికి తయారైంది. దీని పర్యవసానంగా సంక్షేమ వ్యయం మరింత తగ్గిపోతుంది. ఇటీవల కాలంలో మనం చూడనంత దుర్మార్గంగా సంపన్న పెట్టుబడిదారీ దేశాల కొల్లగొట్టే దారిదోపిడీ స్వభావం బైట పడుతోంది. ఈ స్వభావం తమ తమస్వంత దేశాల్లోని ప్రజలను కూడా విడిచిపెట్టడం లేదు. అమెరికా, చైనా, రష్యా, జర్మనీల తర్వాత సైనిక వ్యయంలో ఐదవ అతి పెద్ద దేశంగా భారతదేశం ఉంది. 2024లో 8610 కోట్ల డాలర్ల సైనిక వ్యయాన్ని చేసింది (సుమారు రూ. 7,40,000 కోట్లు). ఉపాధి హామీ వంటి పథకాలకు నిధులను నిరాకరిస్తూ సైనిక వ్యయాన్ని మరింతగా పెంచడానికి పూనుకోవడం దాని ఫాసిస్టు లక్షణాన్ని సూచిస్తోంది. అమెరికా, ఇతర సంపన్న పెట్టుబడిదారీ దేశాలు ట్రంప్ నాయకత్వంలో ఏ విధంగా వ్యవహరిస్తున్నాయో, దానినే మోదీ ప్రభుత్వం అనుసరించడానికి పూనుకుంటోంది. మనం దీనికి వ్యతిరేకంగా పోరాడాలి. ❑

# యోగా దినోత్సవం- హిందూత్వ ఎజెండా

**(12వ పేజీ తరువాయి)**

హిందూత్వ భావనలు, శక్తులను వెనకేసుకురావడం, ఉద్దేశపూర్వకంగా తిరుపతి లడ్డూ కల్తీ, సనాతన ధర్మం వంటి అంశాలు లేవనెత్తడం, పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ వంటి మైనార్టీ తరగతుల వ్యతిరేక బిల్లులకు మద్దతు ఇవ్వడం వంటివన్నీ బీజేపీ, ఆర్.ఎస్.ఎస్ శక్తులు బలపడటానికి తురుపు ముక్కలుగా ఉపయోగపడుతున్నాయి.

ఇప్పుడు యోగాంధ్ర సాకుతో రాష్ట్రంలో 20 వేల మంది యోగా శిక్షకులను తయారుచేసి వారి ద్వారా హిందూత్వ భావజాలాన్ని వ్యాప్తి చేయటానికి సిద్ధమయ్యారు. ఇప్పటికే 5400 మందికి కేంద్ర ప్రభుత్వం శిక్షణ ఇచ్చి యోగాంధ్ర కార్యక్రమంలో టీచర్లుగా నియమించారు. అధికారాన్ని ఉపయోగించుకొని వందల, వేల కోట్లు డబ్బును వినియోగించి ఆంధ్రరాష్ట్రంలో తన మనువాద హిందూత్వ ఫాసిస్టు వ్యూహంలోకి ప్రజలను లాగటానికి ప్రయత్నం చేస్తున్నారు. ఈ మతతత్వ వ్యూహం రాష్ట్ర ప్రజల సమైక్యతకు, లౌకిక తత్వానికి పెను ప్రమాదాన్ని తెచ్చి పెడుతుంది. ఈ శక్తుల వ్యూహాలను, చర్యలను అన్ని మతస్తులు ఐక్యంగా, బలంగా ప్రతిఘటించడమే నేడు రాష్ట్రం ముందున్న కర్తవ్యం. ❑

# మోడీ @ 11- రివర్స్ పొగడ్తలు!

**(8వ పేజీ తరువాయి)**

సమస్య కూడా ఈ పొగడ్తల్లోనే మనకు అర్థమవుతుంది. మెజార్టీ కోల్పోయిన బీజేపీ ఆధిపత్యం నిలబెట్టుకోవడానికి తంటాలు పడుతున్నది. వక్ఫ్‌బిల్లు వంటివి కేవలం బీజేపీ-సంఘ్‌ను మత రాజకీయాల మేరకే ఆమోదం పొందుతున్నాయి. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' లాంటి విధానాలు ప్రాంతీయ పార్టీలకు పెద్ద సవాళ్లుగా పరిణమిస్తున్నాయి. ఇతరులపై ఆధారపడిన ప్పటికీ సంఘ పరివార్ ఒత్తిడితో బీజేపీ నాయకత్వం తన సొంత భావజాలాన్ని, రాజకీయ ప్రాధాన్యతలను దేశంపై రుద్దుతున్నదని పైరాతల్లోనే స్పష్టమవుతున్నది. కిందపడి లేచి ఇదో విన్యాసం అన్న చందంగా వంది మాగధులు చెప్పిన అంశాలన్నీ వాస్తవంగా మోదీ సర్కారు ఇరకాటానికి అద్దం పడుతున్నాయి. లౌకిక ప్రతిపక్షాలు ఏకమయితే ఎక్కడ ముప్పు వస్తుందో అన్న భయంతోనే అంతా అనుకూలంగా మార్చి వేయడంలో మోడీ ఘనతగా చాటుకుంటున్నారు. కానీ త్వరలో జరిగే బీహార్ శాసనసభ ఎన్నికలతో సహా రాజకీయ సవాళ్లు, ప్రజల పోరాటాలు బీజేపీని వెన్నాడుతున్నాయి. వరుసగా వస్తున్న అంతర్జాతీయ కుదుపులు ఆర్థిక సవాళ్లు కొనసాగుతున్నాయి. ఒక్క ఏడాదికే ఇలావుంటే మిగిలిన కాలం ఎలా వుంటుందనేది చూడవలసిందే. పైగా ఈ ఎదురుదెబ్బల తర్వాత సంఘ్ పరివార్ కూడా కేవలం మోదీకే అన్నీ వదిలివేయకుండా తన జోక్యం పెంచడం చూస్తున్నదే.

జేపీ నడ్డా స్థానంలో నూతన అధ్యక్షుని ఎన్నిక పూర్తిగా తమకే వదిలి వేయవలసిందని ఆర్ఎస్ఎస్ ఆదేశించిందట. అనూహ్యమైన ఎంపిక జరిగినా ఆశ్చర్యం లేదని కీలక వ్యక్తులే చెబుతున్నారు. ఇంతగా ప్రేరేపించబడిన మతైక జాతీయవాద ధోరణులు ప్రభావం చూపిస్తాయి. ఇటీవల మోదీ పిలుపునిచ్చిన శాశ్వత యుద్ధ సిద్ధాంతం ఆందోళనకరంగా మారుతున్నది. అందుకే ప్రజాస్వామిక శక్తులు మరింత అప్రమత్తంగా వుండక తప్పదు. రాజకీయ అవసరాల కోసం మోదీకి వంతపాడుతున్న వారు అందుకు తగు మూల్యం చెల్లించవలసి వస్తుంది. ❑

# జీడీపీ సంబరాలు - భారతీయుల వాస్తవ స్థితిగతులు

- 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం

**భా**రతదేశం ప్రపంచంలో నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించిందని నీతి ఆయోగ్ సీఈవో ఘంటా పథంగా ప్రకటించారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) ప్రపంచ ఆర్థిక గమనంపై వేసిన అంచనాల్లో భాగంగా 2025-26కు సంబంధించి ఇచ్చిన భవిష్యత్ చిత్రణను బట్టి ఈ మాట చెబుతున్నామని ఒప్పుకోవడం ద్వారా ఆయన కొంత నిజాయితీ చూపించారు. మరిన్ని వివరణలు వచ్చాక మనకు విషయమేంటో మరింత కచ్చితంగా అర్థమైంది. జపాన్ జీడీపీ 4,186.431 కోట్ల డాలర్లయితే దానికన్నా వెంట్రుక వాసి ఆధిక్యతతో భారతదేశ జీడీపీ 4,187.017 కోట్ల డాలర్లకు చేరిందని తేలింది. భారతీయుల తలసరి ఆదాయం డాలర్లలో చూస్తే జపాన్‌లో 13వ వంతు మాత్రమే వుందనేది పూర్తిగా వేరే విషయం. అందువల్లనే మోదీ సర్కారు ఆర్థిక నిపుణుల బృంద సమర్థకులు ఇంతగా ఉబ్బితబ్బిబ్బు కావడం. దాన్ని గోడీ మీడియా వంధి మాగధులు మరింత ఊదరగొట్టడం విడ్డూర మైన విషయం. వాస్తవానికి జీడీపీ స్థూల లెక్కలలోనే మునిగి తేలడం ఇక్కడ యాదృచ్ఛికమేమీ కాదు. ద్రవ్య పెట్టుబడి ఆదేశాలతో నడిచే నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థ కొలబద్ద లక్షణమే అది. ప్రజల పరిస్థితులను, జీవనోపాధి తీరును వెల్లడించే దానికన్నా కప్పిపుచ్చడమే ఎక్కువ జరుగుతుంది. ఇది ప్రపంచమంతటా వున్న ధోరణే కానీ భారతదేశంలో మరీ ఎక్కువగా నడుస్తున్నది. ఎందుకంటే ప్రపంచంలోనే అసమానతలు అత్యధికంగా వుండే దేశంగా దాన్ని చూస్తున్నారు.

2022 ప్రపంచ అసమానతల నివేదిక లెక్కల ప్రకారం దేశ జనాభాలో అత్యగ్ర భాగాన వున్న ఒక్క శాతం మంది 40 శాతం పైగా జాతీయ సంపదను కలిగివున్నారు. అట్టడుగున వుండే 50 శాతం మంది చేతిలో కేవలం 3 శాతం సంపద మాత్రమే వుంది. బాగా పైనున్న పది శాతం మంది చేతుల్లో 57 శాతం జాతీయాదాయం వుండటంలోనూ ఇదే ఆర్థిక అసమానత మరీ ఘోరంగా కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో చూస్తే స్థూల జీడీపీ లేదంటే తలసరి జీడీపీ లెక్క పక్కదోవ పట్టించేదే అవుతుంది. కార్పొరేట్ మతతత్వ కూటమి సాగిస్తున్న క్రూరత్వం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు ఉద్దేశపూరకంగా కల్పించిన సృష్టి.

### తెర వెనక వ్యూహమేంటి?

దీని వెనక వ్యూహం స్పష్టంగా బలంగా కనిపిస్తూనే వుంది. 'బేజోక్యం (జోక్యం లేకుండా) అనే సైద్ధాంతిక తెర మాటున సామాజిక జీవితానికి సంబంధించిన అన్ని రంగాలలోనూ ఆధిపత్య పథకాలను రుద్దడం కోసం రాజ్యం అధికారాన్ని పద్ధతి ప్రకారం ఉపయోగించుకుని దోపిడీ సామాజిక పెత్తనం సాగించడమే' బ్రెజిల్ ప్రముఖ ఆర్థికవేత్త అల్ఫ్రెడో సాద్‌ఫిలో 2006లోనే వివరించారు. ద్రవ్యచోదిత నయా ఉదార వ్యవస్థలో అదే జరుగుతుందని ఆయనన్నారు. ద్రవ్య మార్కెట్లు, అమెరికా పెట్టుబడి అంతర్జాతీయ ప్రయోజనాల హుకుంల దెబ్బకు పెట్టుబడి ప్రధాన పని సరుకులు సేవల ఉత్పత్తి కాకుండా పోయింది. దానికి మారుగా ఇప్పుడు పెట్టుబడి ప్రధానంగా స్పెక్యులేషన్ ద్రవ్య కార్యకలాపాల ద్వారా స్వల్పకాలిక సూపర్ లాభాల ఆర్జన కోసం ఉపయోగించబడుతున్నది. పెట్టుబడికి సంబంధించిన మూడు ప్రధాన వనరులు అంటే ప్రభుత్వ ద్రవ్యం, దేశీయ పొదుపు మొత్తం, దేశ విదేశీ పెట్టుబడుల అనుసంధానం అన్న వాటిపై అంతకంతకూ నియంత్రణ లేకుండా పోవడం, ఒక చోట పోగుపడటం పెరుగుతున్నది. ద్రవ్య పెట్టుబడి ఇందుకు మధ్యవర్తిత్వం వహిస్తున్నది. తమ దేశంలో ఉత్పాదక రంగ ఉద్యోగాలను పునరుద్ధరించుకోవడం కోసం ట్రంప్ ప్రభుత్వం బరితెగించి సాగించిన టారిఫ్ యుద్ధంలో ఈ తర్కమే కనిపించింది. విచిత్రమేమంటే అమెరికా సామ్రాజ్యవాదం ఆధ్వర్యంలోనే ద్రవ్య పెట్టుబడి ప్రపంచాధిపత్యం మొదట నెలకొన్నది.

### అంతులేని అగాధం

ఈ శతాబ్ది ప్రారంభం నాటికి(అంటే 2000కు) ప్రపంచ విదేశీ సంస్థాగత పెట్టుబడులు(ఎఫ్ఐఐ) 400 లక్షల కోట్ల డాలర్లు వుండేవి. దాంతో పోలిస్తే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు కేవలం 65 లక్షల కోట్లు డాలర్లు మాత్రమే వుండేవి. ఒక డాలరు ప్రత్యక్ష పెట్టుబడి అనుకుంటే స్టాక్‌లు, డెరివేటివ్‌ల వంటి స్పెకులేషన్ సాధనాల్లోకి ఏడు డాలర్లు తరలించబడేవి. పావు శతాబ్దం అంటే 25 ఏళ్ల తర్వాత ద్రవ్య పెట్టుబడి తాలూకూ ఈ ఆధిపత్యం మరింత పెరిగింది. స్పష్టంగా చెప్పాలంటే ఐఎంఎఫ్ చెబుతున్న ఈ భవిష్యత్ లెక్కల చిత్రణ సమకాలీన పెట్టుబడిదారీ వ్యవస్థ వివరాలను గానీ, శ్రామిక వర్గంపై దాని వినాశకర ప్రభావాలను గానీ ఏ మాత్రం చెప్పజాలదు. భారతదేశ జనాభాలో అత్యగ్రభాగాన వున్న ఒక్క శాతం మంది 40 శాతంపైగా జాతీయ సంపదను కలిగి వున్నారు.

(మిగతా 20వ పేజీలో)

# అంకెలు ఆమోదించని అచ్ఛేదిన్



- పి.చిదంబరం

**'మోదీ** పాలనపై సామాన్యుని సణుగుడు' అంకెల్లో ఎలా ప్రతిబింబిస్తుందో చూద్దాం. నిర్దుష్టమైన, నిరూపించదగిన డేటాపై నాకు మక్కువ ఎక్కువ. యదార్థాలను నొక్కి చెప్పేందుకు అంకెలను ప్రస్తావిస్తే చాలా మంది పాఠకులు నొసలు చిట్లించుకోవడం కద్దు. విద్యావంతులు సైతం అంకెలతో కూడిన డేటాను అయిష్టపడతారు. ఒక ఆర్థిక వ్యవస్థ వాస్తవ దృశ్యాన్ని పదాలకంటే అంకెలే సత్యసమ్మతంగా స్పష్టం చేస్తాయని నేను సునిశ్చితంగా విశ్వసిస్తాను. **ప్రజల సంక్షేమమే సుపరిపాలనకు అంతిమ గీటురాయి అయినప్పుడు ఈ ప్రశ్న అనివార్యం :** 'ఒక వ్యక్తికి కూడు, గూడు, గుడ్డ, విద్య, ఆరోగ్య భద్రత, రవాణా, కుటుంబ వేడుకలు, వినోద విహారాలు ఇత్యాది నిత్యావసరాలకు సరిపడా ఆదాయమున్నదా?' (ఈ రోజుల్లో నిత్యావసరాలుగా భావిస్తున్న ఇతర వ్యయాలను నేను పరిగణనలోకి తీసుకోలేదు). ఈ వ్యయాలపై ప్రామాణికమైన సమాచారం 'గృహ వినియోగ వ్యయ సర్వే' (హెచ్‌సీఈఎస్)లో లభిస్తుంది. నా దృష్టిలో ఆదాయంకంటే వినియోగ కొలమానా (మెట్రిక్ ఆఫ్ కన్సంప్షన్)లే సగటు కుటుంబ జీవన ప్రమాణాలు, నాణ్యతను నిర్ధారిస్తాయి. చివరి హెచ్‌సీఈఎస్‌ను 2023-24లో నిర్వహించారు. దేశవ్యాప్తంగా 2,61,953 కుటుంబాల (1,54,357 గ్రామీణ, 1,07,596 పట్టణ) నుంచి ఆయా వినియోగ వ్యయాలకు సంబంధించిన వివరాలు సేకరించారు. కాకతాళీయంగా నరేంద్రమోదీ ప్రభుత్వం 2023-24లోనే పదేళ్ల పాలనను పూర్తి చేసుకున్నది. హెచ్‌సీఈఎస్ డేటా సమగ్రమైనది. సగటు నెలవారీ తలసరి వినియోగ వ్యయం (ఎమ్‌పీసీఈ) ఆ సర్వేలో కీలకమైనది. ఒక నెలలో ఒక వ్యక్తి వినియోగ వ్యయం ఎంత అనేది అతడి/ఆమె జీవన ప్రమాణాలు, నాణ్యతను వెల్లడిస్తుంది. సదరు వ్యక్తి ధనికుడా, పేదవాడా లేక మధ్య తరగతికి చెందినవాడా అనేది నిర్ధారిస్తుంది.

**ఎమ్‌పీసీఈ వెల్లడించిన వాస్తవాలను సంగ్రహిస్తాను :** ఒక వ్యక్తి చేసే వ్యయాన్ని అతడు/ఆమె ఆదాయానికి, తీసుకున్న రుణానికి ప్రాతినిధ్యంగా తీసుకోవాలి. ఈ ప్రకారం దిగువన ఉన్న పది శాతం మంది దినసరి వ్యయం రూ.50-100గా ఉన్నది. **కొన్ని ప్రశ్నలు :** రోజుకు 50 నుంచి 100 రూపాయల ఖర్చుతో సదరు వ్యక్తి ఎటువంటి ఆహారాన్ని తీసుకుంటాడు? ఎటువంటి నివాసంలో ఉంటాడు ? ఎటువంటి వైద్య సేవలు పొందగలుగుతాడు ? అవసరమైన ఔషధాలకు ఎంత సొమ్ము




భరించగలుగుతాడు ? పది శాతం జనాభా అంటే అల్పసంఖ్య కాదు. 14 కోట్ల మందికి సమానం. వారే ఒక ప్రత్యేక దేశంగా ఉంటే జనాభాపరంగా ప్రపంచంలో 10వ స్థానంలో ఉంటారు. మరి నీతి ఆయోగ్, ప్రభుత్వం మన దేశ జనాభాలో 'పేదలు' కేవలం 5 శాతం, అంతకంటే తక్కువమంది మాత్రమే ఉన్నారని ఘంటా పథంగా చెబుతున్నాయి. ఈ వాదన క్రూరమైనది, కపటమైనది. సరే, రైతులు, ఆహారానికి సంబంధించిన గణాంకాలు చూద్దాం. ఇవి చాలా నిరాశాజనకంగా ఉన్నాయి. వ్యవసాయరంగ అభివృద్ధి చాలా ఆరోగ్యదాయకంగా ఉందని ప్రభుత్వం పదే పదే చెబుతోంది. నిజమేనా ? మరి రైతన్న జీవితం ఆనందకరంగా ఉన్నదా ?

**నాబార్డ్ డేటా (2021-22) ఏమి చెబుతున్నదో చూడండి :** దాదాపు 55 శాతం వ్యవసాయ కుటుంబాలు రుణభారంతో కృంగిపోతున్నాయి. వ్యవసాయ కుటుంబాల సగటు రుణభారం రూ.91,231. ఫిబ్రవరి 3, 2025న ప్రభుత్వం ఇచ్చిన ఒక సమాధానం ప్రకారం 13.08 కోట్ల మంది రైతులు వాణిజ్య బ్యాంకులకు రూ.27,67,346 కోట్లుబీ 3.34 కోట్ల మంది రైతులు సహకార బ్యాంకులకు రూ.2,65,419 కోట్లు, 2.31 కోట్ల మంది రైతులు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు రూ.3,19,881 కోట్ల మేరకు బకాయిలు చెల్లించవలసి ఉన్నది. ప్రధానమంత్రి కిసాన్ యోజన నుంచి లబ్ధి పొందుతున్న రైతుల సంఖ్య ఒకే విధంగా ఉండడం లేదు. ఏప్రిల్-జూలై 2022లో 10.47 కోట్ల మంది లబ్ధి పొందారు. 2023 (15వ విడత చెల్లింపు)లో ఈ లబ్ధిదారుల సంఖ్య 8.1 కోట్లకు తగ్గింది. ఫిబ్రవరి 2025(19వ విడత చెల్లింపు)లో ఈ లబ్ధిదారుల సంఖ్య 9.8 కోట్లు అని ప్రభుత్వం చెప్పింది. ఈ లబ్ధిదారుల

**(మిగతా 22వ పేజీలో)**

# ఎన్నికల్లో రిగ్గింగ్ చేయడమెలా ?

\- రాహుల్‌గాంధీ

పార్లమెంటులో (3 ఫిబ్రవరి 2025న) నా ఉపన్యాసంలోను, అనంతరం విలేఖర్ల సమావేశంలోను గత ఏడాది నవంబర్‌లో మహారాష్ట్ర విధానసభ ఎన్నికలను నిర్వహించిన తీరు తెన్నుల పట్ల ఆందోళన వ్యక్తం చేశాను. మన దేశంలో ఎన్నికలు ఎప్పుడు, ఎక్కడ జరిగినా వాటి సక్రమ, నిష్పాక్షిక నిర్వహణను ప్రతిసారీ కానప్పటికీ అనేకసార్లు శంకించాను. చిన్నతరహా మోసం గురించి నేను మాట్లాడడం లేదు. మన జాతీయ సంస్థలను కైవసం చేసుకోవడంతో సహా సంభవిస్తున్న భారీ వంచనపై నా వ్యాకులతను వ్యక్తం చేస్తున్నాను.

**ఏమిటా వంచన ?**

ఎన్నికల ఫలితాలను కుతంత్రంతో అనుకూలంగా మార్చుకోవడమే ఆ మోసం. అవును, మన ఎన్నికలలో పెద్ద ఎత్తున రిగ్గింగ్ జరుగుతోంది. అంతకుముందు కొన్ని ఎన్నికల ఫలితాలు విడ్డూరంగా ఉన్నా 2024 మహారాష్ట్ర విధానసభ ఎన్నికల ఫలితాలు అసాధారణంగా ఉన్నాయి. ఆ అనూహ్య ఫలి తాలు నన్నూ, మరెందరినో దిగ్భ్రాంతి పరిచాయి. విజయంపై ఆశోపహతులయిన వారు తెంపరితనంతో భారీ రిగ్గింగ్‌కు పాల్పడి సాధించిన ఫలితాలవి. ఆ వంచనను కప్పి పుచ్చేందుకు సకల ప్రయత్నాలు చేసినప్పటికీ దాచిన వాస్తవాలు అన్నీ ఎలాంటి అనధికారిక మూలాధారాల ఆలంబనతో పనిలేకుండా అధికారిక గణాంకాల నుంచే బహిర్గతమయ్యాయి. అంచెలంచెలుగా ఆ అక్రమానికి పాల్పడేందుకు అనుసరించిన వ్యూహాలు, పద్ధతులు, ప్రక్రియలూ వెల్లడయ్యాయి. ఆ ఎన్నికల అక్రమం ఎలా మొదలై, ఎలా పరిపూర్తి అయిందో విపులంగా చూద్దాం.

**ప్రథమ పర్వం - ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించే అధికారులను నియమించే ప్యానెల్‌ను మార్చివేయడం :**

ఎన్నికల కమిషనర్లను ప్రధానమంత్రి, హోం మంత్రి 2:1 మెజారిటీతో ఫలప్రదంగా ఎంపిక చేయడాన్ని 2023 ఎన్నికల కమిషనర్ల నియామక చట్టం సుసాధ్యం చేసింది. ఆ నియమకాలపై నిర్ణయం తీసుకునే త్రిసభ్య ప్యానెల్‌లో మూడో సభ్యుడు అయిన ప్రతిపక్ష నాయకుడి సూచన ప్రతిసారీ మెజారిటీ ఓట్లతో తిరస్కృతమవుతుంది. ఎన్నికల కమిషనర్లను ఎంపిక చేసే ప్యానెల్‌లో భారత ప్రధాన న్యాయమూర్తి స్థానంలో కేంద్ర కేబినెట్ మంత్రికి స్థానం కల్పించిన నిర్ణయం న్యాయబద్ధమైనది కాదు. నైతిక సమంజసత్వం లోపించిన




నిర్ణయమది. రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల సంఘంలో తటస్థ మధ్యవర్తిని తొలగించేందుకు ఉన్నత పదవులలో ఉన్నవారు సంబంధిత నియామకాల చట్టాన్ని మార్చేందుకు పనిగట్టుకుని ఎందుకు ప్రయత్నించారు?

**ద్వితీయ పర్వం-నకిలీ ఓటర్లతో ఓటర్ల జాబితాను విస్తరించడం :**

2019 విధానసభ ఎన్నికలలో మహారాష్ట్రలో నమోదైన ఓటర్ల సంఖ్య (ఎన్నికల సంఘం డేటా ప్రకారం) 8.98 కోట్లు. ఐదు సంవత్సరాల అనంతరం 2024 లోక్‌సభ ఎన్నికలకు ఆ ఓటర్ల సంఖ్య 9.29 కోట్లకు పెరిగింది. అయితే కేవలం ఐదు నెలల తరువాత నవంబర్ 2024 విధానసభ ఎన్నికల నాటికి ఆ ఓటర్ల సంఖ్య 9.70 కోట్లకు పెరిగింది. ఐదు సంవత్సరాల పాటు అతి నెమ్మదిగా 31 లక్షలు పెరిగిన ఆ ఓటర్ల సంఖ్య కేవలం ఐదు నెలల్లో, అవును ఐదు నెలల్లోనే 41 లక్షలకు ఉరుకులు పరుగులు తీసింది! ఇదొక ఆశ్చర్యకరమైన పెరుగుదల. ఇదెంత అపురూపమైన విషయమంటే నమోదైన మొత్తం ఓటర్లు 9.70 కోట్ల మంది కాగా ప్రభుత్వ సొంత అంచనాల ప్రకారమే మహారాష్ట్రలోని మొత్తం వయోజనులు 9.54 కోట్ల మంది మాత్రమే!

**తృతీయ పర్వం-జాబితాలో పెరిగిన ఓటర్ల సంఖ్య కంటే పోలింగ్‌లో పాల్గొన్న ఓటర్ల సంఖ్య ఎక్కువ కావడం :**

ఓటుహక్కు వినియోగించుకున్న వారికి, పరిశీలకులకు

నవంబర్ 2024 మహారాష్ట్ర విధానసభ ఎన్నికల పోలింగ్ యథాప్రకారం మామూలుగానే కన్పించింది. ఎన్నికలు జరిగిన ప్రతిచోటా ఎప్పుడూ సంభవించినట్టుగానే ఆ దినం మహా రాష్ట్రలో ఎల్లెడలా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి ఓటు వేసి ఇళ్లకు వెళ్లిపోయారు. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ కేంద్రాలలోకి ప్రవేశించిన వారిని ఓటు వేసేంతవరకు అక్కడే ఉండిపోవడానికి అనుమతించారు. అయితే, ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద కొండవీడు చాంతాడులా బారులు తీరినట్లు గానీ, పెద్ద సంఖ్యలో గుమిగూడినట్లు గానీ పత్రికలు, ప్రసార సాధనాలు వెల్లడించనే లేదు. అయితే ఎన్నికల సంఘం భోగట్టా ప్రకారం ఓటు వేసేందుకు ఓటర్లు కిలోమీటర్ల పొడవునా బారులు తీరారు. సాయంత్రం 5 గంటల సమయానికి 58.22 శాతం మంది తమ ప్రజాస్వామ్య హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ వ్యవధి ముగిసిపోయినప్పటికీ ఓటు వేసేందుకు మరింత మంది పోలింగ్ కేంద్రాలకు వస్తూనే ఉన్నారు.మొత్తం ఓటర్లలో 66.05 శాతం మంది ఓటు వేశారని ఎన్నికల సంఘం ఆ మరుసటి ఉదయం వెల్లడించింది. పోలింగ్ వేళలు ముగిసిన తరువాత కూడా 7.83 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపింది. 7.83 శాతం పెరుగుదల 76 లక్షల ఓటర్లకు సమానం. మహారాష్ట్ర విధాన సభ ఎన్నికలలో అంతకు మునుపు ఎన్నడూ లేని విధంగా నవంబర్ 2024లో చాలా మంది నమోదిత ఓటర్లు పోలింగ్‌లో పాల్గొన్నారు. పోలింగ్ గడువు ముగిసే సమయానికి, ఆ తరువాత ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్ల సంఖ్య మధ్య తేడా 2009లో -0.50 శాతం, 2014లో 1.08 శాతం, 2019లో 0.54 శాతం కాగా 2024లో ఈ తేడా 7.83 శాతంగా ఉన్నది.

**చతుర్థ పర్వం-బోగస్ ఓటింగ్‌తో బీజేపీకి సంఖ్యాధిక్యత :**

ఇంకా అనేక అవకతవకలు ఉన్నాయి. మహారాష్ట్రలో లక్ష పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అయితే కేవలం 85 నియోజకవర్గాలలోని 12,000 పోలింగ్ బూత్‌లలో మాత్రమే అదనంగా పోలింగ్ జరిగింది. గత లోక్‌సభ ఎన్నికలలో ఈ 85 నియోజకవర్గాలలోనే భారతీయ జనతా పార్టీ పరిస్థితి సజావుగా లేదు. ఈ మేరకు ఈ 12 వేల పోలింగ్ బూత్‌లలో ప్రతి బూత్‌లోను సాయంత్రం 5 గంటల తరువాత సగటున 600మందికి పైగా ఓటర్లు ఓటు వేశారు. ప్రతి ఓటరు ఓటు వేసేందుకు 1 నిమిషం సమయం అవసరమవుతుందనుకుంటే పోలింగ్ విధిగా పది గంటల పాటు కొనసాగవలసి ఉంటుంది. ఇలా ఎప్పుడూ జరగలేదు గనక ఈ పరిస్థితి ఒక ప్రశ్నకు తావిస్తున్నది. అదనపు ఓట్లు వేయడం ఎలా జరిగింది? ఈ 85 సీట్లలో అత్యధిక స్థానాలను ఎన్డీఏ కూటమి గెలుచుకోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. పోలింగ్‌లో పాల్గొన్న ఓటర్ల సంఖ్య



గణనీయంగా పెరిగిందని ఎన్నికల సంఘం పేర్కొంది. యువజనులు ఎక్కువగా ఓటు హక్కు వినియోగించుకున్నందునే పోలింగ్ శాతం పెరిగిందని, ఇదొక సానుకూల పరిణామమని వ్యాఖ్యానించింది. కావచ్చు. అయితే ఈ సానుకూల పరిణామం కేవలం 12,000 పోలింగ్ కేంద్రాలకే పరిమితమయింది. మిగతా 88,000 కేంద్రాలలో ఇది సంభవించలేదు. ఈ సానుకూల పరిణామానికి ఒక నిదర్శనాధ్యయనం (కేస్ స్టడీ) కమ్ఠీ నియోజకవర్గాన్ని తీసుకుందాం.

2024 లోక్‌సభ ఎన్నికలలో ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు 1.36 లక్షల ఓట్లు రాగా బీజేపీకి 1.19 లక్షల ఓట్లు లభించాయి. 2024 విధానసభ ఎన్నికలలో కాంగ్రెస్‌కు 1.34 లక్షల ఓట్లు లభించాయి. లోక్‌సభ ఎన్నికలలో ఎన్ని ఓట్లువచ్చాయో విధానసభ ఎన్నికలలో ఇంచుమించు అదే సంఖ్యలో ఓట్లు లభించాయి. బీజేపీ సాధించిన ఓట్ల సంఖ్య 1.75 లక్షలు. లోక్‌సభ ఎన్నికలలో కంటే 56,000 ఓట్లు అధికంగా వచ్చాయి. లోక్‌సభ, విధానసభ ఎన్నికల మధ్య కాలంలో ఈ నియోజక వర్గంలో 35,000 మంది కొత్త ఓటర్లు అదనంగా నమోదయ్యారు. లోక్‌సభ ఎన్నికలలో ఓటువేయనివారు, 35 వేల మంది కొత్త ఓటర్లు అందరూ బీజేపీ పట్ల ఆకర్షితులయ్యారు. ప్రథమ పర్వం నుంచి చతుర్థ పర్వం దాకా చేపట్టిన చర్యల ఫలితంగా 2024 విధానసభ ఎన్నికలలో తాను పోటీ చేసిన 149 సీట్లలో 132ను బీజేపీ గెలుచుకున్నది విజయశాతం 89. విధానభ ఎన్నికలకు ఐదు నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ సాధించిన విజయశాతం 32 మాత్రమే.

**పంచమ పర్వం-సాక్ష్యాధారాలు రద్దు చేయడం!**

మహారాష్ట్ర విధానసభ ఎన్నికలలో అక్రమాలు జరిగినట్టు ప్రతిపక్షాలు ఘోషించాయి. న్యాయం చేయాలని కోరాయి. ఎన్నికల సంఘం మౌనం వహించింది. ఫిర్యాదు చేసిన విపక్షాల పట్ల దురుసుగా కూడా వ్యవహరించింది. 2024 లోక్‌సభ, విధానసభ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాలను ఓటర్ల ఫోటోలతో సహా అందుబాటులో ఉంచాలని అభ్యర్థించాయి. ఎన్నికల సంఘం ఈ విజ్ఞప్తులను వెన్వెంటనే త్రోసిపుచ్చింది. ఇంతకంటే ఘోరమైన విషయం మరొకటి ఉన్నది. విధానసభ ఎన్నికలు ముగిసిన నెల రోజుల అనంతరం ఒక పోలింగ్ కేంద్రంలో ఓటింగ్‌కు సంబంధించిన వీడియోలను, సీసీటీవీ

ఫుటేజీని ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని సంప్రదించిన తరువాత 1961 నాటి ఎన్నికల నిర్వహణ నియమావళిలోని సెక్షన్ 93(2) (ఎ)ను సవరించింది. ఈ సవరణతో సీసీటీవీ ఫుటేజీ, ఎలక్ట్రానిక్ రికార్డుల అందుబాటును పరిమితం చేసింది. ఇటీవల ఐడెంటికల్ / డూప్లికేట్ EPIC నంబర్లు బయటపడడంతో బోగస్ ఓటర్ల విషయమై ఆందోళన మరింత తీవ్రమయింది. ఇది, ఒక బృహత్ సమస్య సూచనప్రాయంగా వెల్లడి కావడమే. మహారాష్ట్ర విధానసభ ఎన్నికలలో రిగ్గింగ్‌కు అనుసరించిన వ్యూహాలు, పద్ధతులు, ప్రక్రియలు చాలా సంవత్సరాలుగా అమలవుతున్నా యనే అనుమానాలు పలువురిలో ఉన్నాయి. రికార్డులను పరీక్షిస్తే రిగ్గింగ్ కార్యప్రణాళిక, దానిని అమలుపరచడంలో భాగస్వాములు అయిన వారి వివరాలు తప్పక బహిర్గతమవుతాయి. అయితే ఆ రికార్డులను పరిశీలించేందుకు ప్రయత్నించిన ప్రతిపక్షాలు, చైతన్యశీలురు అయిన పౌరులను అడుగడుగునా అడ్డుకోవడం జరుగుతోంది. మహారాష్ట్ర విధానసభ ఎన్నికలలో రిగ్గింగ్ అంత భారీగా ఎందుకు జరిగిందన్నది ఊహించడం పెద్ద కష్టమేమీ కాదు. పాలక, ప్రతిపక్ష కూటముల మధ్య పోటీ తీవ్రంగా ఉన్నది. విజయం అసాధ్యమేమోనని భయపడిన వారు ఎక్కడలేని తెంపరితనంతో అక్రమాలకు పాల్పడ్డారు. అయితే ఎన్నికలలో రిగ్గింగ్ క్రికెట్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ (పోటీని తారుమారు చేయడం) లాంటిదే. ఇటువంటి అక్రమాలకు పాల్పడినవారు ప్రజాస్వామిక సంస్థలకు ఎనలేని నష్టం చేస్తున్నారు. చక్కదిద్దలేని క్లిష్ట పరిస్థితులను కల్పిస్తున్నారు. ఎన్నికల ఫలితాలలో ప్రజల నమ్మకాన్ని వమ్ము చేస్తున్నారు. ఇలా అయితే మన ప్రజాస్వామ్యం ఏమైపోను? రిగ్గింగ్‌తో ఎన్నికలలో గెలవడం ఏ ప్రజాస్వామ్య వ్యవస్థనూ దృఢతరం చేయదు. ❑

# జీడీపీ సంబరాలు - భారతీయుల వాస్తవ స్థితిగతులు

**(16వ పేజీ తరువాయి)**

అంటే 140 కోట్ల మందికి కేవలం వార్షిక తలసరి ఆదాయం సుమారు 1670 డాలర్లు మాత్రమే. 62 శాతం జాతీయ సంపదను అదుపు చేస్తున్న అగ్ర భాగంలోని అయిదు శాతం మందిని పక్కన పెడితే అప్పుడు వార్షిక ఆదాయం లక్ష రూపాయలు మాత్రమే అవుతుంది. దేశ జనాభాలో అత్యధిక భాగం ఎదుర్కొంటున్న కఠోర వాస్తవ పరిస్థితులేమిటో ఇదే చెబుతుంది.

## సాదాసీదా రంగాలకు చేటు

జీడీపీలో వివిధ రంగాల వారీ వాటాల మధ్య విపరీతమైన వ్యత్యాసాల కారణంగా ఈ అసమానతలు మరింత సంక్లిష్టమవుతున్నాయి. జీడీపీలో అధిక భాగం భారీగా పెట్టుబడులు అవసరమైన సేవల రంగం నుంచి, పెద్ద కార్పొరేట్ సంస్థలదే. మరో వైపున అసంఘటిత, యథాలాప రంగాలలోనూ వ్యవసాయంలోనూ నిమగమై వున్న శ్రామికులకు జీడీపీలో నామకార్థపు భాగమే వుంటోంది. ఫలితంగా నిరుద్యోగం పెరుగుదలకు తోడు నికరమైన ఆదాయాలు, జీవనోపాధి లోతైన సంక్షోభం ఎదుర్కొంటున్నాయి. అంతర్జాతీయంగా చూస్తే ధనాఢ్య వర్గాలు పన్ను విధానాలను, నియంత్రణా వ్యవస్థలను, ప్రభుత్వ పెట్టుబడి నిర్ణయాలను చేజిక్కించుకుని. తమకు లాభదాయకంగా వుండేలా మలుచుకుం టున్నారు. భారతదేశంలో అయితే ఈ ప్రక్రియ మరింత తీవ్రంగా నడుస్తు న్నది. ఆశ్రిత పెట్టుబడి దారీ విధానం విజృంభణకు తోడుగా కార్పొరేట్ ప్రయోజనాల ఉక్కుపట్టుతో ప్రజల ఆస్తులు, ప్రకృతి వనరులు పథకం ప్రకారం ప్రైవేటు చేతుల్లోకి బదలాయింబడుతున్నాయి. కార్పొరేట్ల లాభాలు అపారంగా పెరిగిపోతుంటే జాతీయాదాయంలో శ్రామికుల వాటా తీవ్రంగా తగ్గిపోతున్నది. మన దేశంలో పరిస్థితి ప్రత్యేకించి ప్రమాదకరంగా వుంది. సాదాసీదా (ఇన్‌ఫార్మల్) ఆర్థిక వ్యవస్థను నోట్ల రద్దు పెద్ద దెబ్బ కొట్టింది. కోవిడ్-19 తర్వాత ఈ పరిస్థితి ఇంకా దిగజారింది. ఇలాంటి వాతావరణంలో అదనపు ఉద్యోగాల కల్పనకు గానీ, స్థిరమైన ఆదాయాల కల్పనకు గానీ అవకాశం లేదు. జీడీపీ నామకార్థంగా పెరుగుదలలోనైనా జాతీయ సంపదలో భాగస్వామ్యం లేదు. పేద శ్రామికులు, నిరుద్యోగులే గాక మధ్య తరగతి వర్గీయులు కూడా మరింతగా దెబ్బ తింటున్నారు, వారు వెనకబడిపోవడమే కాదు, ఇంకా కిందకు దిగజారే ముప్పు కనిపిస్తున్నది.

## ప్రజావసరాల నిర్లక్ష్యం

సంపద పున:పంపిణీ విధానాలు మృగ్యం అయినప్పుడు సంపన్న వర్గాలు ప్రజా సేవల రంగాన్ని వదలిపెట్టి కేవలం ప్రత్యేకమైన ప్రైవేటు స్కూళ్లు, కార్పొరేట్ ఆస్పత్రులు, గేటెడ్ కమ్యూనిటీలను ఎంచుకోగలవు. దాంతో ప్రజాసేవల వ్యవస్థలపై పెట్టుబడులు పెట్టాలనే రాజకీయ సంకల్పం మరింత సన్నగిల్లిపోతుంది. కనీస పౌష్టికాహారం, గృహ వసతి, ఆరోగ్య రక్షణ కోసం తంటాలు పడే 80 కోట్ల మంది భారతీయులకు జిడిపి ర్యాంకులు ఏ మాత్రం అక్కరకు వచ్చేవి కావు. కార్పొరేట్ మతతత్వ కూటమి విజృంభణ కేవలం యాదృచ్ఛికంగా జరిగిందేమీ కాదు. అది ప్రజలను అస్తితత్వాల ప్రాతిపదికన విభజించి పాలనా వ్యవస్థ ప్రాబల్యం కొనసాగేలా చేస్తుంది. ఈ నేపథ్యంలో ప్రజలు ఉమ్మడిగా కలసికట్టుగా పోరాటాలు చేయడమే ముందుకు తీసుకు వెళ్లగల సరైన మార్గమవుతుంది. ❑

# కులగణన ఎలా జరగాలి

- టి.చిరంజీవులు

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కులగణన నిర్ణయం వెనుకబడిన కులాలకు సామాజిక న్యాయాన్ని అందించడంలో ఒక నూతన అధ్యాయాన్ని సృష్టించనుంది. 2011లో జనగణనలో కులగణన చేస్తామని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా ప్రకటించి, మరుసటి రోజే మళ్లీ అలా చేయబోమని, ప్రత్యేకించి సామాజిక, ఆర్థిక, కులగణన చేస్తామనీ చెప్పి, ఆ సోషల్ ఎకానమిక్ క్యాస్ట్ సెన్సెస్ రిపోర్టు కూడా బయటపెట్టలేదు. తర్వాత ఆ సెన్సెస్‌లో తప్పులున్నాయని చేతులు దులుపుకుని, రిపోర్ట్‌ను బుట్టదాఖలు చేసింది. అలా ఐదు వేల కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయ్యింది. ఈ సారైనా కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణనను చిత్తశుద్ధితో చేయాలి. గత అనుభవాల దృష్ట్యా కులగణనను పారదర్శకంగా, నిజాయితీతో జరపాలి. ఈ దిశగా పలు పద్ధతులను పాటించాల్సిన అవసరం ఉంది.

- 1).కులగణన సెన్సెస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలోనే జరగాలి. గతంలో కాంగ్రెస్ సోషియో, ఎకానమిక్ కులగణన చేసినప్పుడు గ్రామీణ ప్రాంతంలో రూరల్ డెవలప్‌మెంట్ శాఖ, పట్టణ ప్రాంతంలో అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ వారు చేపట్టారు. వీరికి ఆ వృత్తి నైపుణ్యం లేక ఆ సెన్సెస్ తప్పుల తడకగా మారింది. సెన్సెస్ డిపార్ట్‌మెంట్‌లో శిక్షణ పొందిన అధికారుల ద్వారా జరిగితేనే ఈ ప్రక్రియకు ఒక విశ్వసనీయత ఏర్పడుతుంది.
- 2).కులగణన జనగణనలో అంతర్భాగం కావాలి. దీని కోసం సెపరేట్ ఫారం ఉండకూడదు. ఉంటే కొత్త సమస్యలు పుట్టుకొస్తాయి.
- 3).ఈ సెన్సెస్‌లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల లెక్కలు మాత్రమే గాక, అన్ని కులాల లెక్కలు తీయాలి. ముస్లింలలో, క్రిస్టియన్స్‌లో ఉన్న కులాల లెక్కలు కూడా గణించాలి.
- 4).ప్రతి కులానికి ఒక కోడ్ నంబర్ ఇవ్వాలి. లేదంటే అనేక కులాలు పుట్టుకు వచ్చి డాటా స్వచ్ఛత దెబ్బ తింటుంది. ఉదాహరణకు ఒకే కులాన్ని ఒకే రాష్ట్రంలో ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కో పేరుతో పిలుస్తారు. ఉదాహరణకు చాకలి వారిని కొన్ని ప్రాంతాల్లో రజక అంటారు. కొన్ని ప్రాంతాల్లో ధోబి అంటారు. వీరందరినీ ఒకే కోడ్ నంబర్‌లోకి తీసుకొచ్చినట్టయితే కులాల లెక్కలు సరిగ్గా వస్తాయి. ఓసీ కులాలకు కోడ్ నంబర్ ఇవ్వాలి. రాష్ట్రాల వారీ కులాల లిస్టులను తయారు చేసి వాటికి కోడ్ నెంబర్ ఇచ్చి పేపర్ ప్రకటనలు ఇవ్వాలి. ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించిన తర్వాత తుది లిస్టును ప్రకటించాలి. ముస్లిం, క్రిస్టియన్ మతాలలోని కులాల క్రోడీకరణ జరగాలి.
- 5). ప్రస్తుతమున్న సెన్సెస్ ఫారంలో కాలం నెంబర్ 8లో కులాల వివరాలు తెలియపరచవలసి ఉంటుంది. కాలం నెంబర్ 8లో ఎస్సీ అయితే ఎస్సీ అని టిక్ చేసి కింద 8Aలో ఏ కులమో తెలియచేయాలి.

  ఎస్టీ అయితే ఎస్టీ అని టిక్ చేసి క్రింద 8Bలో తెగ వివరాలు చెప్పాలి. ఇక్కడ బీసీ లేదా ఓబీసీ అనే కాలమ్ సృష్టించాలి. దాని కింద బీసీ, ఓబీసీ అనే కాలమ్స్ ఉండాలి. ఎందుకంటే, ఉదాహరణకు తెలంగాణలో 134 కులాలు బీసీ లిస్టులో ఉన్నాయి. కాని, కేంద్ర ఓబీసీ లిస్టులో 86 కులాలు మాత్రమే ఉన్నాయి. మరి అక్కడ వ్యక్తి ఏ విధంగా సమాధానం ఇవ్వాలి అన్న ప్రశ్న ఉద్భవిస్తుంది. రాజ్యాంగ రీత్యా ఆర్టికల్ 342A1 ప్రకారం కేంద్రం తన స్వంత ఓబీసీ లిస్ట్‌ను కలిగి ఉండవచ్చును.

రాష్ట్రాలు ఆర్టికల్ 342A3 ప్రకారం తమ స్వంత లిస్ట్ కలిగి వుండవచ్చు. అందువలన ఈ రెండు కాలమ్స్ ఉండటం శ్రేయస్కరం. మొదట ఈ లిస్టులు పత్రికలలో ప్రకటించాలి. ఓసీ కాలమ్ సృష్టించాలి. అక్కడ కింద కులాల లిస్ట్ కోడ్ నంబర్లతో ఉండాలి. ముస్లిం, క్రిస్టియన్ ఇతర మతాలకు కాలమ్స్ సృష్టించాలి. వారి కులాలను క్రోడీకరించి కోడ్ నంబర్స్ ఇవ్వాలి.

- 6).ప్రస్తుత సెన్సెస్ ఫార్మేట్‌లో 29 కాలమ్స్ మాత్రమే ఉన్నాయి. ఇందులో ఆర్థికపరమైన డాటా పెద్దగా సేకరించడం లేదు. కేవలం కుల డాటా సేకరించి భూమి, ఆర్థిక వివరాల డాటా సేకరించకపోతే బీసీల సామాజిక, ఆర్థిక వెనుకబాటు తనం తేటతెల్లం కాదు. కాబట్టి సెన్సెస్ కాలమ్స్ కొన్ని పెంచాలి. ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, ఓటర్ ఐడి కార్డ్స్ సమాచారాన్ని సేకరించాలి.
- 7).ఈ సెన్సెస్‌ను జాతీయ జనాభా రిజిస్టర్‌కు లింక్ చేయకుండా ఉంటే మంచిది. లేనట్టయితే అనవసర

రాజకీయాలకు దారి తీసి డాటా సమగ్రత దెబ్బతినే అవకాశం ఉంది.

- 8).సెన్సెస్‌లో డాటా సేకరణ డిజిటల్ గాను, మాన్యువల్ గాను కూడా జరగాలి. కొండ ప్రాంతాలలో సెల్‌ఫోన్ సిగ్నల్స్ తక్కువ కాబట్టి మాన్యువల్ సెన్సెస్ ఉపయుక్తం.
- 9).సేకరించిన సమాచారం గోప్యంగా ఉంచాలి. అది వ్యక్తి ప్రైవసీకి భంగం కలగకుండా భద్రపరచాలి.
- 10).సెన్సెస్ ఆఫ్ ఇండియా ఆక్ట్ 1948 ద్వారా సెన్సెస్ జరుగుతుంది. ఇప్పుడు అన్ని మతాలలోని కులాల జనగణన జరుగుతుంది కాబట్టి ఆ సెన్సెస్ చట్టాన్ని కూడా అవసరమైన మేరకు సవరించాలి. ఒక స్వతంత్ర సెన్సెస్ కమిషన్ వేసి ప్రజాభిప్రాయం ద్వారా ఫార్మేట్స్‌ను రూపొందించి చట్టంలో కావాల్సిన మార్పులు చేర్పులు చేసి ఈ కులగణనను చేయాలి.
- 11).భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం చేపట్టే అన్ని సర్వేలలో కూడా ఓబీసీ కాలమ్స్ చేర్చి వివరాలు సేకరించాలి.
- 12).కేంద్ర ప్రభుత్వం కులగణన షెడ్యూల్‌కు ఎంతో ముందు నుంచే తగు ప్రచారాన్ని కల్పించాలి, ప్రజలను సమాయత్త పరచాలి. కులం అనేది భారతదేశంలో ఒక వాస్తవికత. కులం ఎక్కడ ఉందో అక్కడ వివక్ష ఉంటుంది. అందుకే ఈ కులగణన ఒక రోగ నిర్ధారణ పరికరం. రోగం సరిగా తేలితే అప్పుడు చికిత్స సులభం. కాబట్టి ఈ ప్రక్రియ మొత్తం పారదర్శక విధానాలతో జరగాలి. భారతదేశం అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినా, మానవ అభివృద్ధి సూచీలో 130వ ర్యాంకులోనే మిగిలిపోయింది. ఈ కుల గణన ద్వారా సామాజిక, ఆర్థిక, అవసరమైతే రాజకీయ అంశాలను లెక్కించి రాబోయే కాలంలో తగు విధాన నిర్ణయాలు, ప్రణాళికలు రచించి మానవాభివృద్ధి సూచి కలలో, ముఖ్యంగా విద్యా ఆరోగ్యాలలో మన స్థానాన్ని మెరుగు పరుచుకోవచ్చు. ❑

# అంకెలు ఆమోదించని అచ్ఛేదిన్

(17వ పేజీ తరువాయి)

సంఖ్యలో హెచ్చుతగ్గులకు కారణమేమిటో ప్రభుత్వం చెప్పలేదు. కౌలుదారులు అయిన రైతులు ఈ పథకం నుంచి ఎలాంటి లబ్ధి పొందడం లేదు. కౌలు రైతులను ఉపేక్షించడం సమర్థనీయమేనా? యూపీఏ ప్రభుత్వ పంట బీమా పథకాన్ని మెరుగుపరిచి పునఃప్రవేశపెట్టింది. ప్రైవేట్ బీమా సంస్థలను అనుమతించింది. లాభాలు ఆశించకుండా, నష్టాలు వాటిల్లకుండా (నో ప్రాఫిట్, నో లాస్) ఉండేలా పంట బీమా పథకాలను రూపొందించి అమలు పరచాలని బీమా కంపెనీలను యూపీఏ ప్రభుత్వం ఆదేశించింది. మరి ఎన్డీఏ ప్రభుత్వం అమలుపరిచిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఒక దోపిడీ పథకంగా పరిణమించింది. రైతుల క్లెయిమ్‌లకు చెల్లించిన మొత్తం రైతుల నుంచి సేకరించిన మొత్తం ప్రీమియంల సొమ్ములో 2019-20లో 87 శాతం నుంచి 2023-24లో 56 శాతానికి తగ్గిపోయింది!

గ్రామీణ శ్రామిక జనుల సామాజిక భద్రతకు ఆలంబనగా ఉన్న గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మూడు సంవత్సరాలుగా నిధుల కేటాయింపులు ఎదుగు బొదుగు లేకుండా నిలిచి పోయాయి. కోట్లాది మందిని ఈ పథకం పరిధి నుంచి తొలగించారు ఈ పథకం కింద ఏడాదికి సగటున 100 పని దినాలు కల్పించవలసి ఉండగా వాటి సంఖ్య 51కి తగ్గిపోయింది. ఈ సామాజిక భద్రతా పథకం నిధుల కొరతతో నీరుకారిపోతోంది. ప్రస్తుత ప్రభుత్వం ఒక్కొక్కరికి 5 కిలోలు చొప్పున, 80 కోట్ల మందికి ఉచితంగా ఆహార ధాన్యాలు సరఫరా చేస్తోంది. ఈ ఉదారతకు అర్హులైన పౌరులు ఇంకా పది కోట్ల మంది ఉన్నారు. ఉచిత రేషన్లు, మధ్యాహ్న భోజన పథకం అమల్లో ఉన్నప్పటికీ కోట్లాది మంది బాలలకు పోషకాహారం లభించడం లేదు. దేశంలోని మొత్తం బాలల్లో 35.5 శాతం మంది ఎదుగుదల లోపంతో బాధపడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సూచీ పరిగణనలోకి తీసుకున్న 127 దేశాలలో భారత్ 105వ స్థానంలో ఉన్నది! దేశ ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి అవుతున్న వస్తువుల, సేవల మొత్తం విలువలో తయారీరంగం వాటా 2011-12లో 17.4 శాతం నుంచి 2024-25లో 13.9 శాతానికి తగ్గిపోయింది. ఉత్పత్తితో ముడిపెట్టి ప్రోత్సాహ కాలు అందిస్తున్న పథకం సత్ఫలితాలను సాధించడంలో ఘోరంగా విఫలమైంది. 14 రంగాలకు రూ.1,96,409 కోట్లు కేటాయించినా కేవలం రూ.14,020 కోట్లు మాత్రమే పంపిణీ చేశారు.

భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అని ప్రశంసలు పొందుతున్నా అది ఆరోగ్యదాయకంగా ఉందని భావించడం సరికాదు. పేదరికాన్ని నిర్మూలించి అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను సుస్థిరంగా నిలపగలదనే విశ్వాసాన్నీ కల్పించలేదు. ప్రతి పదేళ్లకు మరింత విస్తృత నిర్మాణాత్మక సంస్కరణలు (ఆర్థిక వ్యవస్థ పనిచేసే విధానంలో ప్రాథమిక మార్పులు సాధించడం), అధికారాల వికేంద్రీకరణ, పోటీ తత్వాన్ని పెంపొందించడం, లక్ష్యాల పరిపూర్తికి ప్రభుత్వం 'అంతర్గత అడ్డంకులను అధిగమించడం' సంపద్వంత, సంక్షేమ భారత్ ఆవిర్భావానికి అత్యంత అవసరం.

# పౌరసత్వం నిరూపించుకోవాలని కోరటం బీహారీల ఆత్మగౌరవాన్ని ప్రశ్నించడమే..!

న్యూఢిల్లీ : కేంద్ర ఎన్నికల సంఘం త్వరలో ఎన్నికలు జరగబోతున్న బీహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణకు హడావుడిగా నిర్ణయం తీసుకుంది. దీని మీద ప్రతిపక్షాలు, తాము లేవనెత్తిన అభ్యంతరాలను ఎన్నికల సంఘం వినిపించుకోవటం లేదంటూ ఇండియా కూటమీ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడు తేజస్వీ యాదవ్ శుక్రవారం(జూలై 4) ఈ కసరత్తు బీహారీల అస్తిత్వాన్ని-ఆత్మగౌరవాన్ని ప్రశ్నించటమేనని ధ్వజమెత్తారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలలో ఇండియా కూటమి తరఫున తేజస్వీ యాదవ్ ముఖ్యమంత్రిత్వ అభ్యర్థిగా బరిలోకి దిగనున్నారు. తమ పౌరసత్వం నిరుపించుకోవాలంటూ బీహార్ ప్రజలను ఎన్నికల సంఘం కోరటం వారి అస్తిత్వాన్ని ప్రశ్నించటం తప్ప మరొకటి కాదని తేజస్వీ అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న ఈ నిర్ణయం బీహార్ ప్రజల మనోభావాలను దారుణంగా గాయపరిచిందని ఆయన పేర్కొన్నారు. "మొత్తం దేశంలో పౌరసత్వాన్ని నిరూపించుకోవాల్సింది కేవలం బీహార్ ప్రజలేనా? కేవలం బీహార్, బీహార్ ప్రజలు మాత్రమే పౌరసత్వాన్ని ఎందుకు నిరూపించుకోవాలి?" అంటూ తేజస్వీ యాదవ్ ఎన్నికల సంఘాన్ని నిలదీశారు.

## ప్రస్తుత ఓటర్ల జాబితా "ఫేక్" జాబితాయేనా?

"మీరు హిందువా, ముస్లిమా, క్రైస్తవులా లేక వెనుకబడిన కులాలకు చెందిన వారా? దళితులా? అగ్రకులాలకు చెందిన వారా? బాగా వెనుకబడిన కులాలకు చెందిన వారా అనే తేడా లేదు. ప్రతి బీహార్ పౌరుడు తన పౌరసత్వాన్ని నిరూపించుకోవాల్సిందే" అంటూ ఎన్నికల సంఘం ఆదేశాలనుద్దేశించి తేజస్వీ యాదవ్ అన్నారు. బీహార్‌లో ఓటర్ల జాబితా సవరించాలన్న కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం బీహారీల ఆత్మగౌరవం సమస్యగా మార్చడం ద్వారా రానున్న అసెంబ్లీ ఎన్నికలలో కీలకమైన రాజకీయ చర్చకు మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ తెరతీస్తున్నారు. ప్రస్తుతం చలామణిలో ఉన్న ఓటర్ల జాబితా నిజమైనదా కాదా ఎన్నికల సంఘం స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ముందు ఈ విషయాన్ని స్పష్టం చేసిన తర్వాతనే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్డ్ ప్రకటించాలని పట్టుబట్టారు. తాజా ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం విశ్వసించకపోతే 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలను కూడా రద్దు చేయాలని తేజస్వీ యాదవ్ డిమాండ్



చేశారు. రాష్ట్రంలోని పేదలతోపాటు పొట్ట చేత పట్టుకొని ఉద్యోగం కోసం వలసలు వెళ్లిన నాలుగున్నర కోట్ల మంది ఓటర్ల ఓటు హక్కు భవిష్యత్తు ఎన్నికల సంఘం తాజా నిర్ణయంతో ప్రశ్నార్థకం అవుతోందని తేజస్వీ అన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికల సంఘం కోరిన పత్రాలు అన్ని సమకూర్చుకోవాలంటే పెద్ద ఎత్తున అధికారులకు లంచాలు సమర్పించుకోవాల్సి వస్తుందని తేజస్వీ ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఓటరు జాబితా సంపూర్ణ సవరణ చేపట్టడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు.

"రాజ్యాంగాన్ని భూస్థాపితం చేయాలనుకునే శక్తులు, ప్రజల ఓటు హక్కులు రద్దు చేయాలనే పార్టీలు, ప్రజాస్వామ్యాన్ని సమాధి చేయాలనే సిద్ధాంతాలను ప్రచారం చేస్తున్న వారికి తగిన బుద్ధి చెప్పాలంటే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి సభ్యులను గెలిపించాలి" అని తేజస్వీ యాదవ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 2025 జూలై 3(బుధవారం) తేదీన 20 మంది సభ్యులు కలిగిన ఇండియా కూటమి బృందం ప్రధాన ఎన్నికల కమిషనర్ గ్యానేశ్ కుమార్‌తో సహా ఎన్నికల కమిషనర్‌లను కలిసి కేంద్ర ఎన్నికల సంఘం తాజా ఆదేశాల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాల నాయకత్వంలో ఎన్నికల సంఘాన్ని కలిసిన ప్రతినిధి బృందం ఇంత స్వల్ప వ్యవధిలో అంతటి బృహత్ కర్తవ్యాన్ని నెరవేర్చడమంటే, దాదాపు కోటి మందికి పైగా ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం తలెత్తుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఎన్నికల సంఘాన్ని కలిసిన తర్వాత విలేకర్లతో మాట్లాడుతూ ఇండియా కూటమి బృందం తమ అభ్యంతరాలు, ఆందోళనలను

(మిగతా 25వ పేజీలో)

# గాంధీ నమ్మకాన్ని నిలబెట్టుకున్నామా

- మూల రచన : జీన్ షార్ప్, తెలుగు అనువాదం: మురళి కర్ణం

ఆయుధాల మీద, సైన్యం మీద ఆధారపడని స్వేచ్ఛాయుత భారతదేశం ఆవిష్కృతం అవుతుందని గాంధీ కలలు కన్నారు. కానీ, స్వాతంత్ర్యానంతర భారతదేశం తన కలను నెరవేర్చదనే అనుమానం కూడా ఆయనకు ఉండేది. 1920లో గాంధీ ఇలా అన్నారు: "ప్రపంచం పట్ల భారతదేశానికి ఒక కర్తవ్యం ఉంది. ఈ దేశం యూరప్‌కు ఒక గుడ్డి నకలు కాదు. భారతదేశం ఆయుధవాదాన్ని అంగీకరించిన రోజు నాకు పరీక్షా కాలం. ఆ రోజును ఎదుర్కోగలనని నమ్ముతున్నాను". ఆ తర్వాత తొమ్మిదేళ్లకు 'యంగ్ ఇండియా' పత్రికలో ఇలా రాసారు : "భారతదేశం అహింసామార్గంలో నిలబడితే, ఎప్పటికీ ఒక గొప్ప సైనిక శక్తి కావాలని కోరుకోదు. తన ఆత్మచైతన్యం స్వేచ్ఛా స్థాయికి ఎదిగితే, ప్రపంచం విలువలు మారుతాయి, యుద్ధ సామగ్రి అంతా నిరుపయోగమౌతుంది. కానీ అదంతా నా పగటి కల. కానీ అహింసా మార్గంలో దేశం స్వేచ్ఛ సాధిస్తే అలాంటిది సాధ్యమే అనిపిస్తుంది".

ఏళ్లు గడుస్తున్న కొద్దీ, రాజకీయ స్వాతంత్ర్యం దగ్గరవుతున్న కొద్దీ, కాంగ్రెస్ కానీ, ప్రజలు కానీ, రాజకీయ స్వాతంత్ర్యం తర్వాత కూడా అహింసా సూత్రాన్ని నిబద్ధతతో అంగీకరించరన్న విషయం గాంధీకి అర్థమవుతూ వచ్చింది. భారతదేశానికి వెంటనే స్వేచ్ఛ ఇచ్చే షరతు మీద రెండవ ప్రపంచ యుద్ధంలో బ్రిటన్‌కు పూర్తి సహకారాన్ని కాంగ్రెస్ ప్రకటించినప్పుడు గాంధీ ఇలా అన్నారు : "నా మరణం ముందే నేను చావకూడదు. భారతదేశాన్ని సైనికచర్యకు నేను సంసిద్ధం చేయలేను. కాంగ్రెస్ శక్తివంతమైన సంస్థ అనే విషయంలో సందేహం లేదు. కానీ కాంగ్రెస్ అంటే మొత్తం భారతదేశం కాదు. కాంగ్రెస్‌కు సైన్యం లేకపోవచ్చు, కానీ అహింస అంటే నమ్మకం లేని వారికీ సైన్యం ఉండవచ్చు. కాంగ్రెస్ కూడా లొంగిపోతే, నిస్సైనిక మనస్తత్వానికి ప్రాతినిధ్యం వహించే వాళ్ళు ఉండరు. ఇది సంక్షిప్తంగా నా వాదన. కానీ కాంగ్రెసును ఒప్పించడంలో విఫలమయ్యాను".

1940 ఆగస్టులో గాంధీ ఇలా రాశారు: "సైనిక సంసిద్ధత గురించి మాట్లాడేటప్పుడు మనం బలమైన హింస ద్వారా ఇతరుల హింసను ఎదుర్కోవడం గురించి ఆలోచిస్తున్నాం. అలాంటి స్థితికి ఎన్నడైనా సిద్ధమైతే, భారతదేశం ప్రపంచ శాంతికి పెనుముప్పుగా మారుతుంది. మనం ఆ దారిని ఎంచుకున్నట్టయితే యూరోపియన్ దేశాలు ఎంచుకున్న దోపిడీ మార్గాన్ని మనం కూడా ఎంచుకోవాల్సి వస్తుంది".



సెప్టెంబర్ 2, 1946న ఏర్పడిన ప్రభుత్వంతో, నెహ్రూ ప్రధానమంత్రిగా, భారతీయుల చేతుల్లోకి దేశం వచ్చింది. కానీ సైనిక బడ్జెట్‌ను నిషేధించడం కానీ, తగ్గించడం కానీ జరగలేదు. అధికారికంగా స్వతంత్రం రాకముందు, సంధి దశలో, సైన్యం బలం పెరిగింది. రాబోయే కాలానికి సంకేతాలు కావచ్చు. గాంధీ తన ప్రజలు సైనిక మార్గం నుండి ప్రేమ మార్గం ఎంచుకోవాలని అనుకున్నాడు. వాళ్ళు ఎంచుకోకపోతే "అది దేశానికీ, ప్రపంచానికి మంచిది కాదు. దాని అర్థం స్వేచ్ఛకు వీడ్కోలు పలకడమే. అది సైనిక నియంతృత్వం కూడా కావచ్చు". సైనిక నియంతృత్వంలో స్వేచ్ఛ లేదు. తెల్ల సైనిక పాలన స్థానంలో గోధుమ రంగు సైనిక పాలన కావాలని గొడవ చెయ్యడంలో అర్థమే లేదని స్వాతంత్ర్యానికి రెండు దశాబ్దాల ముందు గాంధీ ప్రకటించారు. ఎందుకంటే రెండవ దానిలో కూడా ప్రజలు అదే విధమైన, లేక ఇంకా అన్యాయమైన దోపిడీకి గురవుతారు.

రాజకీయ స్వాతంత్రం సాధించిన దేశంలో పెరుగుతున్న సైనిక ఖర్చును గాంధీ సమర్థించలేకపోయారు. తన దేశ ప్రజలకు సైనికీకరణ అక్కరలేదని ప్రకటించారు. ఆ ప్రకటనకు గాంధీ కట్టుబడ్డాడు కానీ ఇతరులు కట్టుబడలేదు. బలమైన సైన్యం అనే ఆలోచనను తన ప్రజలు వదులుకుంటారని ఆయన ఆశించారు. ఆ మార్గం ఎక్కడికీ దారి తీయదు. అందులో స్వేచ్ఛకు ఏమీ విలువ ఉండదు. 1947 సెప్టెంబర్‌లో ఒక శాస్త్రవేత్త గాంధీని ఒక ప్రశ్న అడిగాడు : యుద్ధ అవసరాల కోసం, ఆటంబాంబు కోసం భారత ప్రభుత్వం పరిశోధన చేయమంటే శాస్త్రవేత్తలు ఏం చేయాలి ? "అలాంటి రాజ్యాన్ని పేరున్న ప్రతి శాస్త్రవేత్త మరణం

వరకు ప్రతిఘటించాలి" అని గాంధీ తడుముకోకుండా జవాబు ఇచ్చారు.

అంతకు మునుపు జూలైలో గాంధీ మాట్లాడుతూ, భారతదేశం తన స్వార్థ విధానం ద్వారా ప్రపంచశాంతికి ముప్పుగా మారడం, తప్పుగా ప్రజాస్వామ్యంగా చలామణి అవుతున్న ఇంకొక జపాన్, జర్మనీ లాగా మారడం తాను చూడలేనని అన్నారు. "కాంగ్రెస్ అహింసా విధానానికి కట్టుబడినట్లైతే, అది సైనికత్వానికి మద్దతు తెలపదు. ప్రజలు నా మాట వినకుండా, సైనికీకరణకు మద్దతు తెలిపితే, అది పౌర సమాజాన్ని మింగేసి, సైనిక పాలనను కొనసాగించే అవకాశం ఉంది. ఆయుధాలు లేకుండా స్వేచ్ఛ సాధించిన జాతి, ఆయుధాలు లేకుండా స్వేచ్ఛను కాపాడుకోగలదు అని నమ్మాలి".

రాజకీయ స్వేచ్ఛ వచ్చింది, కానీ సైన్యం అలాగే ఉండిపోయింది. గాంధీకి దగ్గరగా తిరిగిన వాళ్ళుకూడా సైనిక కార్యక్రమాలకు మద్దతు తెలిపారు. "బ్రిటిష్ పాలనలో ఆయుధీకరణకు పెద్ద ఎత్తున పెడుతున్న ఖర్చుకు వ్యతిరేకంగా మన రాజనీతిజ్ఞులు రెండు దశాబ్దాలు నిరసన తెలిపారు. రాజకీయ బానిసత్వం నుండి స్వాతంత్ర్యం రాగానే, మన సైనిక ఖర్చు పెరిగింది, ఇంకా పెరిగే ప్రమాదం ఉంది, కానీ దీని గురించే మనం గర్విస్తున్నాం! దీనికి వ్యతిరేకంగా పెగిలే గొంతులు మన శాసనసభలలో వినిపించవు. అయినా, ఇది ఎంత పిచ్చి అయినా, పాశ్చాత్య అనుకరణ అయినప్పటికీ, 1915 నుండి నిరంతరంగా 32 ఏళ్లపాటు, ఎంత అసమగ్రమైనా కానీ, అహింసా శిక్షణలో రాటు దేలిన భారతదేశం ఈ కరాళ నృత్యం నుండి బయటపడుతుందనే విశ్వాసం నాలో మెదులుతూనే ఉంటుంది". గాంధీ పట్ల విశ్వాసంతో భారతదేశం ఆయనను అనుసరించలేదు. పరిస్థితులు మారినప్పుడు, అహింసా నిరసనను, ప్రేమ మార్గాన్ని సులభంగా వదులుకుంది. ఆ వదులుకోవడంలో భారతదేశం తన ఆత్మను, స్వేచ్ఛను అల్పమైన వాటికోసం వదలుకోవడం గాంధీ చూసాడు.

**(1961లో నవజీవన్ ట్రస్ట్ ప్రచురించిన 'గాంధీ ఫేసెస్ ది స్టార్మ్' పుస్తకంలోని 'మిలిటరీ రూల్ ఫర్ ఇండియా' అధ్యాయానికి అనువాదం ఇది)**

# పౌరసత్వం నిరూపించుకోవాలని కోరటం బీహారీల ఆత్మగౌరవాన్ని..

**(23వ పేజీ తరువాయి)**

ఎన్నికల సంఘం పెడచెవిన పెడుతోందని ఆరోపించింది. ఎన్నికల సంఘం స్పందన నిరాశాజనకంగా ఉందని, వైరిభావంతో కూడుకున్నదని ధ్వజమెత్తారు.

గతంలో జనన ధృవీకరణ పత్రాల లభ్యత, గణనీయమైన వలసలు వంటి సమస్యలను పరిష్కరించకుండా ఓటర్ల జాబితాను సంపూర్ణంగా సవరించబూనుకోవడమంటే రాష్ట్రంలో చారిత్రక సంక్షోభానికి పునాదులు వేయటమేనని ఇండియా కూటమి ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఎనిమిది కోట్ల మందికి సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం అడిగినన్ని పత్రాలు సిద్ధం చేసి ఓటర్లకు అందించడానికంటే ముందు జరిగే ఏ రకమైన ఓటరు జాబితా సవరణలైనా అసెంబ్లీ ఎన్నికల ముందు ఓటర్లను తీవ్ర గందరగోళానికి గురి చేస్తాయని హెచ్చరించారు. కేంద్ర ఎన్నికల సంఘం మాటల్లో రాష్ట్రంలో తిష్ట వేసిన అక్రమ శరణార్థులను, శాశ్వతంగా రాష్ట్రం వదిలి వెళ్లిన వారిని గుర్తించేందుకు తాజా కసరత్తు దోహదం చేస్తుంది. ఎన్నికల సంఘం సిబ్బంది తనిఖీ కోసం వచ్చినప్పుడు ఓటర్లు కేవలం ఓటరు గుర్తింపు కార్డు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు చూపిస్తే సరిపోదని జనన ధృవీకరణ పత్రం, తల్లిదండ్రులకు సంబంధించిన పలు ధృవీకరణ పత్రాలు, మెట్రిక్యులేషన్ సర్టిఫికేట్, భూ సంబంధిత పట్టాలు ఇతర ఆస్తి పత్రాలు చూపించాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం ప్రకటనలో స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, పరిమితమైన అక్షరాస్యత ఉన్నత పాఠశాల గడప కూడా తొక్కని గణనీయమైన జనాభా, భూమి లేని పేదలు భారీ స్థాయిలో ఉన్న బీహార్‌లాంటి రాష్ట్రంలో చేపట్టిన ఇటువంటి కసరత్తు ఓటర్ల జాబితాలోని లోపాలను సవరించడానికి బదులు అనేక రకాలైన సమస్యలకు దారి తీస్తాయని క్షేత్రస్థాయి పరిశీలనలు రుజువు చేస్తున్నాయి.

ఓటర్ల జాబితా సమగ్ర సవరణపై ఇండియా కూటమి తీసుకుంటున్న వైఖరి రానున్న అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేయనున్నదని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ప్రతిపక్షం అమ్ములపొదిలో ఈ వివాదాస్పద అంశం కీలకమైన ఆయుధంకానున్నది. ప్రతిపక్షం లేవనెత్తే ప్రశ్నలకు పాలక ఎన్డీయే కూటమి, దాని భాగస్వాములైన జేడియూ, లోక్‌జనశక్తి పార్టీ, హిందుస్తానీ అవామ్ మోర్చా ఎలా స్పందిస్తాయో వేచిచూడాలి. ఓటర్ల జాబితా సవరణ తమ ఓటు బ్యాంకును ప్రభావితం చేసే అవకాశాలున్నప్పటికీ, బీజేపీతో సహా ఎన్డీయే కూటమి భాగస్వామి పక్షాలు ఈ అంశంపై ఇప్పటి వరకు పెదవి విప్పకపోవడం గమనించాల్సిన విషయం. అయితే, రాష్ట్రంలో ఎన్డీయే భాగస్వామిగా ఉన్న రాష్ట్రీయ లోక్ మోర్చా నేత ఉపేంద్ర కుష్వావా ఓటర్ల జాబితా సవరణ నిర్ణయం పట్ల అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియలో అర్హులైన ఓటర్లు ఎవరిపైనా అనర్హత వేటు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల సంఘంపైనే ఉందని ఆయన అన్నారు. (ది వైర్)


# భారతీయ వైజ్ఞానిక పరిశోధనాశాలల పితామహుడు



- డాక్టర్ దేవరాజు మహారాజు

కొందరు తమను తాము గుర్తించుకుంటారు. తాము నివసిస్తున్న సమాజ అవసరాల్ని గుర్తిస్తారు. తమ కర్తవ్యాన్ని తమకు తామే నిర్దేశించుకుంటారు. తాము నడుస్తూ సమాజాన్ని ముందుకు నడిపిస్తారు. బాధ్యతగల శాస్త్రవేత్తలు చేసిందీ, చేస్తున్నది ఇదే! ఈ కోవకు చెందిన భారతీయ శాస్త్రవేత్తల్లో శాంతి స్వరూప్ భట్నాగర్ (21 ఫిబ్రవరి 1894–1 జనవరి 1955) ముఖ్యులు. ఈ రోజు మన దేశంలో ఉన్న ప్రధాన పరిశోధనా సంస్థలన్నింటికీ ఒకనాడు రూపకల్పన చేసింది ఆయనే. (FATHER OF RESEARCH LABORATORIES). ఆయన గౌరవార్థం కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) వారు ప్రతి ఏటా ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలకు 'శాంతి స్వరూప్ భట్నాగర్ ప్రైజ్' పేరిట అవార్డులు ఇస్తున్నారు. ఈ అవార్డు శాస్త్ర వైజ్ఞానిక రంగాలలో ఎంతో గౌరవప్రదమైంది.

శాంతి స్వరూప్ భట్నాగర్ పాకిస్థాన్‌లోని షాపూర్‌లో పుట్టాడు. తల్లిగారి తండ్రి అంటే తాతగారైన ప్యారేలాల్ పోషణలో బులంద్ షహర్ : సికింద్రాబాద్ – ఉత్తరప్రదేశ్‌లో పెరిగాడు. ఆ తాత గారు ఆ రోజుల్లో రైల్వే ఇంజనీర్‌గా పనిచేసేవారు. శాంతి స్వరూప్ తల్లి పార్వతి, తండ్రి పరమేశ్వర్ సహాయ్. వంశ పారంపర్యంగా వస్తున్న ఇంటిపేరు సహాయ్‌ని వదిలేసి – హిందూ, ముస్లిం, సిక్కు, క్రైస్తవ మతాలకు దూరంగా వెళ్ళి కాయస్తులలో చేరి, శాంతి స్వరూప్ భట్నాగర్‌గా మారాడు. చిన్నతనంలో శాంతి స్వరూప్‌లో వైజ్ఞానిక జిజ్ఞాసను పెంచింది ఆ తాత గారే. ఆయన శిక్షణలో శాంతికి సాహిత్య, నాటక, సాంస్కృతిక, సామాజిక, వైజ్ఞానిక రంగాల్లో మంచి అభిరుచి కలిగింది. శాంతి స్వరూప్ తన తండ్రి సహాధ్యాయి అయిన లాలా రఘునాథ్ సహాయ్ దృష్టిలో పడ్డాడు. ఆయన దయాల్ సింగ్ హైస్కూలుకు హెడ్మాస్టర్‌గా ఉండేవాడు. స్వయంగా వెళ్ళి, శాంతి స్వరూప్ తల్లితోనూ, తాతతోనూ మాట్లాడి శాంతి చదువుకు సంబంధించిన బరువు బాధ్యతలను తనకు అప్పగించాల్సిందిగా కోరాడు. తన మిత్రుడు పరమేశ్వర్ సహాయ ఆత్మశాంతి కోసమైనా తనకు ఆ బాధ్యత అప్పగించాలని మరి మరి ప్రాధేయపడ్డాడు. వారికి అంగీకరించక తప్పలేదు. ఆ విధంగా హెడ్మాస్టర్ లాలా రఘునాథ్, శాంతి స్వరూప్‌ను సొంత బిడ్డలా చూసుకుని పెంచి పెద్ద చేశాడు. అయితే శాంతి, రఘునాథ్‌పై భారం వేయలేదు. ప్రభుత్వ విద్యార్థి వేతనం



సంపాదించుకున్నాడు. అక్కడి సైన్స్ ఉపాధ్యాయుడు మౌల్వీ తాలిబ్ అలీ ఎబంద్ పోత్సాహంతో అద్భుతాలు చేసి చూపాడు. ఫ్లాస్కులు, టెలిఫోన్‌లు, కాలింగ్ బెల్‌లు, స్టీమ్ ఇంజన్ల వంటి పరికరాలు తయారుచేస్తూ, ప్రదర్శిస్తూ ఉండేవాడు. ఆ విధంగా విద్యార్థులందరికీ ఆదర్శ ప్రాయుడయ్యాడు.

శాంతి స్వరూప్ భట్నాగర్ డిగ్రీ చదివాడు. కానీ, పరీక్ష తప్పాడు. మరోవైపు అప్పటికే పెద్ద వాళ్ళు పెండ్లి చేశారు. డిగ్రీ పూర్తి కాలేదు. ఉద్యోగం లేదు. ఆ స్థితిలో ఆదుకునే వాళ్ళు లేరు. భారతదేశంలోని సగటు యువకులు చాలా మంది అలాంటి పరిస్థితులు ఎదుర్కొంటున్నవే. అలాంటి స్థితిలో ధైర్యంగా నిలబడి, ఒక గొప్ప శాస్త్రవేత్తగా ఎదగడమంటే – అతనిలోని పట్టుదల, కృషి, నిజాయితీ, నిబద్ధత ఏ పాటిదో అర్థం చేసుకోవాలి. వాటి నుండే నేటి యువత స్ఫూర్తి పొందాలి. ఆ దశలో ప్రైవేట్‌గా ట్యూషన్లు చెప్పుకుంటూ శాంతి స్వరూప్ బి.యస్సీ పాసయ్యాడు. ఆ తర్వాత ఫోర్‌మెన్ కాలేజీలో డెమానిస్ట్రేటర్‌గా ఉద్యోగం సంపాదించాడు. అక్కడే మాస్టర్స్ డిగ్రీ ప్రైవేట్ అభ్యర్థిగా ప్రొఫెసర్ జి.యం. బినాడే దగ్గర ఎన్‌రోల్ అయ్యాడు. "ద ఎఫెక్ట్ ఆఫ్ అబ్‌సార్బ్డ్ గ్లాస్ ఆన్ ద సర్ఫేస్" టెన్షన్ ఆఫ్ వాటర్ – అనే అంశంపై డిజర్టేషన్ పూర్తి చేసి పోస్ట్ గ్రాడ్యుయేట్ పట్టా సాధించాడు. శాంతి స్వరూప్, తన విదార్థులందరిలోకి తలమానికమైన వాడని ప్రొఫెసర్ బినాడే ఎంతో గొప్పగా చెప్పుకునేవాడు. వెను వెంటనే దయాల్ సింగ్ స్కాలర్‌షిప్‌తోనూ, తన భార్య లాజవంతి నగలు అమ్మిన డబ్బుతోనూ 1919లో భట్నాగర్ లండన్ బయలుదేరి వెళ్ళాడు. యూనివర్సిటీ కాలేజిలోని రామ్సే లెబొరెటరీలో డైరెక్టర్ డొన్నాన్ ఆధ్వర్యంలో సర్‌ఫేస్ టెన్షన్‌పై పరిశోధనలు సాగించాడు.

'ఇన్వెన్షన్స్ ఆఫ్ ఎమల్షన్స్' అనే విషయంపై 1921లో డి.ఎస్సీ పట్టా పొందాడు. అదే సమయంలో సి.వి.రామన్, జె.సి.బోస్, పి.సి.రే మొదలైన వాళ్ళంతా అక్కడే లండన్‌లో ఉన్నారు. బనారస్ హిందూ యూనివర్సిటీ (బీహెచ్‌యూ) వాళ్లు వీళ్ళందరిని సంప్రదించి, చివరకు శాంతి స్వరూప్ భట్నాగర్‌కు ఫిజికల్ కెమిస్ట్రీ అధ్యాపకునిగా స్వదేశం తిరిగి రమ్మని ఆహ్వానించారు. ఆ ఆహ్వానాన్ని స్వీకరించి భట్నాగర్ తిరిగి రావడమే కాదు, బీహెచ్‌యూలోని ప్రయోగశాలల్ని మరింతగా అభివృద్ధి చేశాడు. 1923లో బెనారస్ హిందూ యూనివర్సిటీ ప్రతినిధిగా లివర్‌పూల్‌లో జరిగిన బ్రిటీష్ అసోసియేషన్ సమావేశాలకు హాజరైన శాంతి స్వరూప్, అక్కడ 'నేచర్' పత్రికలో అచ్చయిన ప్రకటన చూశాడు. లాహోర్‌లోని కెమికల్ లేబొరేటరీస్‌కు డైరెక్టర్ పదవి కోసం ఆ ప్రకటన ఇవ్వబడింది. దానికి ప్రొ.విల్స్‌డెన్‌తోపాటు భట్నాగర్ అప్లయ్ చేశాడు. ప్రొ. విల్స్‌డెన్‌కు ఆ పదవి దక్కాలని, భట్నాగర్ విరమణకు పెద్ద ఎత్తున ఒత్తిళ్ళు వచ్చాయి. భట్నాగర్ పోటీ నుంచి తప్పుకోలేదు. చివరకు ప్రొ. విల్స్‌డెన్ ప్రయత్నాలు మానుకుని వెళ్ళిపోయాడు. దేశం బ్రిటీష్ వారి ఆధీనంలో ఉన్నప్పుడు బ్రిటీష్ ప్రొఫెసర్‌ను పంపించి, ఒక భారతీయ శాస్త్రవేత్త ఆత్మ స్థైర్యంతో నిలబడి డైరెక్టర్ పదవి సాధించడమన్నది మామూలు విషయం కాదు – భట్నాగర్ మామూలు వాడు కాదన్నది రుజువైంది!

1942 సెప్టెంబర్‌లో భట్నాగర్ కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్)కు రూపకల్పన చేశాడు. త్వరితగతిన దేశం పారిశ్రామికంగా ఎంతో పురోగతి సాధించింది. ఒక వైపు టాటా స్టీల్ వారు సర్జికల్ స్టీల్ తయారు చేయసాగారు. మరో వైపు టెక్స్‌టైల్ మిషనరీ ఇండస్ట్రీ, ఇంకోవైపు షుగర్ ఇండస్ట్రీ శాఖలు శాఖలుగా పెరిగిపోయాయి. నేషనల్ ఫిజికల్, కెమికల్, మెటలర్జికల్, గ్లాస్, ఫ్యూయెల్, బిల్డింగ్ రోడ్, లెదర్, ఎలక్ట్రో కెమికల్, డ్రగ్ అండ్ ఫుడ్ టెక్నాలజీ మొదలైన వివిధ రంగాలకు చెందిన జాతీయ పరిశోధన శాలలకు భట్నాగర్ రూపకల్పన చేసి, ప్రపంచ వైజ్ఞానిక రంగంలో భారతదేశానికి ఒక విశిష్ట స్థానాన్ని కల్పించాడు. స్వాతంత్ర్యం లభించక ముందే దేశ అవసరాల్ని గుర్తించి, దేశం బ్రిటీష్ వారి పాలనలో ఉండగా ఇన్ని పరిశోధనాశాలలకు అనుమతి సంపాదించడమంటే, ఎంత క్లిష్టమైన పనో చెప్పడం కష్టం.

సీఎస్ఐఆర్‌ను నెలకొల్పడంలో భట్నాగర్‌కు జె.సి.ఘోష్, జె.యం.ముఖర్జీ, మేఘనాథ్ సాహా, యస్.కె.మిత్ర, నాజర్ అహ్మద్ మొదలైన భారతీయ శాస్త్రవేత్తలంతా సహకరించారు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చే వరకు సీయస్ఐఆర్‌కు శాంతి స్వరూప్ భట్నాగర్ అధ్యక్షుడిగా ఉన్నాడు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ దానికి అధ్యక్షుడయ్యాడు. భట్నాగర్ సెక్రటరీగా పని చేశాడు. ఆ తరువాత సీయస్ఐఆర్ – నలభై శాఖలుగా విస్తరిల్లింది. ఆరు వేల మంది శాస్త్రవేత్తలతో 13 వేల మంది సాంకేతిక నిపుణులతో, మరో ఆరు వేల ఇతర ఉద్యోగులతో స్థిరపడి ఆ సంఖ్య పెరుగుతూ పోయింది. వందల కోట్ల నిధులతో అది ఒక పెద్ద సంస్థగా రూపుదిద్దుకుంది. ఆస్ట్రో ఫిజిక్స్ నుండి ఆంటీ బయాటిక్స్ దాకా – కంప్యూటర్స్ నుండి కెటలిస్ట్‌లదాకా వివిధ రంగాలలో జరిగే పరిశోధనలకు సీఎస్ఐఆర్ ఆర్థిక సహాయం అందిస్తూ ఉంది. భట్నాగర్ సమయస్ఫూర్తి గురించి ఎంతో మంది ఎన్నో విషయాలు చెపుతుంటారు. ఒకసారి లెదర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ బిల్డింగ్స్ తయారయ్యాయి. హడావుడిగా ప్రారంభో త్సవం ఏర్పాటు చేశారు. బిల్డింగ్‌లో ఎక్కడా ఏమీ లేవు. వెంటనే ఆయన మ్యూజియం వాళ్ళని అడిగి జంతువుల మోడల్స్ తెప్పించి, వాటిని అందంగా భవనమంతా అమర్చమన్నాడు. అంతే. ఆ అమరిక కొత్త భవనానికి వింత శోభనిచ్చింది. అది జంతు చర్మాలపై పరిశోధనలు చేసే సంస్థ గనక, ఆ అమరిక అందరికీ నచ్చింది. ఆకట్టుకుంది !

మరోసారి కర్రికుడి ఇనిస్టిట్యూట్ విషయంలో అలాగే జరిగింది. ఆ సంస్థ చుట్టుపక్కల ఏ పట్టణమూ లేదు. కనీస అవసరాలూ లేవు. అంతటి మారుమూల పల్లెలో జాతీయ సంస్థ నెలకొల్పడమేమిటని కొందరు రాజకీయం చేద్దామనుకున్నారు. ప్రారంభోత్సవానికి ప్రధాని నెహ్రూ రాబోతున్న సందర్భం. భట్నా గర్ తెలివిగా పరిస్థితులను తనకు అనువుగా మార్చుకున్నాడు. అధైర్య పడలేదు. ప్రధాని నెహ్రూ మదరాసులో విమానం దిగి కర్రికుడి వచ్చే దారిలో వంద టాక్సీలు ఏర్పాటు చేశాడు. వారు చేయాల్సింది ఏమీ లేదు. దినమంతా ఆ దారిలో అటు నుండి ఇటు, ఇటు నుండి అటు తిరుగుతూ ఉండాలి. అంతే ! ఆ ఉపా యం బాగా పనిచేసింది. దారి పొడవునా కార్ల రాకపోకలు చూసిన నెహ్రూజీకి అదొక మారుమూల ప్రదేశమన్న ఆలోచనే రాలేదు. వంద టాక్సీ కార్లతో ఆ ప్రాంతమంతా పట్టణ ప్రాంత మన్న భ్రాంతిని కలిగించాడు – భట్నాగర్ ! ఆ సంస్థ ప్రారంభమ య్యాక క్రమ క్రమంగా ఆ ప్రాంతం దానంతట అదే అభివృద్ధి అయ్యింది. జటిలమైన సమస్యలకు సులువైన మార్గాలు అన్వేషించడంలో శాంతి స్వరూప్ భట్నాగర్‌ది అందెవేసిన చేయి. అవి రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న రోజులు. యుద్ధానికి కావాల్సిన పరికరాల్ని 'గ్రూప్ సప్లరు కౌన్సిల్' అందిస్తూ ఉండేది. పెట్రోల్, డీజిల్ లాంటి ఇంధనాలు హెలికాప్టర్ నుంచి యుద్ధం జరిగే ప్రదేశాలలో జార విడిచేందుకు తగిన డబ్బాలు అవసరం అయ్యాయి. రేకు డబ్బాలకు ప్రత్యామ్నాయంగా మరే వైనా ఉంటే బావుండునని తర్జనభర్జన పడుతున్న సమయంలో, ఆ సమస్యను శాంతి స్వరూప్ ముందుంచారు. పాలిమర్ కెమిస్ట్రీ మీద మంచి

**(మిగతా 31వ పేజీలో)**

# టిడిపి కూటమి ఏడాది పాలన.. వ్యవసాయ రంగానికిచ్చిన హామీలు - అమలు

- కె.ప్రభాకరరెడ్డి

**రాష్ట్రంలో తెలుగుదేశం, బిజెపి, జనసేన కూటమి ప్రభుత్వం వచ్చి జూన్ 12తో సంవత్సరం పూర్తయింది. ఎన్నికల ముందు రైతులను ఆదుకునేందుకు వ్యవసాయ రంగానికి సంబంధించి అనేక హామీలను గుప్పించింది. ఏడాది తర్వాత హామీల అమలు పరిశీలిస్తే వ్యవసాయ రంగానికి చేసింది శూన్యం. వాస్తవాలను పరిశీలిస్తే ఈ రంగం పురోగమనం బదులు తిరోగమనంలో ఉన్నదని స్పష్టం అవుతోంది. ఎన్నికల సందర్భంగా సూపర్ సిక్స్‌లో భాగంగా పెట్టుబడి సాయం కింద ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20 వేలు ఇస్తామని టిడిపి కూటమి హామీ ఇచ్చింది. సంవత్సరం గడిచినా ఎన్నికలలో ఇచ్చిన పెట్టుబడి సాయం హామీ ఇప్పటి వరకు అమలు చేయలేదు. తక్షణమే రైతుల ఖాతాలలో జమ చేయాలి.**

రాయలసీమ, ఉత్తరాంధ్ర, వెనుకబడిన ప్రాంతాల్లోని గాలేరు-నగరి, హంద్రీ-నీవా, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, తోటపల్లి రిజర్వాయర్, వంశధార-నాగావళి వంటి ప్రాజెక్టుల శీఘ్రతర నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, రాష్ట్రంలో నదుల అనుసంధానం ద్వారా ప్రతి ఎకరాకు సాగు నీరు ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి 2025-26 బడ్జెట్‌లో కేవలం ఆరు శాతంలోపుగానే నిధులు కేటాయించారు. రూ.3,22,359 కోట్ల బడ్జెట్‌లో సాగునీటి ప్రాజెక్టులకు కేటాయించింది రూ.18,019 కోట్లు మాత్రమే. ఈపాటి నిధులతో ఏ ప్రాజెక్టు పూర్తిచేస్తారు? చెప్పే మాటలకు చేసే పనులకు పొంతనే లేదు. ఇరవయ్యేళ్లుగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయలేని ప్రభుత్వం రూ.81,000 కోట్లతో గోదావరి-బనకచర్ల నిర్మించి నదులు అనుసంధానం చేస్తామని కబుర్లు చెబుతోంది. ముందుగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు నిధులు కేటాయించి వాటిని పూర్తిచేసిన తరువాత గోదావరి-బనకచర్ల నిర్మిస్తామంటే ప్రజలు నమ్ముతారు, హర్షిస్తారు.

గత ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ చట్టం పేరుతో భూములను రీ సర్వే చేసి వ్యవసాయ భూముల రికార్డులను గందరగోళంగా మార్చింది. సర్వే నంబర్ల స్థానంలో ఎల్.పి.ఎం పేరిట రైతులకు కొత్త సమస్యలను సృష్టించింది. రైతుల దస్తావేజులు, పట్టాదారు పాసు పుస్తకాలపై జగన్మోహన్‌రెడ్డి బొమ్మలు వేయటంతో రైతులలో అభద్రతా భావం కలిగింది. ఎన్నికల సందర్భంగా ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేస్తామని టిడిపి కూటమి హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ చట్టం రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. కానీ సంవత్సరం గడుస్తున్నా గత ప్రభుత్వ కాలంలో రీసర్వేలో తలెత్తిన సమస్యలను ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం పరిష్కరించలేదు. పైగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రైతుల భూములను డిజిటల్ అగ్రిమిషన్ కింద డిజిటలైజ్ చేస్తూ కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలకు అనుకూలంగా భూరికార్డులను రూపొందిస్తున్నారు. ఈ విధానం రైతులకంటే కార్పొరేట్ కంపెనీలకే ఉపయోగపడుతుంది. రైతుల భూములను గుండుగుత్తగా కార్పొరేట్ కంపెనీలకు స్వాధీనం చేసే ప్రక్రియ తప్ప మరొకటి కాదు. రెవెన్యూ శాఖలో అవినీతి శృతి మించింది.

పాల రైతులకు పశువుల కొనుగోళ్లకు, దాణా, మందుల కొనుగోళ్లపై సబ్సిడీ ఇస్తామని, ఇన్సూరెన్స్ సౌకర్యం అమలు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. 40 లక్షలకు పైగా ఉన్న పాల రైతులకు సంవత్సర కాలంలో ఇచ్చిన ఏ హామీ అమలు చేయలేదు. ప్రైవేటు డెయిరీల ప్రయోజనం కోసం సహకార డెయిరీల ఉసురు తీసే విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నది. విశాఖ డెయిరీ యాజమాన్యం చేస్తున్న అక్రమాలపై డెయిరీ పరిధిలోని పాలసేకరణ ధర తగ్గింపు, బోనస్ ఇవ్వకపోవడం, పాల సేకరణ లక్ష్యం కుదించటం వంటి అంశాలపై అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం జిల్లాలలోని వేలాది మంది రైతులు నెలల తరబడి ఆందోళన చేశారు. పాల రైతుల ఒత్తిడికి తలొగ్గిన ప్రభుత్వం విశాఖ డెయిరీలో జరిగిన అక్రమాలపై విచారణకు శాసనసభ కమిటీ వేసింది. నెలలు గడుస్తున్నా శాసనసభా కమిటీ ఎలాంటి నివేదిక ఇవ్వకుండా కాల హరణం చేస్తోంది. కేవలం తమ రాజకీయ ప్రయోజనాల కోసమే ఈ రకమైన కాలహరణం చేస్తున్నదని విశాఖ డెయిరీ పరిధిలోని పాల రైతులు తీవ్రమైన ఆందోళనతో ఉన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి అన్ని సంక్షేమ పథకాలు అందిస్తామని, పంటల బీమా వర్తింపచేస్తామని, బ్యాంకు రుణాలు అందిస్తామని ఎన్నికలలో హామీ ఇచ్చారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సరం దాటినా ఇప్పటి వరకు కౌలు రైతులకు ఇచ్చిన హామీ ఏదీ అమలు

చేయలేదు. ప్రభుత్వం వచ్చిన కొత్తలో పాత కౌలు చట్టం స్థానంలో కొత్త కౌలు చట్టం తీసుకొస్తామని కౌలు రైతుల ప్రయోజనాలు కాపాడుతామని ప్రకటించారు. మాటల్లో తప్ప చేతల్లో నూతన కౌలు చట్టం తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. రాష్ట్రంలో 30 లక్షల మంది కౌలు రైతులు ఉంటే లక్ష మందికి కూడా కౌలు కార్డులు ఇచ్చింది లేదు. ఈ రకంగా లక్షలాది మంది కౌలు రైతులను మాయమాటలతో ప్రభుత్వం మోసం చేస్తున్నది.

సబ్సిడీపై డ్రిప్, స్ప్రింక్లర్లు ఇస్తామని, రాయలసీమ ప్రాంతాన్ని విత్తన రాజధానిగా, హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని ఇచ్చిన హామీ, హామీగానే ఉంది తప్ప ఆచరణకు నోచుకోలేదు. హార్టికల్చర్ హాబ్‌గా మార్చలేదు కానీ సోలార్ హబ్‌గా మార్చుతున్నారు. సోలార్, గ్రీన్, క్లిన్ ఎనర్జీ వంటి ముద్దు పేర్లతో, కొత్త పేర్లతో మొత్తం రాయలసీమలోని అనంతపురం, సత్యసాయి, కర్నూలు, నంద్యాల, కడప జిల్లాలలో లక్షలాది ఎకరాల రైతుల భూములు, ప్రభుత్వ భూములను విద్యుత్ కార్పొరేట్ కంపెనీల పరం చేస్తున్నారు. రాయలసీమ ప్రాంత భూములను కార్పొరేట్లకు హారతి పందేరం చేస్తున్నారు.

ఆక్వా రంగాన్ని ఆదుకునేందుకు విద్యుత్ యూనిట్‌కు రూ.1.50 పైసలకే సరఫరా చేస్తామని, ట్రాన్స్‌ఫార్మర్ల ధరలు తగ్గిస్తామని, ఏవియేటర్లు సబ్సిడీతో ఇస్తామని ఎన్నికలలో హామీ ఇచ్చారు. ఏవి అమలు చేయలేదు. అమెరికా అధ్యక్షులు ట్రంప్ మన ఆక్వా ఉత్పత్తులపై సుంకాలు పెంచి ఆక్వా రంగాన్ని ఘోరంగా దెబ్బ తీస్తే ఆక్వా రైతుల పక్షాన ఒక్కమాట కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడలేదు. ఆక్వా రైతులను ఆదుకునేందుకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదు.

ఖరీఫ్, రబీ సీజన్‌లలో కరువు, తుఫాన్‌లతో నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ లేదు. ఉచిత పంటల బీమా ఎత్తివేశారు. పంటల బీమా పరిహారమూ లేదు. అరకొర పండిన పంటలకు గిట్టుబాటు ధర లేదు. పండించిన పంటలు కొనే నాథుడే లేడు. పత్తి, మిర్చి, పొగాకు, మామిడి, జొన్నలు, కందులు, మినుములు, టమోటా, కోకో, జీడి మామిడి, ఆయిల్ పామ్ ఇలా ఏ పంటకూ గిట్టుబాటు ధర లేక రైతు విలవిల లాడుచున్నాడు. ఆదుకోవలసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాటలతో కాలయాపన చేస్తున్నాయి. 2023-24లో మిర్చి క్వింటాల్‌కు రూ.25,000కు పైనే ధర వచ్చింది. 2024-25లో 8,000కు పడిపోయింది. మిర్చికి కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.11,781గా ప్రభుత్వాలు ప్రకటించాయి. అంతకంటే తక్కువ ధరకు అమ్ముకున్న మిర్చి రైతులకు ఇస్తామన్న ధరల వ్యత్యాస మొత్తం ఇప్పటి వరకు రైతుల ఖాతాలలో వేయనేలేదు.

పొగాకు రైతులను మోసం చేస్తున్న టొబాకో కంపెనీలపై ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోవటం లేదు. 2024లో క్వింటాల్ రూ.18,000 చొప్పున కొన్న పొగాకు కంపెనీలు 2025లో రూ.6,000, 8,000లకు మించి కొనటం లేదు. 2024లో పొగాకు పంట దిగుబడి, రేటు ఆశాజనకంగా ఉండటంతో అధిక కౌలు చెల్లించి కౌలు రైతులు పొగాకు సాగు చేశారు. రాష్ట్రంలో ప్రకాశం, బాపట్ల, పల్నాడు, గుంటూరు, నంద్యాల, కర్నూలు జిల్లాలలో వర్జీనియా, తెల్ల బర్లీ, నల్ల బర్లీ, సిరి వంటి రకాలు రైతులు సాగు చేశారు. ఫిబ్రవరిలో ప్రారంభించి మే చివరికి కొనుగోళ్లు ముగించాల్సిన పొగాకు కంపెనీలు మే చివరి నాటికి రైతులు పండించిన పొగాకులో 25 శాతం కూడా కొనుగోలు చేయలేదు. పొగాకు రైతుల ఆందోళనతో చివరి ఆకు వరకు మార్కుఫెడ్ ద్వారా జూన్ 7 నుండి కొనుగోలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం జూన్ 17వ తేదీ వచ్చినా కొనుగోళ్ళు ప్రారంభించలేదు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో విస్తారంగా పండించే తోతాపురి మామిడి పంటకు కిలో రూ.4, రూ.5కు మించి ధర ఇవ్వడం లేదు. మామిడిగుజ్జు పరిశ్రమల యజమానుల మాయాజాలంలో మామిడి రైతులు నలిగిపోతున్నారు. మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులు మామిడి రైతుల నుండి కిలో రూ.12లకు కొనాలని, ప్రభుత్వం నుండి కంపెనీలకు కిలోకు రూ.4 రాయితీ ఇస్తామని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. అయినా మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులు రూ.12 ధర అమలు చేయడం లేదు. విపరీతంగా పెట్టుబడి ఖర్చులు పెట్టి మామిడి పండిస్తే కొనే నాథుడే లేడు. మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులపై ఎటువంటి చర్యలు తీసుకొనే పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం లేదు.

రైతులు పండించిన కోకో గింజలకు గత సంవత్సరం కిలో రూ.1000 ధర పలికింది. ఈ సంవత్సరం అంతర్జాతీయ మార్కెట్లో రూ.1,050 ఉంది. కానీ కంపెనీలు కిలోకు రూ.500 కూడా ధర ఇవ్వకుండా, రైతుల దగ్గర ఉన్న కోకో గింజలు కొనుగోలు చేయకుండా రైతులను బ్లాక్ మెయిల్ చేస్తుంటే కోకో కంపెనీలపై ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోవటం లేదు. రైతుల ఆందోళనల తరువాత స్పందించిన ప్రభుత్వం రైతులకు కంపెనీల నుండి గిట్టుబాటు ధర ఇప్పించలేకపోయింది. రైతుల ప్రయోజనాలకంటే ప్రైవేటు కంపెనీలకే అనుకూలంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నది.

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం రైతాంగం, కౌలు రైతులకు ఎన్నికలలో ఇచ్చిన హామీల అమలు కోసం వెనుకబడిన ప్రాంతాల సాగు నీటి ప్రాజెక్టుల నిధులు, ఉచిత పంటల బీమా, రైతులు పండించిన పంటల గిట్టుబాటు ధరల కోసం పోరాటం తప్ప మరో మార్గం లేదు. రైతాంగ ఐక్య పోరాటంతో ప్రభుత్వం మెడలు వంచి రైతాంగ ప్రయోజనాలు, వ్యవసాయ రంగ ప్రయోజనాలు కాపాడుకోవాలి. ❑

# విద్యుత్ ఒప్పందాలు - వినియోగదారులపై భారాలు

- సారంపల్లి మల్లారెడ్డి

రాష్ట్రంలో విద్యుత్ సరఫరాలో ప్రసార నాణ్యత రోజురోజుకూ పడిపోతోంది. వినియోగం రికార్డుస్థాయిలో నమోదవుతుంటే ఉత్పత్తి మాత్రం అందుకు అనుగుణంగా పెరగకపోవడం ఆందోళన కలిగిస్తోంది. దీని సమగ్ర నిర్వహణకు సర్కార్ రూపొందించిన ప్రణాళిక వ్యవస్థ నత్తనడకనే సాగుతోంది. సొంత ఉత్పత్తిపైన కేంద్రీకరణ లేకపోవడం వల్ల వినియోగదారులకు భారంగా పరిణమించింది. గత ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్‌ను తీసుకొస్తామని చెప్పి వందల కోట్ల రూపాయలు వెచ్చించింది. అది ఒక్క మెగావాట్‌ను కూడా అందించక నిరాశపరిచింది. ప్రస్తుత ప్రభుత్వం హిమాచల్ ప్రదేశ్‌తో చేసుకున్న షరతులతో కూడిన ఒప్పందం వల్ల ప్రజలకు ఉపయోగం లేదనే వాదన వినిపిస్తున్నది. అప్పుడు, ఇప్పుడు ఈ తతంగంలో లాభపడింది కార్పొరేట్ శక్తులే. ఇది నష్టమని తెలిసినప్పటికీ ప్రయివేటు విధానాలనే మన పాలకులు అమలు చేస్తున్నారు. ఏపీలో స్మార్ట్‌మీటర్ల బిగింపు, యూనిట్ ధరల పెంపు నిర్ణయం అందులో భాగమే. తెలంగాణలో ఇప్పుడా పరిస్థితి లేకున్నా భవిష్యత్తులో ఇది మనకు ప్రమాదంగా మారనుంది. ఎందుకంటే, రాష్ట్ర విద్యుత్‌ను సవరణ ద్వారా కేంద్రం తమ ఆధీనంలోకి తీసుకుంది. రాష్ట్ర విభజన సమయంలో ఇస్తామన్న విద్యుత్‌ను ఇవ్వకపోవడం తెలుగు రాష్ట్రాల ప్రజలకు శాపంగా మారింది. దానిపై నోరు మెదపక పోవడం, ప్రశ్నించకపోవడం పాలకుల ఉదాసీన వైఖరికి అద్దం పడుతున్నది.

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర విద్యుత్ వినియోగం 17,162 మెగావాట్ల రికార్డు స్థాయిలో ఈ ఏడాది మార్చి వరకు నమోదైంది. రాష్ట్ర ఉత్పత్తి మాత్రం 7,285.26 మెగావాట్లు దాటలేదు. ఇందులో 4,842.50 మెగావాట్లు థర్మల్, 2,441.76 హైడల్ ద్వారా ఉత్పత్తి అవుతున్నది. ప్రస్తుతం యాదాద్రి థర్మల్ పవర్ 4 వేల మెగావాట్లు 2025 జూన్ నాటికి నిర్మాణం పూర్తి చేస్తామని సర్కార్ ప్రకటించింది. కానీ రెండు యూనిట్లు 8 వందల మెగావాట్లు మాత్రమే అందుబాటులో వచ్చింది. మొత్తం ఐదు యూనిట్లలో ఇంకా మూడు 2026 జూన్ నాటికి పూర్తవుతాయని చెబుతున్నది. రూ.36,132 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో అవినీతి జరిగినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. తెలంగాణ రాష్ట్రం క్లీన్ అండ్ గ్రీన్ పాలసీని ప్రవేశపెట్టి, 2030 నాటికి 31.5 జిబ్ల్యూయు మెగావాట్ల పునరుత్పాదక సాధిస్తామని పేర్కొంది. కుసుం పథకం కింద రైతులకు సొంత పొలాల్లో బావులకు 4 వేల మెగావాట్లు ఉత్పత్తి చేయాలి. ఇందిర మహిళా శక్తి గ్రూపులు వెయ్యి మెగావాట్లు ఉత్పత్తి చేయాలి. ప్రతి ఇంటిపైన "సూర్యఘర్" కింద సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేయాలి. మోడల్ సోలార్ గ్రాములు, సోలార్ వీధి దీపాలు, సోలార్ హార్ట్ వాటర్ వ్యవస్థలు, అఫ్ గ్రిడ్ సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించింది. ఈ ప్రణాళిక అమలు ఆలస్యం జరుగుతుందన్న లక్ష్యంతో హిమాచల్‌ప్రదేశ్–తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి ఒప్పందం కుదుర్చుకుంది. 2025 ఏప్రిల్ 2న కుదుర్చుకున్న ఈ ఒప్పందం కింద చీనాబ్ నది పైన సెలివద్ద 4 వందల వీయర్ వద్ద 120 మెగావాట్ల రెండు విద్యుత్ ప్లాంట్లను జెన్‌కో భాగస్వామ్యంతో నిర్మించాలి. ఒక్కో మెగావాటుకు రూ.11.92 కోట్లు పెట్టుబడి పెట్టాలి. నిర్మాణానికి రూ.6200 కోట్లు పెట్టుబడి పెట్టగా మొదటి 12 ఏళ్లు హిమాచల్‌ప్రదేశ్‌కు 12 శాతం, రెండో 18 ఏళ్లు 18 శాతం, మూడో పదేళ్లు 30 శాతం విద్యుత్ ఇవ్వాలి. 40 ఏళ్ల తర్వాత ప్లాంటును పూర్తిగా ఆ రాష్ట్రానికి ఇవ్వాలి. ప్రస్తుతం ఆ ప్రాంత ప్రజల అభివృద్ధికి రూ.93 కోట్లు ఇవ్వాలి. నిర్వాసితులకు నెలకు 100 యూనిట్లకు సమానమైన సొమ్మును సబ్సిడీ ఇవ్వాలి. ఈ ప్రాజెక్టు ఏడాదిలో తొమ్మిది నెలలు పనిచేస్తుంది. మూడు నెలలు నీరు గడ్డకడుతుంది. ఇలాంటి షరతులకు తలొగ్గి ఇతర రాష్ట్రాల్లో ఉత్పత్తులు చేయాలి. గత టీ(బీ)ఆర్ఎస్ ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్‌లో వెయ్యి మెగావాట్లు కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకొని విద్యుత్ ఉత్పత్తి చేయకున్న రూ.700 కోట్లు చెల్లించింది. ఆ దారినే కొత్త సర్కార్ నడుస్తున్నది.

ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నది రెండు కోట్ల మంది వినియోగదారులు. వీరికి 95,127 మిలియన్ యూనిట్లు అవసరం. కానీ మనకు లభ్యత 1,23,631 మి.యూ. అదనంగా 28,504 మి.యూ ఇతరులకు అమ్మాలి. అనవసరమైన ఒప్పందాలు చేసుకోవడం వల్ల వినియోగదారులపై భారాలు పడుతున్నాయి. 2025–26లో రూ.58,628 కోట్లు ఆదాయాన్ని విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ నిర్ణయించింది. కానీ డిస్కంలు రూ.65,850 కోట్లు ప్రతిపాదనలు తెచ్చాయి. ఈ ప్రతిపాదనలను రెగ్యులేటరీ కమిషన్ తోసిపుచ్చింది. ప్రస్తుతం ఆదాయం రూ.45,710 కోట్లు మాత్రమే టారీఫ్ ప్రకారం వస్తుంది. రూ.13499.41 కోట్లు లోటు ఉంటుంది. ఈ లోటును ప్రభుత్వం సబ్సిడీగా భరిస్తానని ప్రకటించింది. పాత బకాయిలతో మొత్తం లోటు

20,151 కోట్లు ఉంది. ఇందులో ప్రభుత్వ సంస్థల బాకీలు రూ.11,756 కోట్లు ఉన్నాయి. పంచాయతీరాజ్, లిఫ్ట్ పథకాలు, మిషన్ భగీరథ, మున్సిపాల్టీలు, హైదరాబాద్ మెట్రో సంస్థలు బాకీ ఉన్నాయి. వీరు బాకీలు చెల్లించకపోవడం వల్ల వినియోగ దారులపై భారం పడుతున్నది. ఒక వైపున ఉత్పత్తి కొరత, మరోవైపు డిస్కం అసమర్థ నిర్వహణ వల్ల వినియోగదారులు వేల కోట్ల రూపాయల భారాన్ని భరించాల్సి వస్తున్నది. విద్యుత్ తలసరి వినియోగం ఎంత పెరిగితే అంతా అభివృద్ధి జరిగినట్లు గుర్తిస్తారు. ప్రస్తుతం రాష్ట్ర తలసరి వినియోగం 2,349 కిలో వాట్స్. దేశ తలసరి వినియోగం 1,538 కిలో వాట్స్ మాత్రమే. అభివృద్ధి చెందిన దేశాల్లో 4,800 కిలో వాట్స్ నుండి 600 వేల కిలో వాట్స్ వినియోగిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో, దళిత, గిరిజన పల్లెలు విద్యుత్ వినియోగానికి దూరంగా ఉన్నాయి. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వందశాతం వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెబుతున్నాయి. రానున్న 2033–34 వరకు రాష్ట్రంలో ఏర్పడనున్న లోటును గమనించి హిమాచల్‌ప్రదేశ్‌తో ఒప్పందం చేసుకున్నట్లు రెగ్యురేటరీ కమిషన్ ఛైర్మన్ నాగార్జున ప్రకటించారు. రాష్ట్ర విద్యుత్ శక్తి నిర్వహణ వ్యయం పెరుగుతున్నది. తొమ్మిది సంస్థలు పనిలో ఉన్నాయి. 1.ఎలక్ట్రికల్, ఇన్‌స్పెక్టరేట్ 2.ట్రాన్స్‌కో 3.దక్షిణ డిస్కం 4.ఉత్తర డిస్కం 5.జెన్‌కో 6.రెన్యూవ్‌బుల్ ఎనర్జీ కార్పొరేషన్, 7.విద్యుత్ రెగ్యురేటర్ కమిషన్, 8.విద్యుత్ ఆర్థిక సంస్థ లి. 9.సింగరేణి కాలరీస్ కంపెనీ సీఎండీల పెట్టి నిర్వహణ ఖర్చును పెంచాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 33 కె.వి సబ్‌స్టేషన్లు 3,276, ట్రాన్స్‌ఫార్మర్లు 9.17 లక్షలు, 33.కె.వి లైన్‌లు 28,301 కి.మీ, 11 కె.వి లైన్‌లు 2,24,125 కి.మీ ఉన్నాయి. ఎల్‌టి లైన్‌లు 4,42,792 కి.మీ ఉన్నాయి. 20 ఏళు గడిచిన తర్వాత కండక్టర్‌ను మార్చాలి. గతేడాది రూ.30 వేల కోట్లు వ్యయం చేసిన కండక్టర్‌ను పూర్తిగా మార్చలేదు. ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ సక్రమంగా లేదు. అందువల్ల నిర్వహణ వ్యయం పెరిగి వినియోగదారులపై భారాలు పడుతున్నాయి. విద్యుత్ సంస్థలు అంతర్గత నైపుణ్యాన్ని పెంచుకోవడం ద్వారా లోటును తగ్గించుకోవాలి. ప్రభుత్వం మన అవసరం మేరకు ఉత్పత్తి చేయాలి. రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్రం ప్రభుత్వం నాలుగు వేల మెగావాట్లు ఉత్పత్తి చేసి ఉచితంగా ఇస్తానని చట్టంలో చెప్పింది. పదేళ్లయినా ఇంత వరకు 16 వందల మెగావాట్లే ఇచ్చింది. గత ప్రభుత్వం విద్యుత్‌చ్ఛక్తి వ్యవస్థలో రూ.52 వేల కోట్లు భాకీలు చేసింది. ఈ ప్రభుత్వం ఆ లోటును భర్తీ చేయడానికి, నిర్వహణను మెరుగు పర్చడానికి సబ్‌స్టేషన్ కమిటీలు వేసి దాన్ని పరిష్కరించుకునే ప్రయత్నం చేయాలి.

కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విద్యుత్‌చ్ఛక్తి సంస్థను తమ ఆధీనం లోకి తీసుకుకోవడానికి 2003 చట్టానికి సవరణ తెచ్చింది. పార్లమెంట్‌లో చట్టం చేసింది. రాష్ట్ర హక్కులను కేంద్రం హరించింది. రెగ్యులేటరీ బాధ్యతలను కేంద్రమే నిర్ణయిస్తుంది. టారీఫ్ రేట్లను పెంచడంతోపాటు ఈ సంస్థలను బడాపెట్టుబడి దారుదైన ఆదానీకి అప్పగించడానికి పథకాలు తయారు చేసింది. సంప్రదాయ విద్యుత్ 15 శాతం వినియోగించాలని (సోలార్) నిర్ణయించింది. టారీఫ్ రేట్లు యూనిట్ రేట్ రూ.2.40 నుండి రూ.6.50 పెంపుదలకు నిర్ణయించింది. ఇప్పటికే ఏపీ వినియోగదారులపై ఆదాని రూపంలో రూ.లక్ష కోట్లు భారం పడింది. స్మార్ట్ మీటర్లు పెట్టి ముందే టారీఫ్ రేట్లు వసూళ్లు చేసే పరిస్థితి వచ్చింది. ప్రధాని మోడీ తెలంగాణలో అమలు చేస్తే ప్రస్తుతం 200యూనిట్ల మాఫీ పొందుతున్న, రైతులు వేల కోట్లు టారీఫ్ చెల్లించాల్సి వస్తుంది. అందువల్ల విద్యుత్ భారాలు తగ్గడానికి కేంద్ర జాబితా నుండి రాష్ట్ర జాబితాకు మార్చి డిస్కం లోపాలను సరిచేయాలి. అప్పుడే విద్యుత్ వినియోగదారులను లాభం జరుగుతుంది. తలసరి విద్యుత్ వినియోగం పెరుగుతుంది. ❑

---

# భారతీయ వైజ్ఞానిక పరిశోధనాశాలల పితామహుడు

**(27వ పేజీ తరువాయి)**

పట్టు ఉన్న వాడు కాబట్టి, తన ప్రయోగశాలలో ప్లాస్టిక్ డబ్బా (కంటెయినర్) తయారు చేశాడు. ఆ రోజుల్లో సీయస్ఐఆర్ ప్రయోగశాల ఢిల్లీ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఉండేది. భట్నాగర్ అక్కడి నార్త్ బ్లాక్ బిల్డింగ్ పైకి వెళ్ళి, కొన్ని వందల మంది సమక్షంలో తన చేతితో – ఆ ప్లాస్టిక్ డబ్బాను బలంగా కిందికి విసిరేశాడు. డబ్బా గానీ, అందులోని నీరు గానీ చెక్కు చెదరలేదు. ప్లాస్టిక్ డబ్బాల వాడకం ఈనాడు మనకు వింత కాదు. కానీ, ఆనాడు ఆయన అలా యుద్ధం కోసం ప్లాస్టిక్‌ను వాడుకలోకి తెచ్చాడు. అటు యుద్ధభూమి నుండి ఇటు సామాన్య జన జీవితం వరకు పరిశోధనలు ఉపయోగకరంగా ఉండాలన్నది భట్నాగర్ అభిమతం ! ఆశయం!! ఒకవైపు అనారోగ్యం, మరోవైపు పనిఒత్తిడి.. భట్నాగర్‌కు విశ్రాంతి దొరికేది కాదు. విధి నిర్వహణలోనే ఆనందం పొందేవాడు. చివరకు ఒకసారి డార్జిలింగ్‌లోని హిమాలయన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటనీరింగ్ సంస్థను సందర్శించడానికి వెళ్ళి, అక్కడే గుండెపోటుతో మరణించాడు. ఆ రోజు 1 జనవరి 1955. ప్రధాని నెహ్రూతోపాటు నాటి కేంద్ర మంత్రి వర్గమంతా ఆయనకు శ్రద్ధాంజలి ఘటించింది. "బిల్డర్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్" – అని నెహ్రూజీ ప్రశంసించాడు. కాలాన్ని గౌరవిస్తూ విధి నిర్వహణకు అత్యంత ప్రాధానమిచ్చిన శాస్త్రవేత్త – డా. శాంతి స్వరూప్ భట్నాగర్, ఒక వైజ్ఞానిక రత్నం! ❑

# విద్యా వ్యవస్థ - మానవీయ విలువలు

- దాడిశెట్టి శ్యామ్‌కుమార్

మానవజాతిని కలవరపెడుతున్న హింసాత్మక ఘటనలు దేశంలో అనేకం చోటు చేసుకుంటున్నాయి. అనాగరిక దుశ్చర్యలు, మానవీయ సంబంధాల మధ్య అగాధం సృష్టిస్తున్నాయి. మంచులా కరిగిపోతున్న ఆత్మీయతలు, మితిమీరిన హింసా ప్రవృత్తి, అంతర్గతంగా దేశభద్రతకు విఘాతం కలిగిస్తున్నాయి. ఈ మధ్య కాలంలో జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన మతోన్మాద ఉగ్రదాడి పట్ల దేశమంతా స్పందించింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ముక్త కంఠం వినిపించింది. అయితే దేశభక్తి ముసుగులో కొంతమంది చేస్తున్న అరాచకత్వం మాత్రం ఆక్షేపణీయం. అవీ పార్టీలైనా, సంస్థలైనా, సంఘాలైనా ఉగ్రవాదాన్ని ప్రేరేపించే విధంగా వ్యవహరిస్తున్న వారిపట్ల కఠినంగానే వ్యవహరించాలి. అయితే ఈ మతోన్మాదాన్ని పెంచి పోషించేది పాలకులే అయితే గనుక వారికి తగిన సమయంలో ప్రజలు బుద్ధి చెప్పాలి. ఇప్పుడు చెప్పదలుచుకున్న అంశం ప్రధాన ఉద్దేశం ఏమిటంటే ? ఈ ఉగ్రదాడులు, వారికి సహకరించే వారు, లేదంటే ప్రోత్సహిస్తూ తోడ్పాటునందించే వారు ఇతర దేశాల్లోనే కాదు, మనదేశం లోను ఉన్నారన్నది ఇంటిలిజెన్స్ సమాచారం. దాన్ని అరికట్టడం ఇప్పుడు సాధ్యమా ? వారు అలా ఎందుకు తయారయ్యారన్న మూలాల్ని పట్టుకోవడం ముఖ్యం. అందుకు మన విద్యా విధానంలో చిన్నప్పటి నుంచే మానవీయ విలువల్ని నేర్పడం అత్యావశక్యం. ఎందుకంటే, నేటి బాలలు రేపటి భారత పౌరులుగా, భారత సమాజ నవ నిర్మాణానికి పునాదులు గా చెప్పుకుంటున్నాం. కానీ వారికి మంచి బుద్ధులు నేరాల్సింది ఈతరం విద్యా బోధకులదే. భారత జాతీయ సమైక్యతత్వాన్ని, లౌకికవాదాన్ని, దేశభక్తిని విద్యార్థి దశ నుండే విద్యార్థుల మనసుల్లోకి చొచ్చుకుపోయేలా వారికి ఈ విలువల్ని నేర్పించాలని ఇప్పుడు పౌర సమాజం బలంగా అభిప్రాయపడు తున్నది.

పహల్గాం ఉగ్రవాద దాడి అనంతరం తీగ లాగితే డొంకంతా కదిలినట్లు ఉగ్రమూకలకు సహకరించిన కొందరు వ్యక్తులు దేశంలో కూడా ఉన్నారని వార్తల్లో, టీవీల్లో చూశాం. అయితే ఇంతటి తెగింపు, ఉన్మాదం తలకెక్కించుకునే పరిస్థితి ఎందుకు వస్తుందనేది కీలకం. చదువులో సరిగా రాణించని వారుంటే నైపుణ్యాన్ని బట్టి పనిచేసుకుంటారు. కానీ ఇక్కడ దేశద్రోహం పేరుతో ముద్ర వేస్తూ వారిని ముప్పు తిప్పలు పెడుతున్నవారే ఉగ్రవాదానికి సహరిస్తున్నారా? అనే అనుమానం కలగక మానదు.

**బాల్య దశ నుండి సరైన దిశా నిర్దేశం లేక, మానవీయ కోణంలో ఆలోచించే ధోరణి తగ్గిపోవడం, హానికరమైన కనికరం లేని లేని కఠినత్వ మనస్తత్వాలతో కొందరు క్రూరంగా మారడం ఈ దుస్థితికి కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు. సమాజంలో హింసాత్మ ధోరణికి చాలా కారణాలు వెతకచ్చు. కానీ వాటి మూలాల్ని అణిచివేసే దిశగా పాలకులు అడుగులు వేయడం కావాలి. తల్లిదండ్రుల తర్వాత విద్యార్థుల జీవన గమనంలో విద్యతోపాటు భవిష్యత్తు సమాజ నిర్దేశికత ఆలోచన విధానాలను ప్రతిబింబించేలా ఉపాధ్యాయులు ప్రేరణగా నిలుస్తారు.**

ప్రాథమిక పాఠశాల బాల్య దశలో విద్యార్థుల ఆలోచన విధానానికి బీజం పడుతుందనడంలో సందేహం లేదు. పరిసరాల్లో జరుగుతున్న విషయాలపై ఆసక్తి ఈ దశలోనే పెరుగుతుంది. విద్యతోపాటు విద్యార్థుల మనసులో మానవతా విలువలు, మానవతా దృక్కోణం, ఆలోచనలు దేశ జాతీయభావ స్ఫూర్తితో నేర్పాల్సింది ఈ దశలోనే.

నేర ప్రవృత్తిని నిరోధించే విధంగా, హింసకు తావులేని ఆదర్శవంతమైన జీవన విధానాలను గమ్యాన్ని నిర్దేశించి విద్యా వ్యవస్థనే. అక్కడ ఉపాధ్యాయులు చెప్పే పాఠాలతోపాటు, జీవన విధానంలో వస్తున్న మార్పులకనుగుణంగా వారిని తీర్చిదిద్దడం వారి లక్ష్యంగా ఉండాలి. నేడు శాస్త్రీయ విద్యా విజ్ఞానాన్ని పెంపొందించే బోధన రోజు రోజుకూ అంతరిస్తున్నది. పాలకులే మూఢ నమ్మకాల్ని పెంచిపోషిస్తున్న దుస్థితిని దశాబ్ద కాలంగా చూస్తున్నాం. స్ఫూర్తివంతమైన రచనలు, అందులోని అంశాలు, దేశ శ్రేయస్సు కోసం పోరాడిన మహానుభావుల చరిత్రల్ని తొక్కిపెట్టడం, తొలగించడం అత్యంత శోచనీయం. ఇలాంటి విధానాలే మన విద్యార్థులకు శాపాలుగా మారుతున్నాయి. వారిని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు విఫలమవ్వడానికి ఇలాంటివి దోహదపడతాయి. ఇలాంటి వాటి

ప్రభావంతో విద్యార్థులకు నష్టం జరగకుండా ఉంటాలంటే ముందు వారి మనసుల్లో ద్వేషభావం పోవాలి. వారిలో పాజిటివ్ ధోరణి పెంచే విధంగా పాఠాలు, బోధనలు ఉండాలి. సమాజంలో జరిగే ప్రతిచర్య వెనుక ఉన్న మూలాన్ని పట్టుకుని వారికి వివరించాలి. మతోన్మాద భావజాలాన్ని వ్యతిరేకించే విధంగా వారిని తయారు చేయాలి. లేదంటే వారు పెద్దయ్యాక కులం, మతం, ప్రాంతం పేరుతో కొట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఒక నేరం లేదంటే ద్వేషభావం కుటుంబాన్ని ఎలా విచ్ఛిన్నం చేసి వారి ఉజ్వల భవిష్యత్తును నాశనం చేస్తుందో ఉదాహరణలతో చూపించాలి. జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీల గురించి వివరించాలి. నేరాల్ని తగ్గించేందుకు విద్యావ్యవస్థలో ఉన్న అనేక అవకాశాల్ని ఉపయోగించుకోవాలి. పోలీసులు ఈ ప్రయత్నాన్ని గౌరవించాలి, సహకరించాలి. అన్నింటికన్నా ముందు తల్లిదండ్రులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ మంచిచెడుల పట్ల అవగాహన కలిగి ఉండాలి. ప్రతి గ్రామంలో పోలీసులు, ప్రభుత్వ అధికారులు సమావేశమై ప్రజలతో మమేకమవ్వాలి. నేర ప్రవృత్తిగల యువకుల్లో మౌలిక ఆలోచనలు పెంచే విధంగా కృషి చేయాలి. సమాజంలో చదువే అన్నింటికి మూలమన్న విషయాన్ని గమనించేలా, దానితోనే వారు అభివృద్ధి అయ్యేలా తోడ్పాటునందించాలి. అప్పుడే మెరుగైన సమాజంలో విద్యార్థులు, యువకులు భాగస్వాములవుతారు. ❑

# బహుముఖ ప్రజ్ఞావంతురాలు డాక్టర్ చిరంజీవినీకుమారి



కొందరి జీవితాలు మహోన్నత శిఖరాలై వెలుగొందుతాయి. వారు తమ వ్యక్తిత్వ శోభతో, ఆచరణాత్మక కృషితో సమాజానికి ఆదర్శప్రాయులవుతారు. జూన్ 1న ఈ లోకాన్ని వీడిన విదుషీమణి డా. పి.చిరంజీవినీకుమారి ఆ కోవకే చెందుతారు. ఆమె 1931 మార్చి 30న జన్మించారు. తన బతుకుబాటలో ఎన్నో ఎత్తు పల్లాలను చూశారు. ఆమె రాసిన 'శ్రీ శ్రీ సప్తతి మహోత్సవం' ఒక చరిత్ర.'తూర్పుగోదావరి జిల్లా చరిత్ర, సంస్కృతి' ఒక సంచలనం. తూ.గో జిల్లా సాహిత్య చరిత్ర ఒక కరదీపిక. 'తూగో జిల్లా గోదావరి కథలు.. అలలు' ఇతర ప్రాంతాల వారికి స్ఫూర్తి. 'గొల్ల రామవ్వ' కథపై పీవీ శతజయంతి సందర్భంగా ఆమె రాసిన అభిప్రాయ మాలిక ఒక ప్రాంతీయాతీత సహానుభూతి. ఇవన్నీ చిరంజీవినీకుమారి ఆలోచనల ప్రతి రూపాలే. విలువల విధ్వంసం పట్ల మానవ సంబంధాల్లో వచ్చిన అవాంఛనీయ ధోరణుల పట్ల తీవ్ర ఆవేదన కనబరిచేవారు. గొప్ప జ్ఞాపకశక్తి ఆమె సొంతం. చరిత్రలో నిలిచిపోయే ఎన్నో కార్యక్రమాలకు రూపకల్పన చేసి కాకినాడ కేంద్రంగా ప్రతిభావంతంగా నిర్వహించిన ఘనత ఆవిడది. తన దృఢచిత్తంతో ఐడియల్ కాలేజీకి వన్నె తెచ్చారు. ఆ కాలేజీని మెరుగైన విద్యాసంస్థగా తీర్చిదిద్దారు. చిరంజీవినీకుమారి తన జీవితకాలంలో ఎన్నో పదవులనధిరోహించారు.

ఏపీ స్టేట్ ప్రైవేట్ కాలేజీస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా, వేణుగోపాల సంస్కృత ప్రచారసభ సెక్రటరీగా, తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంఘం కార్యదర్శిగా, గిరిజన ప్రాంతపు 'స్పందన' స్వచ్ఛంద సేవాసంస్థ ప్రెసిడెంట్‌గా సేవలందించారు. రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం ఉపాధ్యక్షురాలిగా, ఏపీ హిస్టరీ కాంగ్రెస్ సభ్యురాలిగా పనిచేశారు. ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ సాధన సమితి వైస్ ప్రెసిడెంట్‌గా, అధికార భాషా సంఘం సభ్యురాలిగా ఇలా ఎన్నో పదవులకు వన్నె తెచ్చారు. శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం కీర్తి పురస్కారం, తుమ్మల సాహితీ సత్కారం, షీ ఫౌండేషన్ ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ ఉమెన్ వంటి అనేక పురస్కారాలు పొందారు. అభ్యుదయవాదిగా, ప్రగతిశీల రచయిత్రిగా చిరంజీవినీకుమారి కాకినాడకు కీర్తి కిరీటంలా వెలుగొందారు. యానాంలో నిర్వహించిన ఈ వ్యాసకర్త కళారత్న పురస్కార అభినందన సభకు విచ్చేసి ఆశీస్సులు అందించారు. అదే ఆవిడ చివరగా పాల్గొన్న సభ. ఆచరణవాదిగా చిరంజీవినీ కుమారి ఆకాంక్ష మేరకు కుటుంబసభ్యులు ఆమె పార్థివ దేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం రంగరాయ మెడికల్ కాలేజీకి అప్పగించారు. ❑

**- దాట్ల దేవదానం రాజు**

# బనకచర్లపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలి

**- ఆంధ్రప్రదేశ్ ఆలోచనాపరుల వేదిక**

**మనది ప్రజాస్వామ్య వ్యవస్థ. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వం. ప్రతిపక్షం శాసనసభకు వెళ్లడం లేదు. పోలవరం - బనకచెర్ల లాంటి అత్యంత కీలకమైన సమస్యలపై ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీలు మరియు ప్రజా సంఘాలు, ఆయా రంగాలకు చెందిన నిపుణులు మరియు అధ్యయన కారులతో సమావేశాలు ఏర్పాటు చేసి అభిప్రాయాలు తీసుకోవడం లేదు. ఆలోచనాపరుల వేదికగా ఒక ప్రతినిధి బృందంగా వెళ్ళి ముఖ్యమంత్రిని కలిసి, వినతిపత్రాన్ని అందజేసి, మా అభిప్రాయాలను నేరుగా తెలియజేద్దామన్నా ఇంటర్వ్యూ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో మా వినతి పత్రాన్ని స్పీడ్ పోస్ట్ ద్వారా ముఖ్యమంత్రి గారికి పంపాము. దాన్ని మీడియాకు విడుదల చేస్తున్నాము.**




## శ్రీ నారా చంద్రబాబునాయుడు,

**గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారికి,**

కృష్ణా - గోదావరి నదీ జలాల హక్కుల కోసం రాజీలేని పోరాటం, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసుకోవాల్సిన అవశ్యకత, గోదావరి - బనకచెర్ల ఎత్తిపోతల పథకంపై జరుగుతున్న చర్చల నేపథ్యంలో మా అభిప్రాయాలను మీ దృష్టికి తీసుకువస్తున్నాము.

- 1.తెలంగాణ రాష్ట్రానికి కృష్ణా నదీ జలాల్లో 500 టీఎంసీలు, గోదావరి నదీ జలాల్లో 1000 టీఎంసీలు కేటాయించాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారు చేసిన డిమాండును నిర్ద్వంద్వంగా తిరస్కరించి, ఆంధ్రప్రదేశ్ హక్కులను పరిరక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నాము.
- 2. అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టం-1956 మేరకు ఏర్పాటు చేసిన మొదటి కృష్ణా జల వివాదాల (బచావత్) ట్రిబ్యునల్ 1973లో ఇచ్చిన తీర్పు ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు పునరుత్పత్తి జలాలతో కలిపి 811 టీఎంసీలు కేటాయించబడ్డాయి. అందులో తెలంగాణ వాటా 278.96 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్ వాటా 522 టీఎంసీలు. 75% ప్రామాణికంగా లభించే జలాలకు సంబంధించి బచావత్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును రెండవ కృష్ణా జల వివాదాల (బ్రజేష్‌కుమార్) ట్రిబ్యునల్ తీర్పు 2013లో పునరుద్ఘాటించింది. ట్రిబ్యునల్ కల్పించిన వెసులుబాటును ఉపయోగించుకుని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రిష్ణా డెల్టా ఆధునికీకరణ ద్వారా ఆదా అయ్యే నీటిలో 20 టీఎంసీలను బీమా ఎత్తిపోతల పథకానికి కేటాయించి, సిడబ్ల్యూసి ఆమోదంతో నిర్మించబడింది. 11 టీఎంసీల పునరుత్పత్తి జలాలు మరియు కె.సి. కెనాల్ ఆధునికీకరణ ద్వారా ఆదా అయిన 8 టీఎంసీ, మొత్తం 19 టీఎంసీలను శ్రీశైలం కుడి బ్రాంచి కాలువకు కేటాయించి, సీడబ్ల్యూసీ ఆమోదంతో, ప్రపంచ బ్యాంకు రుణంతో నిర్మించుకున్నాం. బచావత్ ట్రిబ్యునల్ చేసిన కేటాయింపులు మరియు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన సర్దుబాటులను పరిగణనలోకి తీసుకున్న మీదట ఆంధ్రప్రదేశ్‌కు 512.04 టీఎంసీలు, తెలంగాణకు 298.96 టీఎంసీలు లభించాయి. ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు ఉన్న ఆ జాబితాను మొదటి అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. నాడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా మీరు, తెలంగాణ ముఖ్యమంత్రిగా కె. చంద్రశేఖరరావుగారు ఆ సమావేశానికి హాజరైనారు. ఆ నిర్ణయం బచావత్ ట్రిబ్యునల్ తీర్పుకు అనుగుణంగా తీసుకున్న సహేతుకమైన నిర్ణయం.
- 3. మొదటి అపెక్స్ కౌన్సిల్‌లో తీసుకున్న నిర్ణయం తాత్కాలికమైనదని బి(టి)ఆర్‌ఎస్ వక్రీకరిస్తున్నది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014, అంతర్రాష్ట్ర నదీ జలాల వివాద చట్టం-1956 ప్రకారం కేంద్ర ప్రభుత్వం బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్ గడువును పెంచి తెలంగాణ లేవనెత్తిన నీటి సమస్యపై విచారణ జరుపమని ఆదేశించింది. ట్రిబ్యునల్ ముందు తెలంగాణ ప్రభుత్వం అడ్డగోలు వాదనలు వినిపిస్తున్నది. నదీ పరివాహక ప్రాంతం నిష్పత్తిలో కృష్ణా జలాలను పంపిణీ చేయాలంటూ బచావత్ ట్రిబ్యునల్ ముందు కర్నాటక ప్రభుత్వం వాదించింది. ఆ వాదనను

బచావత్ ట్రిబ్యునల్ నిర్ద్వందంగా తిరస్కరించింది. కానీ, నేడు తెలంగాణ ప్రభుత్వం బ్రజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు అదే వాదనను వినిపిస్తున్నది. బచావత్ ట్రిబ్యునల్ తీర్పును పొరపాటున బ్రజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తిరగదోడితే అత్యంత ప్రమాదకరమైన పరిణామాలకు దారితీస్తుంది. కర్నాటక మరియు మహారాష్ట్రలు ట్రిబ్యునల్ తీర్పు కోసం ఎదురు చూస్తున్నాయని గమనించాలి. పురాతనమైన కృష్ణా డెల్టా మరియు కె.సి.కెనాల్, కృష్ణా బేసిన్ పరిధిలో లేని నాగార్జునసాగర్ కుడి కాలువ ఆయకట్టు భాగాలకు మరియు ఎస్సార్బీసీకి నికర జలాల కేటాయింపును రద్దు చేసి, ఆ నీటిని తెలంగాణకు కేటాయించాలని, తెలుగుగంగ, గాలేరు-నగరి, హంద్రీ-నీవా, వెలిగొండ ప్రాజెక్టులు కృష్ణా బేసిన్‌లో లేవని, వాటికి నీటిని కేటాయించడానికి వీల్లేదని బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు తెలంగాణ ప్రభుత్వం వాదనలు వినిపించింది. పోలవరం నుండి ప్రకాశం బ్యారేజీకి తరలించే 80 టీఎంసీలలో మహారాష్ట్ర మరియు కర్ణాటక వాటా 35 టీఎంసీలు పోను, మిగిలిన 45 టీఎంసీలను తెలంగాణకు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నది. ఉమ్మడి రాష్ట్రంలోనే కృష్ణా డెల్టా ఆధునికీకరణ పథకం ద్వారా ఆదా అవుతాయని అంచనా వేసిన 20 టీఎంసీలను తెలంగాణలో నిర్మించబడిన బీమా ఎత్తిపోతల పథకానికి కేటాయించబడ్డాయి. క్రిష్ణా డెల్టా ఆధునికీకరణ పథకం ఇంకా పూర్తి కాలేదు. కానీ, బీమా పథకానికి సర్దుబాటు చేసిన నీటిని తెలంగాణ వాడుకొంటున్నది. ఈ వాస్తవాన్ని పరిగణలోకి తీసుకోవడం లేదు. కృష్ణా జలాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ హక్కుల పరిరక్షణ నేడు పెను సవాల్‌గా పరిణమించింది. ఈ విషయంలో రాజీలేని పోరాటం చేసి, కృష్ణా జలాలకు సంబంధించి బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ద్వారా సంక్రమించిన నీటి హక్కులను పరిరక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

- 4.1980 నుండి అమల్లోకి వచ్చిన గోదావరి నది జల వివాదాల ట్రిబ్యునల్ (బచావత్ ట్రిబ్యునల్) తీర్పు ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 1172.78 టీఎంసీలు కేటాయింపు లభించింది. నాటి మధ్యప్రదేశ్ (ప్రస్తుతం మధ్యప్రదేశ్, ఛత్తీస్ఘడ్) నిర్మించే భోపాల్‌పట్నం జల విద్యుత్ కేంద్రం వినియోగం తర్వాత కిందికి ప్రవహించే 192 టీఎంసీలు మరియు 108.50 టీఎంసీల పునరుత్పత్తి జలాలతో కలిపి మొత్తం 1473.28 టీఎంసీలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు దక్కాయి. గోదావరి ట్రిబ్యునల్ ప్రాజెక్టుల వారిగా కనబరిచిన కేటాయింపులు మరియు చిన్న నీటివనరుల వినియోగం పద్దు కింది చూపెట్టిన నీటిని కలిపితే కొంత అస్పష్టంగా ఉన్నప్పటికీ తెలంగాణకు దాదాపు 800 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు దాదాపు 680 టీఎంసీలు ఉన్నట్లు లెక్కతేలుతున్నది. ఈ వాస్తవాలను మరుగుపరుస్తూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గోదావరి జలాల్లో 1000 టీఎంసీలు తమకు ఇవ్వాలంటూ డిమాండ్ చేయడం చూస్తుంటే పురాతనమైన గోదావరి డెల్టాకు 300 టీఎంసీలు, నిర్మాణంలో ఉన్న పోలవరానికి 300 టీఎంసీల నికర జలాలు లాభిస్తాయా! అన్న ప్రశ్న తలెత్తుతున్నది. గోదావరి నదీ జలాల అంశం తీవ్ర రూపం దాల్చుతున్న దనిపిస్తున్నది. రాజ్యాంగం, చట్టాలు, ట్రిబ్యునల్ తీర్పులు, అత్యున్నత న్యాయస్థానం తీర్పులే శిరోధార్యం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నదీ జలాల వివాదానికి ముగింపు పలకాలంటే తాము కోరుతున్నట్లు నీటిని కేటాయించాలని తెలంగాణ "బ్లాక్‌మెయిల్" చేయడం, ప్రజాస్వామ్య వ్యవస్థలో చెల్లుబాటు కాదన్న విషయాన్ని విస్పష్టంగా తెలియజేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము.
- 5.కృష్ణా, గోదావరి నదులపై ఉన్న ట్రిబ్యునల్ తీర్పులను, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని ఉల్లంఘించి తెలంగాణ నిర్మిస్తున్న అన్ని ప్రాజెక్టులను మనం వ్యతిరేకించాలి. తెలంగాణ నిర్మిస్తున్న ప్రాజెక్టులను వ్యతిరేకించడం లేదన్న మీ వ్యాఖ్యలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. 2021 అక్టోబరు 14 నుండి అమల్లో ఉన్న కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో స్పష్టంగా అనుమతిలేని ప్రాజెక్టుల జాబితాను వెల్లడించారు. అందులో పాలమూరు - రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల, కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా అదనంగా ఒక టీఎంసీ తరలింపు, వగైరా భారీ మరియు మధ్య తరహా ప్రాజెక్టులున్నాయి. వాటిని వ్యతిరేకించకపోతే ఆంధ్రప్రదేశ్‌కు తీవ్రనష్టం వాటిల్లుతుంది.
- 6. 29 టీఎంసీల కృష్ణా నది మిగులు జలాల ఆధారంగా ఎన్టీఆర్ ప్రభుత్వం చేపట్టిన తెలుగు గంగ నిర్మాణం అత్యధిక భాగం పూర్తి కావడంతో బ్రజేష్‌కుమార్ ట్రిబ్యునల్ 25 టీఎంసీల కృష్ణా సగటు నీటి లభ్యత జలాలను కేటాయించింది. 40 టీఎంసీల కృష్ణా మిగులు జలాల ఆధారంగా నిర్మాణంలో ఉన్న హంద్రీ-నీవా సుజల స్రవంతి మరియు 38 టీఎంసీల కృష్ణా మిగులు జలాల ఆధారంగా నిర్మాణంలో ఉన్న గాలేరు నగరి సుజల స్రవంతికి ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 రక్షణ కల్పించింది. చట్టంలో ప్రస్తావించిన తెలుగు గంగ, హంద్రీ-నీవా, గాలేరు-నగరి, వెలిగొండ ప్రాజెక్టుల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలి.
- 7.శ్రీశైలం రిజర్వాయరుకు వరద ప్రవాహ రోజులు తగ్గిపోయిన నేపథ్యంలో హంద్రీ - నీవా ప్రధాన కాలువను 6100 క్యూసెక్కుల సామర్థ్యంతో విస్తరించడానికి మీరు గతంలో పరిపాలనా అనుమతి ఇచ్చారు. ప్రస్తుతం ప్రధాన కాలువ విస్తరణ చేయకుండానే లైనింగ్ పనులు చేస్తున్నారు. లైనింగ్ పనులు చేయడం మంచిదే. కానీ, నిర్దేశిత లక్ష్యాలు

నెరవేరవు. భవిష్యత్తులో విస్తరించాలంటే కనీసం ఒకవైపైనా కాలువ గట్టును, పలు నిర్మాణాలను పగలగొట్టాల్సి వస్తుంది. ప్రజాధనం వృథా అవుతుంది. గాలేరు-నగరి రెండవ దశలో భాగమైన కడప-కోడూరు భాగం నిర్మాణాన్ని పూర్తిగా అటకె క్కించారు. ఇది అత్యంత దారుణం. అతి ముఖ్యమైన శ్రీశైలం కుడి బ్రాంచి కాలువకు గుండెకాయలాంటి గోరకల్లు నిర్మా ణాన్ని అసంపూర్తిగా, నాసిరకంగా చేయడంతో గరిష్ట స్థాయి లో నీటిని నిల్వ చేయలేని దుస్థితి నెలకొన్నది. ఆ రిజర్వా యరు ప్రమాదపుటంచున ఉన్నదన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. వినియోగంలో ఉన్న పురాతనమైన పలు ప్రాజెక్టులు మరమ్మతులకు నోచుకోలేదు. ఈ అంశాలపైన మీరు ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

- 8. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, నిర్మాణంలో ఉన్న వంశధార, వంశధార నాగావళి అనుసంధాన పథకం, తోటపల్లి బ్యారే జీ, తదితర ప్రాజెక్టుల నిర్మాణాలను సత్వరం పూర్తిచేయాలి. వంశధార జలాలపై ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు అమల్లోకి రాకపోవడం పర్యవసానంగా నష్టం జరుగుతున్నది.
- 9. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వానికి ముందస్తు సాధ్యా సాధ్యాల నివేదికను సమర్పించిన గోదావరి బనకచెర్ల పథకం కృష్ణా జలాల హక్కులకు ప్రమాదం తెచ్చిపెట్టేదిగా ఉన్నదని బలంగా భావిస్తున్నాము. పోలవరం కుడి కాలువ ద్వారా ప్రస్తుతం పట్టిసీమ నుంచి 80 టీఎంసీలు ప్రకాశం బ్యారేజీకి తరలించబడుతున్నాయి, భవిష్యత్తులో పోలవరం జలాశయం నుండి అందించబడతాయి. క్రిష్ణా డెల్టా ఆయకట్టు స్థిరీకర ణకు ఆ నీటితోపాటు పులిచింతల నీళ్లు అందుబాటులో ఉన్నాయి. ప్రతిపాదిత పథకం ప్రకారం మొదటి దశలో పోల వరం జలాశయం నుండి 40 మీటర్ల ఎత్తు నుంచి రోజుకు రెండు టీఎంసీల చొప్పున తాడిపూడి ఎత్తిపోతల పథకం మీదుగా పోలవరం కుడి కాలువకు దిగువన సమాంతరంగా వరద కాలువను తవ్వి 200 టీఎంసీలను ప్రకాశం బ్యారేజీకి చేర్చుతామని ఆ నివేదికలో పేర్కొంది. గత ఏడాది బుడమేరు డైవర్షన్ కెనాల్ ద్వారా ప్రవహించిన బుడమేరు వరద నీరు, కృష్ణా నది ఉధృతంగా ప్రవహిస్తుండడం మూలంగా ప్రకాశం బ్యారేజీలోకి చేరలేక ఎగదన్ని కాలువకు భారీ గండ్లుపడి, విజయవాడను ముంచింది. మీ నాయకత్వంలో ఆ విపత్తు సహాయ కార్యక్రమాలను సమర్థవంతంగా చేపట్టి, ప్రజలను ఆదుకున్నారు. అలాంటి ప్రమాదాలు భవిష్యత్తులో పునరా వృతం కాకుండా ఉండాలంటే గోదావరి వరద జలాలను ప్రకాశం బ్యారేజీ ద్వారా తరలించే పథకంపై పునరాలోచిం చుకోవాలని కోరుతున్నాము. పైపెచ్చు, గోదావరి నీటిని, క్రిష్ణా నదిలో కలిపితే బచావత్ ట్రిబ్యునల్ తీర్పును వాడు కుని, వాటా అడిగే అవకాశాన్ని పైరాష్ట్రాలకు ఇచ్చినట్లు అవుతుందని భావిస్తున్నాము.
- 10. గోదావరి-పెన్నా అనుసంధానాన్ని, పోలవరం- సోమశి ల అనుసంధాన పథకంగా పోలవరం కుడి కాలువకు ఎగువ భాగంలో చింతలపూడి ఎత్తిపోతల ఆయకట్టు మరియు నాగార్జునసాగర్ ఎడమ కాలువ ఆయకట్టుకు నీరందిస్తూ, వైకుంఠాపురం వద్ద క్రిష్ణా నదిని, అటుపై నాగార్జునసాగర్ ను అక్విడెక్ట్ ద్వారా దాటించి, నూతనంగా నిర్మించతలపెట్టిన బొల్లాపల్లి జలాశయానికి చేర్చడం ఎంతో ప్రయోజనకరమని భావిస్తున్నాము. ఈ పథకం ద్వారా క్రిష్ణా డెల్టా మరియు నాగార్జునసాగర్ కుడి కాలువ ఆయకట్టు స్థిరీకరణకు నీటిని అందించడం ద్వారా క్రిష్ణా జలాలను ఆదాచేసి, శ్రీశైలం జలాశయం మీద ఆధారపడి నిర్మించిన మరియు నిర్మాణం లో వున్న రాయలసీమ ప్రాజెక్టులకు గ్రావిటీ మీద అందించ డానికి అవసరమైన మౌలికమైన ప్రధాన కాలువలు, రిజర్వా యర్లు నిర్మించబడి ఉన్నాయి. గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇచ్చిన ప్రధాన కాలువల విస్తరణ పనులను సత్వరం పూర్తిచేయాలి.
- 11. గోదావరి బనకచెర్ల పథకాన్ని కేసీఆర్ జగన్మోహన్ రెడ్డి ఒక గుత్తేదారు సంస్థ అధినేత మధ్యవర్తిత్వంతో పుట్టుకొచ్చిన పథకమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానిం చారు. అది వాస్తవం కూడా. ఆ పథకంపై మీరు అడుగు ముందుకు వేస్తే మీ ప్రతిష్ఠకు భంగం కలుగుతుందని భావిస్తున్నాం. బనకచెర్ల క్రాస్ రెగ్యులేటర్‌తో ముడిపెట్టే ఈ పథకం కృష్ణా జలాలపై ఆంధ్రప్రదేశ్ హక్కులకు, మరీ ప్రత్యేకంగా కరవు పీడిత రాయలసీమ నీటి హక్కులకు ప్రమాదకారిగా పరిణమిస్తుంది. దాన్ని విరమించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాము.
- 12. పోలవరం సోమశిల పథకంగా చేపట్టి బొల్లాపల్లి రిజర్వా యరు మీదుగా ప్రకాశం జిల్లాలోని నాగార్జునసాగర్ రెండవ దశ ప్రతిపాదిత ఆయకట్టుకు, వెలిగొండ ప్రాజెక్టు ప్రధాన రిజర్వాయరు నల్లమలసాగర్‌కు నీటిని అందిస్తూ, సోమశి లకు అనుసంధానించి, సోమశిల ఆయకట్టుకు, కండలేరు ద్వారా నెల్లూరు మరియు తిరుపతి జిల్లాల్లోని తెలుగు గంగ మరియు గాలేరు నగరి ప్రాజెక్టు కింద ప్రతిపాదించిన ఆయ కట్టుకు నీటిని అందించవచ్చు. తద్వారా క్రిష్ణా జలాలపై వత్తిడి తగ్గించవచ్చు, పెన్నా నీటిని ఆదా చేసి, రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని అందించవచ్చు. ఈ మా ఆలోచనలను మీతో పంచుకుంటున్నాము. మీరు సానుకూలంగా స్పందిం చి, లోతుగా పరిశీలించి, సముచితమైన నిర్ణయం తీసుకుం టారని ఆశిస్తున్నాము. ❑

**ఎ.బి.వెంకటేశ్వరరావు, టి.లక్ష్మీనారాయణ,**
**కంభంపాటి పాపారావు, అక్కినేని భవానీప్రసాద్.**

# బీఆర్ అంబేద్కర్ మార్గం : దేశంలో సామ్యవాద ఆర్థిక అభివృద్ధి

- డా కత్తి పద్మారావు



**భారతదేశం ఆర్థికంగా, సాంఘికంగా అభివృద్ధి చెందాలంటే.. ఆర్థిక ఉత్పత్తులను ఇతర దేశాలకు పంపే సామర్థ్యాన్ని పెంచుకోవాలంటే అంబేద్కర్ ఆలోచనలు, రాజ్యాంగ సూత్రాలే ప్రధాన వాహికగా నిలుస్తాయి. భారతదేశం ఈనాడు నిరుద్యోగంలో, నిరక్షరాస్యతలో కొట్టుమిట్టాడుతోంది. కానీ బీఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగకర్తగా గొప్ప ఆర్థిక శాస్త్రవేత్తగా ఆయన మన ముందుకు అనేక రాజ్యాంగ సూత్రాలను తెచ్చారు. వాటిని మనం ఇప్పటికైనా పాటించగలిగితే భారతదేశం ఆర్థికంగా, విద్యాపరంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతుంది. దీని వల్ల సామాజిక ఆర్థిక ఉత్పత్తులు బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్‌కు ఎగుమతి చేయగలిగిన స్థాయికి ఇంకా ఎక్కువ చేరుకుంటుందనేది చారిత్రక సత్యం.**

నిజానికి భారతదేశం సంపన్నమైనదని అంబేద్కర్ అనేక ఉపన్యాసాలలో, రచనల్లో నిర్ధారించారు. భారతదేశంలోని నదులను ప్రక్షాళన చేసి వాటికి సరైన ప్రాజెక్టులను రూపొందించాలని ఆయన అన్నారు. త్రాగునీరు, సాగునీరు పుష్కలం చేసి వ్యవసాయ ఉత్పత్తులు పెంచాలని పిలుపునిచ్చారు. వాటిని ఇతర దేశాలకు ఉత్పత్తుల ఎగుమతి పెంచాలంటే తప్పకుండా మనం నదులను పరిశుభ్రపరిచి ఉత్పత్తికి అనుకూలంగా మలచవలసి ఉంది. నదులను పవిత్రంగా భావించి హారతులిస్తూ, నదీ స్నానాలను పుణ్యప్రదంగా భావించే దేశం మనది.

అంతేకాదు దేశంలో సుమారు 603 నదులలో 279 నదులు కాలుష్యమయంగా ఉన్నాయని 2019, 2021 సంవత్సరాలలో సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిర్ధారించింది. ఫ్యాక్టరీలు వదిలే వ్యర్థాలు, డ్రెయినేజ్‌ల ప్రవాహాలు, జంతు కళేబరాలు, ప్లాస్టిక్ వస్తువులు మొదలైన వాటితో అనేక నదులు నిండిపోతున్నాయి. విషతుల్యమౌతున్న ఈ నదీ జలాలనే సాగు, తాగు నీరుగా వినియోగిస్తూ ప్రజలు రోగాల పాలౌతున్నారు. గంగ, గోదావరి, యమున, మూసీ నదులు ఇందుకు ప్రధాన ఉదాహరణలుగా నిలుస్తాయి.

థాయ్లాండ్, మలేషియా, వియత్నాం వంటి చిన్నదేశాల నదుల ప్రక్షాళనను ఆదర్శంగా తీసుకొని మన ప్రభుత్వం మన దేశ నదులను యుద్ధప్రాతిపదికన శుద్ధి చేయించాలి. నదులను



కాలుష్యమయం చేస్తున్న సంస్థలు, ఫ్యాక్టరీలు, పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలి. దేశ ప్రజలకు పరిశుభ్రమైన ఆరోగ్యకరమైన త్రాగు, సాగు నీటిని అందించాలి. ఆర్టికల్ 39(బీ) ప్రకారం సహజ వనరులపై ప్రజల హక్కును ప్రభుత్వం కాపాడుతుందని ఆశిద్దాం. నిజానికి మనదేశం నదుల సముద్రాల దేశం. అందుకే భారతదేశం అనేక దేశాల చేత ఆకర్షించబడింది. ఆక్రమించబడింది. ప్రపంచ నాగరికతల్లో అత్యున్నతమైన నదీ నాగరికత, మానవ పరిణామానికి మూల శక్తిగా నిలిచింది. భారతదేశ నదీ నాగరికత కూడా ఈజిప్ట్ నాగరికత అంత ప్రసిద్ధమైనది. నాగరికతలన్నీ నదీ తీరాల నుండే పుట్టాయి.

ప్రపంచంలోనే అత్యున్నతమైన నాగరికత కలిగిన భారతదేశం నదులకు పుట్టిల్లు. అందుకే మనం ఏ నిమిషంలోనైనా సుసంపన్నం చేసుకోవచ్చు. నిజానికి "భారతదేశంలో హిమాలయాల నుంచి కన్యాకుమారి వరకు ఎన్నో మహానదులూ, ఉపనదులూ ప్రవహిస్తున్నాయి. ఇవి రెండు రకాలు మొదటిరకం హిమాలయాల గుంపు. రెండవ రకం దక్కను గుంపు. ఎప్పుడూ తుషారంతో కప్పి వున్న హిమాలయ పర్వతాలలో జన్మించిన గంగా, యమున, సింధు, బ్రహ్మపుత్ర మొదలైన జీవనదులు మొదటి రకం. భారతదేశ మధ్య ప్రాంతంలో వింధ్య, సాత్పురా పర్వతాలు దక్షిణ ప్రాంతంలో సహ్యాద్రి పర్వతాలలో పుట్టి వర్షం మీద ఆధారపడి వర్షాకాలంలో మాత్రమే నిండుగా ప్రవహించే నర్మద, తపతి, మహానది, గోదావరి, కృష్ణా, కావేరి, మంజీరాది నదులు రెండవరకం.

దక్కను ప్రాంత నదులను పీఠభూమి నదులని తీరప్రాంతపు నదులని పునర్విభజన చేయవచ్చు. తీర వర్గానికి చెందిన

నదులన్నీ చిన్నవి. భారత ప్రసిద్ధ నదులలో అధిక భాగం నదులు తూర్పుగా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తున్నాయి. సింధూ, నర్మద, తపతి మొదలైన కొన్ని నదులు మాత్రమే పడమరగా ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తున్నాయి.

భూగర్భ శాస్త్ర దృష్ట్యా హిమాలయపు నదులు దక్కను నదులకంటె తక్కువ వయస్సు కల్గినవి. అని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. భారతదేశంలోని నదులలో గంగా నది అతి ముఖ్యమైంది. ఇది హిందువులకు ఎంతో పవిత్రమైంది కూడా. ఇది హిమాలయాలలోని 'గోముఖి' అనే మంచుగుహలో పుడు తున్నది. పుట్టిన ప్రాంతంలో ఈ నది పేరు భాగీరధి. అందుకు మన భారతపాలక వర్గం ఆయా రాష్ట్రాలు నదీ నాగరికతను ఉత్తేజం చేసి, నీటి పారుదలను పెంచి దళితులకు, బహుజను లకు, స్త్రీలకు భూమిని పంపకం చేసినట్లయితే డా బీఆర్ అంబేద్కర్ చెప్పినట్లు వ్యవసాయక భూమి భారతదేశంలో విస్తృతమై దళిత బహుజనులు వ్యవసాయ ఉత్పత్తులను స్వయంగా చేయగలిగి వారిలో ఆత్మ గౌరవం పెరిగి స్వీయ జీవన సంపన్నులవుతారు.

మనుషుల వలసలు తగ్గిపోయి వస్తువుల ఉత్పత్తులు పెరిగి వ్యవసాయాధారిత సాంకేతిక పరిజ్ఞానం పెరిగి భారతీయ ఆర్థిక వ్యవస్థ సామాజిక సమతుల్యత పరిపుష్టమవుతాయి. వ్యవసాయ ఉత్పత్తుల వలన దేశంలో ఆకలి అవిద్య నశిస్తాయి. అంతేగాక మన దేశంలో ఆర్థిక అసమానతలను తగ్గించి పేదరికాన్ని తగ్గించి జీవన వ్యవస్థల్లో పరిపుష్టి తేవాలంటే అంబేద్కర్ రాజ్యాంగ సూత్రాలను అనుసరించవలసిన చారిత్రక అవసరం ఉంది. ఈ క్రమంలో మనం అంబేద్కర్ పేర్కొన్న ఆర్థిక ఉత్పత్తి క్రమాన్ని అనుసరించాలి. 38వ ఆర్టికల్ ప్రకారం ధనికుల్లో, పేరుకుపోతున్న అవినీతిని నిర్మూలించి పేదలకు ఉద్యోగ అవకా శాలు పరిపుష్టం చేసి రాజ్యాంగంలో దాగివున్న సామ్యవాద భావజాలానికి మనం పట్టం కట్టాలి.

నిజానికి డా బీఆర్ అంబేద్కర్ పరిశోధన కృషి ఆర్థిక సామ్య వాదం మీదే వుంది. అందుకే ఆయన వ్యవసాయం తరువాత దేశాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని తన సామాజిక, రాజకీయ, ఆర్థిక ప్రణాళికల్లో నొక్కి వక్కాణించారు. అవి ఇప్పుడు మన దేశ పునరుజ్జీవన ఉద్యమానికి మూలశక్తిగా నిల బడతాయి. దేశాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాల్సి ఉందని అంబేద్కర్ అన్నారు.

పరిశ్రమల్లో ప్రభుత్వ యాజమాన్యం, ప్రభుత్వ నిర్వహణ సిద్ధాంతాన్ని అమలు చెయ్యాలి. పరిశ్రమ అభివృద్ధి చెందడానికి సామాజిక బీమా, ఉపాధిపై అదుపు, అలాగే ఉద్యోగాల తొలగిం పుపై నియంత్రణ కలిగి ఉండటం వంటి సదుపాయాలు కల్పిం చడం అవసరం. ఈ చర్యలు తీసుకునే సమయంలో మధ్య తరగతిలో దిగువ శ్రేణి వారి గురించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. జీవిత బీమా, బస్ రవాణా రంగాలను జాతీయం చేయాలని ఆయన సూచించారు. మనిషిని మనిషి, ఒక వర్గాన్ని మరో వర్గం, ఒక దేశాన్ని మరో దేశం అణిచివేయడం, దోపిడీ చేయడాన్ని అంతమొందించేందుకు కృషి చేయగలనని షెడ్యూల్డ్ కులాల సమాఖ్య (1952) తన ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చింది. అత్యవసరమైతే పరిశ్రమలు జాతీయీకరణకు అది మద్దతు తెలిపింది. నిధుల సేకరణకు అంబేద్కర్ ఈ సూచనలు చేశారు. (1) సైన్యంపై వ్యయం తగ్గింపు (2) అమ్మకం పన్నుపై తిరిగి లెవీ విధించడం (3) మద్యపాన నిషేధం రద్దు చెయ్యడం, ఎక్సైజ్ ఆదాయాన్ని పొదుపు చెయ్యడం(4) బీమా రంగాన్ని జాతీయ చెయ్యడం (5) ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు నిర్బంధ బీమా, ఆర్థిక శక్తి కేంద్రీకరణ కాకుండా ఉండేందుకు అంబేద్కర్ రెండు మార్గదర్శక సూత్రాలు ప్రతిపాదించారు. అవి (1) ఉమ్మడి ప్రయోజనం సిద్ధించేలా భౌతిక వనరుల యాజమాన్యం, నిర్వహణను పంపిణీ చెయ్యడం (2) సంపద ఒక చోట కేంద్రీకృతం కాకుండా, ఉత్పత్తికి విఘాతం కల్పించకుండా ఉండే విధంగా ఆర్థిక వ్యవస్థను నిర్వహించడం, నిర్బంధ శ్రమ, బాల కార్మిక వ్యవస్థను రాజ్యాంగం నిషేధించింది. ఆస్తి హక్కులు హామీ ఇవ్వబడ్డాయి. పని చేసేందుకు అందరికీ సమాన హక్కు సమాన పనికి సమాన వేతనం, పురుషులు, మహిళల జీవన భృతికి సమాన హక్కులు, ఇకపోతే అంబేద్కర్ నిజమైన జాతీయ వాది, దేశభక్తి గలవాడు, ఒక గొప్ప మేధావి అనేక దేశాల్లో ఖండాలలో ఆయన ఆర్జించిన జ్ఞానాన్ని అంతా భారతదేశ పునరుజ్జీవనానికి ఉపయుక్తం చేశారు. ఆయన నిక్కచ్చితనం, నిజాయితీ, మానవతా దృక్పథం సామ్యవాద భావజాలం అసమానమైనవి.

అంబేద్కర్ కేవలం సామాజిక దార్శనికుడు కాదు. అంబేద్కర్ ఆర్థికశాస్త్రం మీద పరిశోధన చేసిన డిఆర్ జాదవ్ తన సోషల్ ఫిలాసఫి అనే గ్రంథంలో అంబేద్కర్ ఆర్థిక విప్లవం గురించి ఇలా విశ్లేషించారు. సమాజంలో ఆర్థిక విప్లవం తప్పనిసరిగా రాజకీయ విప్లవంతో ముడిపడి వుంది. అందుకే అంబేద్కర్ ఆర్థిక సామాజిక రాజకీయ విప్లవాలను ఒకే కాలంలో ప్రారంభించారు. రాజకీయ విప్లవానికి ఇచ్చిన ప్రాధాన్యతను ఆయన తాత్విక విప్లవానికి యిచ్చి రెండింటిని ఏకకాలంలో నడిపించారు. బౌద్ధ విప్లవం రక్త పాత రహిత విప్లవమని, బౌద్ధ తాత్విక విప్లవం పునాదిగా చేసుకుని సమాజంలో మార్పు తీసుకురావాలనేది ఆయన దృఢనిశ్చయం. అంబేద్కర్ భారత దేశంలో అత్యున్నతమైన సామ్యవాది, ఆయన ఈ సందర్భంగా భారతదేశం పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలంటే సమిష్టి వ్యవసాయ క్షేత్రాలు కావాలని కమ్యూనిస్టు నాయకుడు దాంగేతో చర్చించారు. సోషలిస్టులతోను, కమ్యూనిస్టులతోను, హేతువాదు లతోను, హిందూ సంస్కరణ వాదులతోను అంబేద్కర్ చర్చలు

జరిపారు. అంబేద్కర్ సామ్యవాద ప్రజాస్వామ్యవాది ఆయన కార్ల్ మార్క్స్ సిద్ధాంతంలోని కార్మికవర్గ నియంతృత్వ స్థాపనకు హింసా మార్గం, బలప్రయోగమే మూలమనే దాన్ని వ్యతిరేకిం చారు. సామ్యవాదాన్ని బౌద్ధ సిద్ధాంత మార్గంలో సాధించాలని నొక్కి వక్కాణించారు. అంబేద్కర్ ఈ సందర్భంగా ఏ సిద్ధాంతా న్నైనా ఒక దేశపు సామాజిక ఆర్థిక రాజకీయ పరిస్థితులకు సమన్వయించేటపుడు ఆ దేశ చారిత్రక, భౌతిక పరిస్థితులను శాస్త్రీయ పద్ధతుల్లో అర్థం చేసుకోవలసిన అవసరం వుంది. ఈ దేశంలో సామాజిక విప్లవాన్ని విజయవంతం చేయడానికి పనిచేస్తున్న మార్క్సిస్టులు, లెనినిస్టులు, అంబేద్కరిస్టులు ఈనాటి చారిత్రక పరిస్థితులను వారి దృష్టిలో వుంచుకొని ఈ సిద్ధాం తాలను సమన్వయం చేసుకోవలసిన అవసరాన్ని గుర్తించాలి. అంబేద్కర్ బౌద్ధ ధర్మాన్ని పునర్నిర్మించి ఆచరించాడు.

మార్క్సిజాన్ని శాస్త్రీయ పద్ధతిలో అవగాహన చేసుకొని ఆ రెండు సిద్ధాంతాలకు వుండే సమన్వయాన్ని, వైరుధ్యాలను మన ముందుంచాడు. ఆయన వంతుగా ఆచరణకు సంబంధించి బౌద్ధాన్ని సమర్థించాడు. తనకు తానుగా ప్రజాస్వామిక సిద్ధాంత వాదిగా ముందుకు వచ్చాడు. ఈనాడు సమసమాజం కోసం కృషి చేస్తున్న శక్తులు బుద్ధుడు, మార్క్స్ లక్ష్యసాధనలో వున్న సమన్వయాలను, వైరుధ్యాలను అవగాహనలోకి తీసుకొని అంబేద్కర్ చారిత్రక అవగాహనతో ఆ రెండు సిద్ధాంతాల మీద యిచ్చిన వివరణలు, వ్యాఖ్యలు సమన్వయాలు, వైరుధ్యాలు, ఆచరణలను అధ్యయనం చేయాలి. ఈనాటి పీడిత వర్గ విముక్తి పోరాటాన్ని ముందుకు తీసుకుపోవడానికి ఆ అధ్యయనాన్ని ఆచరణలో ఆయుధంగా చేసుకోవలసిన అవసరాన్ని గుర్తించకపోతే పోరాటంలో విజయాన్ని సాధించడం దుర్లభం.

సమసమాజ స్థాపనలో, దాని కొనసాగింపులో, నియంతృ త్వంలో మృగ్యమవుతున్న ప్రజాస్వామ్యాన్ని, ప్రజాస్వామ్యం పేరుతో కొనసాగుతున్న నియంతృత్వాన్ని నిరోధించినపుడే సత్ఫలితాలు చేకూరుతాయని అంబేద్కర్ తన బుద్ధుడు- మార్క్స్ తులనాత్మక పరిశీలనలో నిగ్గు తేల్చిన చారిత్రక సత్యం. నిజానికి అంబేద్కర్ ఆర్థిక సామ్యవాద సామాజిక సిద్ధాంతాలు ఈనాడు భారతదేశానికి శిరోధార్యం, మనందరం జాతీయవాదులం, ఎన్నో పోరాటాలతో స్వాతంత్ర ఉద్యమంలో మన దేశానికి స్వాతంత్ర్యం తెచ్చుకున్నాం. దీన్ని ఆర్థిక, సామ్యవాద, సామాజిక, సమతుల్యతలను రాజ్యాంగ బద్ధంగా అంబేద్కర్ ఆలోచనల్లో సిద్ధాంతాలతో పరిపుష్టం చేసుకోవడం ద్వారా ప్రపంచంలోనే అత్యున్నత ఆర్థికాభివృద్ధి కలిగిన దేశంగా రూపొందించుకోగలు గుతాం. రాజ్యాంగకర్త ఆలోచనలలో నడుద్దాం. దేశ ప్రగతికి సోపానం నిర్మిద్దాం. అంబేద్కర్ ఆలోచన విధానమే దేశ ఆర్థికాభి వృద్ధి మార్గం. ❑

# అమృతోత్సవం!


**అప్పుడు**  
**దేవతలు**  
**రాక్షసులు!**  
**ఇప్పుడు**  
**కార్పొరేట్లు**  
**ప్రజలు!**  
**ప్రజలంటే**  
**శ్రమజీవులు**  
**బుద్ధిజీవులు!**  
**దేవ దానవులు**  
**సముద్ర మథనం చేసి**  
**అమృతం తీశారు!**  
**ప్రజలు**  
**దేశ మథనం చేసి**  
**సంపదలు తీశారు!**  
**అమృతం పంపకం**  
**రాజకీయం చేసి**  
**దేవతలు కొట్టేసారు!**  
**సంపద పంపకం**  
**రాజకీయం చేసి**  
**కార్పొరేట్లు కొట్టేసారు!**  
**అక్కడ**  
**త్రిమూర్తులు**  
**సూత్రధారులు!**  
**ఇక్కడ**  
**నాయకులు**  
**సూత్రధారులు!**  
**నా దేశం ఎప్పుడూ**  
**పరాన్నభుక్కుల**  
**అమృతోత్సవం!**

**– తమ్మినేని అక్కిరాజు, హైదరాబాద్**

# ఫాసిజంతో పోరాడిన చిత్రకళ

- ఫియోనా మెక్‌డొనాల్డ్

**1937లో స్పెయిన్ అంతర్యుద్ధం నడుమ ప్రారంభమైన పారిస్ చిత్రకళా ప్రదర్శనలో పలువురు చిత్ర లేఖకులు ఫాసిజం దాష్టీకానికి వ్యతిరేకంగా గళమెత్తారు. చిత్రకళలు నిర్దిష్ట రాజకీయ వ్యక్తీకరణలుగా మారిన నేపథ్యాన్ని ఫియోనా ఈ వ్యాసంలో చర్చించారు. జర్మనీ, ఇటలీ ఫాసిస్టు దళాలు 1937 ఏప్రిల్ 26న స్పెయిన్‌లోని గెర్నికా నగరంపై బాంబుల వర్షం కురిపించాయి. స్పెయిన్‌లో చారిత్రక నగరాల్లో ఒకటైన గెర్నికాను కేవలం మూడే మూడు గంటల్లో నాజీ సేనలు భస్మీ పటలం చేశాయి. అప్పట్లో అంత తక్కువ సమయంలో ఓ నగరాన్ని నేలమట్టం చేయటమన్నది యుద్ధాల చరిత్రలో అరుదైన రికార్డు. ఈ యుద్ధాన్ని కళ్లారాచూసి చలించిన పికాసో గీసిన చిత్రమే ప్రపంచ ప్రసిద్ధి గాంచిన గెర్నికా. 1937లో పారిస్‌లో చిత్రలేఖన ప్రదర్శన ఏర్పాటు చేసిన కళాకారులను 2017లో జరిగిన ఓ కార్యక్రమంలో లండన్ మేయర్ ప్రత్యేకంగా సన్మానించారు.**



స్పెయిన్‌పై బాంబుదాడులు మొదలైన నెల రోజుల్లోనే పారిస్ ప్రదర్శన ఏర్పాటైంది. పారిస్ ప్రదర్శనలో రెండు చిత్రాలు సమకాలీన చరిత్రలో వైరి శిబిరాలకు ప్రతీకలుగా నిలుస్తాయి. మొదటిది నాజీ జర్మనీ కళాకారులు రూపొందించిన చిత్రం. ఈ చిత్రంలో నాజీ అధికారిక చిహ్నమైన స్వస్తిక, దానిపై ఎగురుతున్న గద్ద. ఈ రెండు భారీ ఇనుప సామగ్రి తాపడం చేసిన గ్రానైట్‌పై చిత్రించారు. రెండోది స్త్రీ పురుషులైన కార్మికులు సుత్తి కొడవలిని పిడికిళ్లతో ఎత్తిపట్టిన చిత్రం. సైజులో చిన్నవైనా ఈ ప్రదర్శనలో ప్రేక్షకులకు అందుబాటులో ఉంచిన అనేక చిన్న చిన్న చిత్ర లేఖనాలు సైతం చూపరులను ఆకర్షించాయి. పారిస్ ప్రదర్శన 80 ఏళ్ల సందర్భంగా 80 ఏళ్ల క్రితం ప్రదర్శనలో ప్రేక్షకుల సందర్శనార్థం పెట్టిన అన్ని చిత్ర పటాలనూ లండన్ ప్రదర్శనలో వీక్షకులకు అందుబాటులో ఉంచారు. నాటి పారిస్ ప్రదర్శన ఓ రాజకీయ సందేశాన్ని ప్రపంచం ముందు ఉంచింది. అది జనరల్ ఫ్రాంకో నిరంకుశత్వానికి సంబంధించిన జ్ఞాపకాలు.

సృజనాత్మక కళల్లో నాజీ జర్మనీ, సోవియట్ యూనియన్‌ల మధ్య ఉన్న ఆధిపత్య పోరును పక్కన పెడితే అప్పటికే రెండో ప్రపంచయుద్ధం స్పెయిన్‌ను అగ్నికి ఆహుతి చేస్తున్న సందర్భం కావటంలో వీక్షకుల దృష్టి స్పెయిన్‌కు సంబంధించిన చిత్రాలపై కేంద్రీకృతమైంది. ఈ యుద్ధంలో భాగంగా స్పెయిన్ అటు నాజీ శ్రేణులు, ఇటు సోవియట్ దళాల మధ్య బాహాబాహీకి వేదికైంది. ఈ సంచలనాత్మక యుద్ధం ప్రపంచంలో మెరికల్లాంటి సృజనాత్మక కళాకారుల మెదళ్లకు పదును పెట్టింది. పాబ్లో పికాస్సో, జూలియో గొంజాలెజ్, జోవాన్ మిరో, అలెగ్జాండర్ క్లాడెర్, అల్బెర్టో శాంచెజ్, జోస్ గుటిరెజ్ సోలన్ వంటి కళా కారులు అద్భుతమైన కళాఖండాలు సృష్టించారు. వీటన్నింటినీ స్పెయిన్ పెవెలియన్‌లో ప్రదర్శనకు పెట్టారు.

ఈ పెవెలియన్ కోసం ఓ కుడ్య చిత్రాన్ని రూపొందించాల్సిందిగా నిర్వాహకులు పికాసోను కోరారు. దాంతో ఫ్రాంకో కట్టు కథల మోసాన్ని బహిర్గపర్చే రీతిలో జాతీయోన్మాద వ్యతిరేక కథనంతో కూడిన చిత్రాల తయారీకి పికాసో పూనుకున్నాడు. గెర్నికా నగరంపై దాడి గురించిన వార్తలు చదివిన తర్వాత ఫ్రాంకో ఫాసిస్టు శక్తులపై సాంస్కృతిక పోరాట చిహ్నంగా ఓ చిత్రాన్ని గీయటం ప్రారంభించారు. “చరిత్రలో మొదటిసారి

తమ యుద్ధ తంత్రం సాఫల్యతను నిరూపించుకోవడానికి ఏకంగా ఓ నగరాన్నే భూస్థాపితం చేసిన సందర్భమే గెర్నికాపై దాడి” అని కళా చరిత్రకారుడు మార్టిన్ వ్యాఖ్యానించారు. ఆ వార్తలు విన్న వెంటనే తన కుడ్య చిత్రం ఎలా రూపొందించాలో పికాసో నిర్ణయించుకున్నారని ఆయన అన్నారు.

2017లో లండన్‌లో మేయర్ చొరవతో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో పికాసో చిత్రాన్ని వీక్షకులకు అందుబాటులో తేలేకపోయినా పికాసో స్నేహితురాలు దోరా మార్ పికాసో ఆ చిత్రరూపకల్పన సమయంలో తీసిన ఫోటోలను ప్రదర్శించారు. ఈ కుడ్య చిత్రాన్ని పూర్తి చేయటానికి పికాసో నెల రోజుల సమయం తీసుకున్నారు. ఈ చిత్ర రూపకల్పన సమయంలో పికాసో జాతీయోన్మాద ఫ్రాంకోను సమర్ధిస్తున్నారంటూ వచ్చిన వార్తలను ఖండిస్తూ “నేను రూపొందిస్తున్న చిత్రాన్ని గెర్నికా అని పిలుస్తాను. ఈ చిత్రంలో ఫ్రాంకో సైన్యపు యుద్ధతంత్రం, కుటిలత్వం, మహానగరాన్ని నేలమట్టం చేసిన ధూర్తత్వాలను బేషరతుగా ఖండిస్తూ ఈ చిత్రం రూపొందిస్తున్నాను” స్పష్టం చేశారు.

### రాజకీయ నేపథ్యం

ఈ కుడ్య చిత్రం రూపకల్పనలో పాల్గొన్న వారంతా స్పెయిన్‌పై నాజీ జర్మనీ ఇటలీల దాడిని నిరసిస్తూ తమతమ వ్యక్తిగత స్థాయిలో స్పందించాలని నిర్ణయించుకున్నారు తప్ప రాజకీయ ప్రోద్భలంతో కాదు. ఇది సృజనకారుల సహజ స్పందన అని లండన్ ఎగ్జిబిషన్ పర్యవేక్షకులు జువాన్ మాన్యుయెల్ బోనెట్ అన్నారు. 1936కి ముందు పికాసో కానీ, మీరో కానీ రాజకీయ ఆందోళనకారులేమీ కాదు. కానీ స్పెయిన్‌పై నాజీల దండయాత్ర వీరిలో రాజకీయ చైతన్యాన్ని పురికొల్పింది. 1937 నాటి కళా ఖండాలే వారి తొలి రాజకీయ వ్యక్తీకరణలు. తర్వాతి కాలంలో పికాసో 1944లో ఫ్రెంచి కమ్యూనిస్టు పార్టీలో చేరి పని చేస్తే మీరో 1960 దశకం వరకూ ఫ్రాంకో నియంతృత్వానికి వ్యతిరేకంగా సాగే ఉద్యమాల్లో క్రియాశీల భాగస్వామిగా ఉన్నారు.

ఈ కుడ్యాన్ని రూపొందించటంలో భాగస్వామి అయిన కాల్డెర్ రూపొందించిన చిత్రాలు కూడా రాజకీయ భావావేశానికి ప్రతీకలే. తొలుత ఆయన స్పెయిన్ జాతీయుడు కాకపోవటంతో తొలుత కాల్డెర్‌కు ప్రవేశాన్ని నిరాకరించినా తర్వాత నిర్వాహకులు అవకాశం ఇచ్చారు. ఒక ఫౌంటెయిన్ నుండి మెర్క్యురీని వెదజల్లేలా ఏర్పాటు చేసిన కుడ్యం కాల్డెర్ రూపొందించిందే. ఫ్రాంకో సైన్యాలు పెద్దఎత్తున మెర్క్యురీని ఉపయోగించినట్లు 1935 నాటికే ఆధారాలున్నాయి. మారణాయుధాలు తయారీలో మెర్క్యురీది కీలకపాత్ర. ఈ రకంగా చూసినప్పుడు 1937 నాటి పారిస్ ప్రదర్శనలో ప్రదర్శనకు పెట్టిన ఏ వస్తువూ రాజకీయ వ్యక్తీకరణకు, వర్తమాన సమస్యల చిత్రీకరణకు దూరంగా లేవు.

లండన్ ప్రదర్శన ఏర్పాటులో పాలుపంచుకున్న మరో చిత్రకారుడు మిరో మనుమడు పున్యంట్ మీరో. తన తాత రూపొందించిన కుడ్య చిత్రం శిథిలమైతే దానిని నమూనాను పునర్నిర్మించి లండన్‌లో ప్రదర్శించారు. ఓ రైతు తల వచ్చల్కెన చిత్రాన్ని మీరో చిత్రకారులు ప్రదర్శిస్తారు. స్పెయిన్‌లో జరిగిన దుర్ఘటనలపట్ల వ్యక్తమైన నిరసన రూపమే ఈ చిత్రం.

### ప్రచారాందోళన రూపాలుగా గెర్నికా, రీపర్

తర్వాతి కాలంలో ఈ చిత్రాలు ఫాసిజానికి వ్యతిరేకంగా సోవియట్ రష్యా రూపొందించిన ప్రచార ఆందోళన సామగ్రిలో అంతర్భాగమాయ్యయి. ఈ కుడ్య చిత్రాలన్నీ నికార్సయిన రాజకీయ ప్రచార సాధనాలుగా మారాయి. కవి జోస్ బెర్మాని అభిప్రాయంలో గెర్నికా కేవలం ఓ చిత్రం కాదు. అది ఒక గ్రాఫిటీ. మహాద్భుతమైన చిత్రకారుని కుంచె నుండి జాలువారిందని వ్యాఖ్యానించారు.

అప్పట్లో యుద్ధ కాలంలో నాశిరకం గుడ్డ మీద గీసిన ఈ కుడ్య చిత్రం ఎప్పుడో కాలగర్భంలో కలిసిపోయి ఉండేది. ఈ కళాకారులు కుడ్యచిత్రం రూపొందించేటపుడు పెవెలియన్ తీసేయగానే ఈ చిత్రం కూడా తీసేస్తారన్న అభిప్రాయంతో ఉన్నారు. కాబట్టి పెద్దగా భారీ వస్తువులు ఉపయోగించలేదు. గెర్నికా, రీపర్ చిత్రాలను తర్వాత లండన్ అక్కడ నుండి అమెరికా పంపాల్సి రావటంతో నేటికీ బతికి బట్టకట్టాయి. తర్వాత 1938 ప్రాంతంలో గెర్నికా చిత్రాన్ని యావత్ ఇంగ్లాండ్‌లో ప్రదర్శించారు. స్పెయిన్‌లో ప్రజాస్వామ్యం పునరుద్ధరించబడేంత వరకూ ఈ చిత్రాన్ని స్పెయిన్‌కు తీసుకురావద్దన్న పికాసో అభిప్రాయం నిర్దిష్టమైన రాజకీయ వ్యక్తీకరణే.

### చీకటి కోణాలు

నాటి నుంచి గెర్నికా చిత్రాన్ని అధ్యయనం చేసిన పలువురు చిత్రకారులు పలురకాల వ్యాఖ్యానాలు చేశారు. స్పెయిన్ యుద్ధాన్ని, అందులో చనిపోయిన ప్రజలను, ఛిద్రమైన గెర్నికా నగరాన్ని, దేశ భవిష్యత్తును ఏకకాలంలో ప్రతిఫలించే చిత్రం ఇది. భవిష్యత్ యుద్ధాలపై కూడా ఇది చెప్పని వ్యాఖ్యగా మిగిలిపోయింది. ఈ చిత్రం ద్వారా పికాసో చిత్రం ప్రాచీన కాలం నుండీ జరుగుతున్న యుద్ధాలు, అందులో చితికిపోయిన నగరాలు, జీవితాలను ప్రతిబింబిస్తుందని ఫ్రాన్స్‌కు చెందిన కవి మైఖేల్ లీర్స్ అభిప్రాయపడ్డారు. ఈ చిత్రంలో క్రోధం, క్షోభే కాకుండా ఆశాకిరణాన్ని కూడా ప్రదర్శిస్తుందని మార్టిన్ అన్నారు. ఈ చిత్రంలోని దీపం పట్టుకున్న మహిళే చీకటినుండి సమాజానికి వెలుగురేఖలు ప్రసరించే మార్గం ఉందని కూడా పికాసో సందేశం ఇచ్చినట్లు ఈ చిత్రం మనకు చెప్తుందని అన్నారు.

చారిత్రకంగా చూసుకున్నపుడు గెర్నికా చిత్రానికి ఓ

వారసత్వం కూడా ఉంది. ఫ్రెంచి చక్రవర్తి నెపోలియన్ స్పెయిన్‌పై దాడి చేసినపుడు దానికి నిరసనగా గోయా అనే కళాకారుడు ఓ కళాఖండాన్ని రూపొందిస్తాడు. వర్తమాన పరిణామాల నేపథ్యంలో సృజనాత్మక కళాకారులు తమ రాజకీయ భావావేశాన్ని వ్యక్తం చేయటంలో గోయా ప్రభావం సంపూర్ణంగా మరుగున పడలేదు. పికాసో కూడా గోయా చిత్ర లేఖనంతో స్ఫూర్తి పొందారు. స్పెయిన్ చరిత్రలో రాజకీయ, ధార్మిక చీకటి కోణాలపై గోయా అద్భుతమైన కాంతులు ప్రసరిస్తారని పికాసో అన్నారు. లండన్‌లోని మేయర్ గ్యాలరీ నిర్వాహకుడు జోర్డి మేయరొల్ "పికాసో, కాల్డర్, గొంజాలెజ్, మీరో వంటి వారు స్పెయిన్ యుద్ధం వంటి విపత్తు సంభవించినప్పుడు ప్రతి ఒక్కరూ నిర్దిష్ట రాజకీయ వైఖరిని ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందని మనకు బోధిస్తున్నారు" అని అభిప్రాయపడ్డారు. ఈ కళాకారులు రూపొందించిన కళా ఖండాలు నేటికీ స్పెయిన్ ప్రజల జ్ఞాపకాల్లో భద్రంగా ఉన్నాయి. ప్రజాస్వామ్యానికి, ఫాసిజానికి మధ్య జరిగిన పోరాటానికి ఈ కళా ఖండాలు ప్రతీకలు. 1937లో గెర్నికా చిత్రం పూర్తి చేసిన తర్వాత తన మనోభావాన్ని వ్యక్తపరుస్తూ "ధార్మిక భావాలు కలిగిన కళాకారులు, సృజనకారులు సార్వత్రిక మానవ విలు వలు సవాలు ఎదుర్కొంటున్న తరుణంలో తమ అభిప్రాయాలను స్పష్టం చేయటంలో వెనకాడకూడదు" అన్నారు.

**నోట్ :** కునాల్ కామ్రా చేసిన వీడియోలో ప్రభుత్వ విధానాల గురించి స్పష్టమైన అభిప్రాయాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో ఆయనపై పలురూపాల్లో దాడులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో దేశం ఓ పెద్ద ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నప్పుడు సృజనాత్మక రంగంలో ఉన్న వారు సైతం నిస్సంకోచంగా తమ అభిప్రాయాలు వ్యక్తం చేయాలంటూ పిలుపునిచ్చిన పికాసోకు నివాళి అర్పిస్తూ 2017లో బిబిసి ప్రచురించిన కథనాన్ని తెలుగు పాఠకులకు అందిస్తున్నాము.

**అనువాదం : కొండూరి వీరయ్య**

# బుద్ధుడితో నా ప్రయాణం కళారూపం

నేటి సమాజంలో ఒక పెద్ద blasting.


అంబేద్కర్ నాటకం మెల్లగా ప్రారంభం అయి సుమారు 800 ప్రదర్శనల ద్వారా మన సమాజానికి ఒక కుదుపు ఇచ్చింది.

బుద్ధుడితో నా ప్రయాణం ప్రారంభమే పెద్ద కుదుపు. పెద్ద blasting. ఇది బుద్ధుడిని, పూలేని, అంబేద్కర్‌ని ప్రేమించే అందరికీ ఒక గొప్ప సంతోషకరమైన విషయం.

బౌద్ధాన్ని ప్రజలలోకి తీసుకుని వెళ్ళే గొప్ప సాధనం. ఈ సాధనాన్ని ఊహించిన దాని కంటే ఎక్కువగా స్వంతం చేసుకున్న సామాజిక కార్యకర్తలు అందరికీ బుద్ధ వందనాలు.


ఈ కళారూపాన్ని గొప్పగా రూపొందించిన రచయిత దేవేంద్ర గారికి, అభ్యుదయ నట సమాఖ్య వారికి వందనాలు.

దీనిని ఇలా రూపొందించడానికి గొప్ప కార్యదీక్షతో, కార్య దక్షతతో ముందు ఉండి నడిపిస్తున్న కె.కె.రాజా గారికి సామాజిక వందనాలు.





**జై భీం! జై బుద్ధ!**

**రేకా చంద్రశేఖరరావు.**




తేనె తుట్ట




బ్రహ్మ పదార్థం





నేనే.. అది నేనే

కార్టూన్స్ : సతీష్ ఆచార్య

**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**

Vol : 3 - Issue No : 9 June 2025


# కొత్త పుస్తకాల స్వీకారం





వెల : 200/-

వివరాలకు..
98495 25765

వెల : 250/-





వెల : 100/-

వివరాలకు..
85006 78977

వెల : 150/-




if undeliverd please return to:
**B.Ramesh Chandra Babu**
34-15-1, Doddipatla Vaari Thota
Veedhi, Tanuku - 534 211
West Godavari, Ap
Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.